సెప్టెంబర్ 2026

245

సంపుటి : 22 సంచిక : 4

వెల రూ. 15/-

# మార్క్సిస్టు

MARXISTU

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

పెట్టుబడిదారీ విధానం - ఆర్థిక సంక్షోభం

కనిపించేది మనమే కానీ.. చూపించేది అల్గోరిథమ్!

ఇంతకీ సనాతన ధర్మం అంటే ఏమిటి?

13 -14 శతాబ్దాల్లో దక్షిణ భారతదేశం

చైనా - భారత్ అభివృద్ధిలో అసమానతలు ఎందుకు?

ఒక కొత్త, డిజిటల్ తరం ప్రజా క్షేత్రాన్ని చేజిక్కించుకుంది

అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంవల్ల రైతుల దివాళా

వాళ్లు విద్యను ఎందుకు ద్వేషిస్తున్నారు?

అమెరికాలో డేటా సెంటర్లపై వెల్లువెత్తుతున్న వ్యతిరేకత

జీవుల సృష్టిపై శాస్త్రీయ వెలుగులు ప్రసరించిన డార్విన్ సిద్ధాంతం

ఆదర్శ కమ్యూనిస్టు సారంపల్లి మల్లారెడ్డి

# ఆదర్శ కమ్యూనిస్టు సారంపల్లి మల్లారెడ్డి

**ఎస్ వీరయ్య**
(సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు)



**25-8-1939** **24-8-2026**

సిపిఐ(ఎం) తెలంగాణా రాష్ట్ర కార్యాలయంలో అందరికన్నా వయసులో పెద్ద, పనిలో మాత్రం అందరికన్నా యువకుడు. ఆయనే సారంపల్లి మల్లారెడ్డి. సీనియర్ రైతు నాయకుడు, ఎఐకెఎస్ మాజీ ఉపాధ్యక్షుడు, ఐదు దశాబ్దాలకు పైగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రైతు సంఘానికి ప్రముఖ నాయకుడిగా ఉన్న కామ్రేడ్ మల్లా రెడ్డి, ఆగస్టు 24వ తేదీ సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆయన వయస్సు 88 సంవత్సరాలు. 1939 ఆగస్టు 25న జన్మించిన కామ్రేడ్ మల్లా రెడ్డి తన జీవితమంతా శ్రామిక ప్రజలు మరియు రైతాంగం కోసం అంకితం చేశారు. 1973లో పూర్తికాల కార్యకర్తగా మారి, నర్సంపేట ప్రాంతం, వరంగల్‌తో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా రైతు ఉద్యమ నిర్మాణంలో మార్గదర్శక పాత్ర పోషించారు.

యుక్తవయసులో నర్సంపేట గ్రామాలలో భూ పోరాటాలలో పాల్గొన్నారు. నడివయసులో రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ బాట పట్టారు. పోలీసు పటేల్ హోదాలో కూడా భూస్వామ్య వ్యతిరేక పోరాటంతో మమేకమయ్యారు. ఆ కారణంతోనే పాలకులు పోలీస్ పటేల్ పదవి నుంచి ఆయనను తొలగించారు. కేసులలో ఇరికించి జైలుకు పంపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుడుగా సాగునీటి సమస్యల అధ్యయనానికి శ్రీకారం చుట్టారు. పోరాటానికి బాటలు వేశారు. రాష్ట్ర స్థాయి రైతు నాయకుడుగా, వ్యవసాయ నిపుణులుగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో గుర్తింపు పొందారు.

వ్యవసాయం, సాగునీరు, ప్రభుత్వ బడ్జెట్లకు సంబంధించిన విషయాలలో మల్లారెడ్డి నిష్ణాతులు. కల్తీ విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరిశోధనారంగాల్లో బహుళజాతి సంస్థల దోపిడీ మీద కత్తులు దూసిన కలం యోధుడు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) శ్రేణులు, రైతాంగ పోరాట కార్యకర్తలే కాదు అనేక మంది పాత్రికేయులు, వివిధ పార్టీల నాయకులు, మేధావులు, పరిశోధకులు సహితం సారంపల్లి మల్లారెడ్డి సహాయం పొందినవారే. సమాచారం అడిగిన వారికి తెలిసింది చెప్పటమే కాదు, తెలుసుకొని చెప్పటం ఆయన అలవాటు. పంచెకట్టుతో తెలంగాణ గ్రామీణ తాతయ్య రూపంలో ఉన్న మేధావి ఆయన. గొప్ప పరిశోధకులు, వ్యవసాయ శాస్త్రజ్ఞులకు కూడా వ్యవసాయ రంగానికి సంబంధించిన క్షేత్రస్థాయి లోని అనుభవ జ్ఞానాన్ని సమకూర్చిన జ్ఞాన సంపన్నుడాయన. అధ్య యనంతో కూడిన అనుభవ జ్ఞానమే ఆయనను ఆ స్థానానికి చేర్చింది. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు, ప్రాంతాలు, పంటలు, రైతాంగ సమస్యలు ఆయనకు కొట్టిన పిండి. ఆయన సందర్శించని సాగునీటి ప్రాజెక్టు లేదు. అధ్యయనం చేయని రైతాంగ సమస్య లేదు. వ్యవసాయరంగంలో వివిధ దేశాల అనుభవాలను కూడా అధ్యయనం చేశారు. ఆయన నిరంతర అధ్యయన శీలి. నిర్దిష్టంగా ఆచరణకు అవసరమైన అధ్యయనం ఆయన ప్రత్యేకత. నమ్రత, కలుపుగోలుతనానికి ఆయన పెట్టింది పేరు. గ్రామీణ రైతు రూపంలో ఉండి ఇంటర్నెట్ వాడుతూ కంప్యూటర్ మీద పనిచేసిన మేధావి ఆయన. సమాచారం సేకరించడమే కాదు. అంకెలు ఆయన పెదవుల మీద కదలాడుతుంటాయి. సమాచారాన్ని నిక్షిప్తం చేయటం, అవసరానికి తగిన విధంగా వినియోగించడంలో దిట్ట. అదొక సమాచార బ్యాంకు.

మూడు తరాల కమ్యూనిస్టు కార్యకర్తలకు సంధానకర్త సారంపల్లి మల్లారెడ్డి. పేరు ప్రఖ్యాతుల కోసం, పదవుల కోసం ఆయన ఎప్పుడూ ఆరాటపడలేదు. ఉద్యమావసరాలే ఆయనను అనేక స్థాయిల్లో నిలబెట్టాయి. గ్రామస్థాయి కార్యకర్త నుంచి రాష్ట్రస్థాయి కమ్యూనిస్టు నాయకుడిగా, రైతాంగ ఉద్యమ నేతగా అంచెలంచెలుగా ఎదిగిన నాయకుడాయన. ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమంలో భూస్వాముల దౌర్జన్యాలనే కాదు, నక్సలైట్ల దాడుల నుంచి కూడా పార్టీని కాపాడుకోవాల్సి వచ్చింది. 1964 జూలై 1న ఆయన అన్న పోలీసు పటేల్ బాధ్యతలకు రాజీనామా చేసి పార్టీ తరుపున సర్పంచ్‌గా ఎన్నికయ్యాడు. ఆ స్థానంలో 1971 ఆగస్టు 6 వరకు సారంపల్లి మల్లారెడ్డి పోలీస్ పటేల్‌గా పని చేశారు. అలాంటి బాధ్యతలో వుండి కూడా కమ్యూనిస్టు ఆలోచనలతో ఉద్యమానికి అండగా నిలవడం అయన ప్రత్యేకత. ఆ కాలంలో పార్టీ తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్నది. భరించలేని వడ్డీలు, నాగు (బస్తా ధాన్యం అప్పు తీసుకుంటే మరో బస్తా కలిపి చెల్లించాలి) తదితర భారాలకు వ్యతిరేకంగా పార్టీ పోరాడి విజయం సాధించిన కాలం. పోలీసు పటేల్ స్థానంలో ఉండి రహస్యంగా సహకరించి అండగా నిలిచారు. పార్టీ శ్రేణుల మీద కాంగ్రెస్ మూకల దాడులను పార్టీ సమర్ధవంతంగా తిప్పికొట్టింది. ఆ సమయంలో పోలీస్ పటేల్‌గా పోలీసు వ్యవస్థకు సహకరించవలసిన సారంపల్లి మల్లారెడ్డి కమ్యూనిస్టు పార్టీ శ్రేణులకే అండగా నిలవడాన్ని ప్రభుత్వం గమనించింది. 1971

(మిగతా 34వ పేజీలో)

## ఈ సంచికలో...


1. ఆదర్శ కమ్యూనిస్టు సారంపల్లి మల్లారెడ్డి
ఎస్ వీరయ్య.........2

2. పెట్టుబడిదారీ విధానం - ఆర్థిక సంక్షోభం
ప్రభాత్ పట్నాయక్.......4

3. కనిపించేది మనమే కానీ.. చూపించేది అల్గోరిథమ్! డి ఉదయ్ కిరణ్.......8

4. ఇంతకీ సనాతన ధర్మం అంటే ఏమిటి?
ఎంవి ఆంజనేయులు.....13

5. 13-14 శతాబ్దాల్లో దక్షిణ భారతదేశం
ఎంవి ఎస్ శర్మ.......16

6. చైనా - భారత్ అభివృద్ధిలో అసమానతలు ఎందుకు? వి రాంభూపాల్........21

7. ఒక కొత్త, డిజిటల్ తరం ప్రజా క్షేత్రాన్ని చేజిక్కించుకుంది
ప్రభీర్ పుర్కాయస్థ......23

8. అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంవల్ల రైతుల దివాళా నళిన్ వర్మ........25

9. వాళ్లు విద్యను ఎందుకు ద్వేషిస్తున్నారు?
రవిశంకర్ మిశ్రా ......27

10. అమెరికాలో డేటా సెంటర్లపై వెల్లువెత్తుతున్న వ్యతిరేకత నిక్ ఎంజెల్‌ఫ్రైడ్ ......29

11. జీవుల సృష్టిపై శాస్త్రీయ వెలుగులు ప్రసరించిన డార్విన్ సిద్ధాంతం పిబి చారి......32



**సంపాదకుడు:**
**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# ప్రశ్నను అంతం చేస్తారా!

ఇంతకీ నక్సలిజం అంతమయిందా లేదా? ఏమిటీ ప్రశ్న అనుకోకండి! దేశంలో నక్సలిజం అంతమైందని ఈ ఏడాది మార్చి 31న కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. అయితే, నాలుగున్నర మాసాల్లో మళ్లీ దేశంలో నక్సలిజం పుట్టుకొచ్చిందని ప్రధాని నరేంద్ర మోడీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసగంలో చెప్పారు. కానీ, గతంలో 'అర్బన్ నక్సలైట్లు', 'ఆందోళన జీవులు' అన్నట్లే ఇప్పుడు దిమాగీ నక్సలైట్లు (మేధో నక్సలైట్లు) అనే కొత్త పదాన్ని ఆయన జనం మీదకు వదిలారు. నిజానికి మోడీ ఆ మాట వాడటం వెనుక ఒక పరమార్థం ఉంది. దేశంలో సమస్యలపై ప్రశ్నించే, ప్రభుత్వాన్ని నిలదీసే మేధస్సును (దిమాగీని) అంతం చేయడమే ఆయనా, ఆయన ప్రభుత్వ ఉద్దేశం. కాకపోతే నేరుగా ఆ మాట చెబితే ప్రజలనుండి అంగీకారం రాదు కాబట్టి వారు ఏనాడో అంతమైపోయారన్న నక్సల్స్ అన్న పదాన్ని దానికి తగిలించారు.

భారతీయుల మేధస్సుతో మోడీకీ, బిజెపి ప్రభుత్వానికీ వచ్చిన సమస్య ఏమిటో తెలుసుకుంటే ఆయన స్వాతంత్ర్య దినోత్సవం వంటి ముఖ్యమైన సందర్భంలో ఈ ప్రస్తావన ఎందుకు తెచ్చారో అర్థమవుతుంది. భారత ప్రజల ఆలోచనలను మత విద్వేషాల చుట్టూ, కుల పంచాయితీల చుట్టూ తిప్పుతూ దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, అధిక ధరలు, ఆకలి, నిరక్షరాశ్యత వంటి ముఖ్య సమస్యలనుండీ, అంబానీ, ఆదానీ వంటి కార్పొరేట్లకు దోచిపెట్టే ప్రభుత్వ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాల నుండి పక్కకు మళ్లించడం సాధ్యమేనని ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి నమ్మింది, ఆచరణలో పెట్టింది, కొంతవరకు విజయం కూడా సాధించింది కూడా. కార్పొరేట్ మీడియా ప్రచారం, సోషల్ మీడియాపై పట్టు దానికి సహకరించాయి. అయితే, ఎంతటి ప్రచారం అయినా జీవితవాస్తవికతను చెరిపివేయలేదు కదా! చాలీ చాలని వేతనాలతో పొట్టగడవని కార్మికులు ఇటీవల ఢిల్లీ దాని పరిసర రాష్ట్రాల్లో తిరగబడ్డారు. నిరుద్యోగ పీడితులైన విద్యార్థులు విద్యారంగంపైనే తిరుగుబాటు జెండా ఎగురవేశారు. పేపర్ లీకులకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా మంత్రి రాజీనామా చేసేవరకు లాఠీలు, తూటాలు, జైళ్లను లెక్కచేయకుండా పోరాడారు. తరువాత వారి పోరాటాన్ని నూతన విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని ప్రయివేటీకరించడం వల్ల వచ్చిన అనర్థాలపైకి మళ్లించారు. అంతకు ముందు ఏడాదిపాటు వీరోచిత పోరాటం చేసి డిమాండ్లు సాధించుకున్న భారతీయ రైతాంగం వ్యవసాయాన్ని సంక్షోభం నుండి బయటపడేసే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలన్న పట్టుదలతో ముందుకు పోతోంది.


అందువల్ల నిజ జీవిత సమస్యలనుండి ప్రజల దృష్టి మళ్లించేందుకు, ప్రశ్నించే గొంతులను నొక్కేందుకు ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి పరివారం ఉపయోగించిన అస్త్రాలన్నిటినీ ప్రజా ఉద్యమం అధిగమించింది కనుక దానికి పాత నినాదాల స్థానంలో కొత్త నినాదాలు కావలసి వచ్చాయి. ఇప్పుడు చదువుకున్న యువతరం ఉద్యమాల్లోకి వస్తోంది కనుక వారిని అణచడానికి మేధస్సునే అణిచేయాలనే ఫాసిస్టు నినాదం ఎత్తుకుంది.

కానీ భారతీయ మేధస్సుకు సుదీర్ఘమైన చరిత్ర ఉంది. వేద వేదాంగాలు క్రతువుల నిర్వహణపై కేంద్రీకరిస్తే, ఆ క్రతువుల తర్కాన్నే ప్రశ్నించాయి లోకాయత, బౌద్ధం వంటి శ్రమణక మతాలు. నిండు మేధో సభలో యజ్ఞవల్క్యుని ప్రశ్నించింది గార్గి. మధ్య యుగాల్లో ప్రభువుల ఆధిపత్యాన్ని భక్తి ఉద్యమాలు ప్రశ్నిస్తే, బ్రిటిష్ వాడి దోపిడీని స్వాతంత్రోద్యమం ప్రశ్నించింది. నిజానికి ప్రశ్న లేకపోతే సైన్సు లేదు, సామాజికాభివృద్ధీ లేదు. బ్రిటిష్ వాడితో రాజీపడి దేశ స్వాతంత్ర్యోద్యమానికి ద్రోహం చేసిన సంఘ్ పరివార్ ఇప్పుడు కూడా ప్రశ్నను చూసి భయపడిపోతోంది. ప్రశ్న భారతీయ సాంప్రదాయం అని మరిచిపోతున్నది. చరిత్రలో అనేక సందర్భాల్లో ప్రశ్నను నిలువెత్తు గోయి తీసి పాతిపెట్టినప్పటికీ అది గ్రీకు పురాణ పక్షి ఫోనిక్స్ లాగా మళ్లీ, మళ్లీ లేచి వస్తుందన్న విషయాన్ని వారు తెలుసుకోలేకపోతున్నారు. అందుకే, నక్సలైట్లను అంతం చేశాం, కమ్యూనిస్టులు మూడు రాష్ట్రాల్లో ఓడిపోయారు అని సంబరపడుతున్న వారికి జెన్ జి యువతరం నుండి వస్తున్న ప్రశ్నలు కలవరపరుస్తున్నాయి. యువత భారత దేశంలో ప్రభుత్వ పాఠశాలల మూతనూ, ఉన్న పాఠశాలల దుస్థితినీ ప్రశ్నిస్తున్నది. పరీక్షా విధానాన్ని ప్రశ్నిస్తున్నది. మొత్తం విద్యా విధానాన్నే ప్రశ్నిస్తున్నది. వైద్య రంగం అధ్వాన్న స్థితిని ప్రశ్నిస్తున్నది. ఆర్థిక అసమానతలను ప్రశ్నిస్తున్నది. ప్రభుత్వ జవాబుదారీ తనాన్ని ప్రశ్నిస్తున్నది. కార్మికులు తమపై జరుగుతున్న దోపిడీని ప్రశ్నిస్తున్నారు. రైతాంగం వ్యవసాయ సంక్షోభానికి కారణం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానాలు చెప్పలేని బిజెపి ప్రభుత్వం ప్రశ్ననే నిరంకుశంగా అంతం చేయడానికి చేస్తున్న ప్రయత్నమే మోడీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం. కానీ ఈ చీకటి శక్తుల ప్రయత్నాలు ఫలించవని చరిత్ర పదేపదే రుజువు చేసింది. ఇప్పుడు కూడా అదే జరగబోతోంది.

**ఈ మాసం ముఖ్యాంశం**

# పెట్టుబడిదారీ విధానం-ఆర్థిక సంక్షోభం

**ప్రభాత్ పట్నాయక్**



రచయిత ప్రముఖ మార్క్సిస్టు ఆర్థిక వేత్త. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ ఎకనామిక్ స్టడీస్ అండ్ ప్లానింగ్‌లో ప్రొఫెసర్ ఎమిరిటస్

పెట్టుబడిదారీ విధానం ఎదుర్కొంటున్న ప్రస్తుత సంస్థాగత సంక్షోభంలో కనీసం రెండు కీలకమైన ఆర్థిక అంశాలు ఇమిడి ఉన్నాయి. మొదటిది, నయా–ఉదారవాద దశలోని ప్రపంచ పెట్టుబడిదారీ విధానం ఎదుర్కొంటున్న మాంద్యం, పెరిగి పోతున్న నిరుద్యోగం. అమెరికా వంటి అనేక దేశాలలో పెరిగిపోతున్న ఈ నిరుద్యోగం, పని భాగస్వామ్య రేటు తగ్గడం వల్ల బయటకు కనిపించడం లేదు, కానీ ఈ వాస్తవాన్ని తిరస్కరించలేము. ఈ మాంద్యం కోవిడ్ మహమ్మారి కంటే ముందే స్పష్టంగా కనిపించింది. 2010 దశాబ్దంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దశాబ్దపు వృద్ధి రేటు, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఏ దశాబ్దంలోనూ లేనంత తక్కువగా ఉంది.

**మిగులు వాటా పెరుగుదల: ముందస్తు అతి–ఉత్పత్తి**

ఈ మాంద్యానికి కారణం స్వయంగా నయా–ఉదారవాద పెట్టుబడిదారీ విధానం స్వభావంలోనే ఉంది. ఈ విధానాలు ప్రతి దేశంలోనూ ఆదాయ, సంపద అసమానతలను తీవ్రంగా పెంచి పోషించాయి. నయా–ఉదారవాద పాలనలో పెట్టుబడి (ఫైనాన్స్‌తో సహా) ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛగా రాకపోకలు సాగించగలదు, కానీ కార్మికులు మాత్రం తమ తమ దేశాలకే పరిమితమై ఉంటారు (ప్రత్యేకంగా వలస వెళ్ళడానికి అనుమతి పొందితే తప్ప). దీనివల్ల అభివృద్ధి చెందిన దేశాలలోని కార్మికులు, అభివృద్ధి చెందుతున్న దేశాలలోని తక్కువ వేతన కార్మికులతో పోటీ పడాల్సి వస్తుంది, ఎందుకంటే పెట్టుబడి ఎప్పుడైనా అభివృద్ధియ చెందుతున్న దేశాలకు తరలిపోగలదు. ఫలితంగా, అభివృద్ధి చెందిన దేశాల కార్మికుల నిజమైన వేతనాలలో పెరుగుదల దాదాపు శూన్యం. 2011లో ఒక సాధారణ అమెరికన్ పురుష కార్మికుడి సగటు నిజమైన వేతనం 1968 నాటి కంటే స్వల్పంగా తక్కువగా ఉందని జోసఫ్ స్టిగ్లిట్జ్ అంచనా వేశాడు.

అదే సమయంలో, అభివృద్ధి చెందిన దేశాల నుండి అభివృద్ధి చెందుతున్న (దక్షిణార్ధగోళ) దేశాలకు పరిశ్రమలు తరలి వెళ్ళినప్పటికీ, దక్షిణార్ధగోళ దేశాలలోని భారీ లేబర్ రిజర్వ్ సైన్యం (నిరుద్యోగం–వలస పాలన గతం నుండి వచ్చిన వారసత్వం) ఏమాత్రం తగ్గలేదు. తద్విరుద్ధంగా, శ్రామిక శక్తితో పోలిస్తే ఇది ఇంకా పెరుగుతూ వచ్చింది. ప్రపంచ మార్కెట్‌లో నయా–ఉదారవాద పోటీ తీవ్రతరం కావడం మూలంగా వేగవంతమైన సాంకేతిక మార్పులు చోటుచేసుకుని, ప్రతిచోటా ఉత్పాదకత పెరగడమే దీనికి కారణం. శ్రామిక శక్తి తగ్గుముఖం పట్టకపోవడం వల్ల దక్షిణార్ధగోళంలో నిజ వేతనాలు జీవన వ్యయ స్థాయిలోనే నిలకడగా ఉండిపోతున్నాయి.

ఫలితంగా, ఉత్తర, దక్షిణ దేశాలు రెండింటిలోనూ శ్రామిక ఉత్పాదకత వేగంగా పెరుగుతున్నప్పటికీ నిజ వేతనాలు పెరగడం లేదు. ఇది ప్రపంచ ఉత్పత్తిలో, దేశాల అంతర్గతంగా ఆర్థిక మిగులు వాటా పెరగడానికి దారితీస్తోంది. ఆదాయంలో అధిక భాగం ఆర్థిక మిగులుపై ఆధారపడి జీవించే వారి కంటే శ్రామిక ప్రజల చేతనే ఖర్చు చేస్తున్నారు. కాబట్టి, ఆర్థిక మిగులు వాటా పెరగడం వల్ల వినియోగ డిమాండ్ తగ్గుతుంది, దానివల్ల ఉత్పత్తయ్యే సరుకులతో పోలిస్తే మొత్తం డిమాండ్ తగ్గిపోతుంది. ఇది ముందస్తు అతి–ఉత్పత్తికి దారి తీస్తుంది, దీని ఫలితంగానే మాంద్యం ఏర్పడి, నిరుద్యోగం పెరిగిపోతా ఉంది.

**ప్రభుత్వ వ్యయం: నయా–ఉదారవాద విధానాల అడ్డంకులు**

అయితే, నయా – ఉదారవాద పెట్టుబడిదారీ విధానంలో గమనించదగిన విచిత్రం ఏమిటంటే, కేవలం ఈ మాంద్యం, నిరుద్యోగం మాత్రమే కాదు, దీనికి వ్యతిరేకంగా పనిచేసే అత్యంత శక్తివంతమైన ప్రతిచర్య – అంటే ప్రభుత్వ వ్యయం పెంచడం – కూడా నయా – ఉదారవాదంలో పూర్తిగా నిరుపయోగంగా మారుతుంది.

మాంద్యాన్ని నివారించడానికి ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా సగటు డిమాండును పెంచాలంటే అందుకు రెండే మార్గాలు ఉన్నాయి.

1. ద్రవ్య లోటు ద్వారా: దీనివల్ల ఎవరిపై కొత్తగా పన్నులు వెయ్యనక్కరలేదు. కాబట్టి ఎవరి వినియోగ సామర్థ్యం తగ్గదు, ప్రభుత్వం చేసే ఖర్చు వల్ల నికరంగా డిమాండ్ పెరుగుతుంది.

2. ధనికులపై ఎక్కువ పన్నులు విధించడం ద్వారా: ధనికులు తమ ఆదాయంలో కొంత భాగాన్ని పొదుపు చేస్తారు కాబట్టి, పన్నుల వల్ల వారి వినియోగం పూర్తిగా తగ్గిపోదు, ఫలితంగా ప్రభుత్వం పన్ను ద్వారా వచ్చిన రాబడిని ఖర్చు చేసినప్పుడు నికర డిమాండ్ పెరుగుతుంది.

ఒకవేళ ఈ వ్యయాన్ని శ్రామిక ప్రజలపై పన్నులు వేసి సేకరిస్తే, వారు తమ పూర్తి ఆదాయాన్ని వినియోగిస్తారు కాబట్టి, ప్రభుత్వ వ్యయం వల్ల పెరిగిన డిమాండ్ శ్రామికుల వినియోగ శక్తి తగ్గడం వల్ల సమమైపోతుంది.

> **“ కార్పొరేట్-నయా-ఫాసిస్ట్ కూటమి ప్రజాస్వామ్య హక్కులను, వ్యవస్థలను అణచి వేస్తుంది. రాజకీయ ప్రత్యర్థులు, మేధావులు, కళాకారులు, వామపక్షాలపై ప్రభుత్వ అణచి వేతకు, ఫాసిస్ట్ గుండాల దాడులకు ప్రోత్స హిస్తుంది. “దేశానికి” సంకేతంగా ఒక “నాయ కుడి” చుట్టూ వ్యక్తి పూజను పెంచుతుంది. శ్రామిక వర్గాన్ని విభజించడానికి, కార్పొరేట్ ఆధిపత్యానికి ముప్పు రాకుండా చూడటానికి ద్వేషపూరితమైన ఆలోచనలను ప్రచారం చేస్తుంది. ”**

దీనివల్ల మాంద్యం తగ్గదు, నిరుద్యోగం నుండి ఎలాంటి ఉపశమనమూ లభించదు.

అయితే ఈ రెండు రకాల ప్రభుత్వ వ్యయ పెంపుదల మార్గాలను ద్రవ్య పెట్టుబడి తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ధనికులపై ఎక్కువ పన్నులు వేయడాన్ని ఇది వ్యతిరేకిస్తుంది ఎందుకంటే బడా ఫైనాన్షియర్లు కూడా ధనికులలో భాగమే. అలాగే అధిక ద్రవ్య లోటును కూడా అది వ్యతిరేకిస్తుంది. అందుకే నయా-ఉదారవాద యుగంలో చాలా దేశాలు ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ పేరిట చట్టాలను తీసుకువచ్చి, ద్రవ్య లోటును జిడిపిలో ఒక నిర్దిష్ట శాతానికి (సాధారణంగా 3 శాతానికి) పరిమితం చేశాయి.

ద్రవ్య పెట్టుబడి ప్రపంచవ్యాప్తమైనది, కానీ రాజ్యం మాత్రం ఒక దేశానికే పరిమితం. అందువల్ల ప్రభుత్వ విధానాలలో ద్రవ్య పెట్టుబడి మాటే చెల్లుబాటు అవుతుంది. అలా కాని పక్షంలో ఆ దేశం నుండి పెట్టుబడులు ఉడాయించి ఆర్థిక సంక్షోభానికి దారి తీస్తుంది. కాబట్టి నయా-ఉదారవాదం కేవలం మాంద్యం, నిరుద్యోగాన్ని సృష్టించడమే కాకుండా, వాటిని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన శక్తివంతమైన చర్యలను కూడా అడ్డుకుంటుంది. నయా- ఉదారవాదం సృష్టించిన ఈ సంక్షోభం నుండి బయటపడడం ఆ వ్యవస్థ పరిధిలో కొనసాగుతూనే సాధించడం అసాధ్యం. అంటే, నయా-ఉదారవాదాన్ని అధిగమించి ముందుకు వెళితే తప్ప ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి ఈ సంక్షోభం నుండి విముక్తి లేదు. నేడు ప్రపంచ పెట్టుబడిదారీ విధానం సరిగ్గా ఇలాంటి ఒక అంధకారబంధుర స్థితిలో చిక్కుకుపోయి ఉన్నది.

**జడలు విప్పుతున్న నయా-ఫాసిజం**

ఈ అంధకార స్థితికి ప్రతిస్పందనగా ప్రపంచ పెట్టుబడిదారీ విధానం ఇప్పటివరకు “నయా-ఫాసిజాన్ని పెంచి పోషించింది. ప్రతి ఆధునిక సమాజంలోనూ ఏదో ఒక మలుపులో నయా-ఫాసిస్ట్ శక్తులు ఉంటాయి, ఇవి మెజారిటీ ప్రజలలో ఏదో ఒక మైనారిటీ తరగతుల ప్రజానీకం పట్ల ద్వేషాన్ని పెంచుతాయి, అయితే సాధారణంగా ఇవి సమాజంలో బయటి అంచున మాత్రమే ఉంటాయి.

గుత్త పెట్టుబడి, కొత్త కార్పొరేట్ వర్గాల ఆర్థిక తోడ్పాటు, వాటి పనుపున మీడియా మద్దతు లభించడం ద్వారా ఈ శక్తులు ప్రధాన స్రవంతిలోకి, అధికారంలోకి రావడానికి వీలవుతుంది. ఆర్థిక సంక్షోభం తీవ్రమై చిన్న వర్తకులు, శ్రామిక వర్గం, చిన్న పెట్టుబడిదారులలో అసంతృప్తి పెరిగి, గుత్త పెట్టుబడి ఆధిపత్యానికి ముప్పు ఏర్పడినప్పుడు మాత్రమే ఇలా జరుగుతుంది.

కార్పొరేట్-నయా-ఫాసిస్ట్ కూటమి ప్రజాస్వామ్య హక్కులను, వ్యవస్థలను అణచి వేస్తుంది. రాజకీయ ప్రత్యర్థులు, మేధావులు, కళాకారులు, వామపక్షాలపై ప్రభుత్వ అణచి వేతకు, ఫాసిస్ట్ గుండాల దాడులకు ప్రోత్స హిస్తుంది. “దేశానికి” సంకేతంగా ఒక “నాయ కుడి” చుట్టూ వ్యక్తి పూజను పెంచుతుంది. శ్రామిక వర్గాన్ని విభజించడానికి, కార్పొరేట్ ఆధిపత్యానికి ముప్పు రాకుండా చూడటానికి ద్వేషపూరితమైన ఆలోచనలను ప్రచారం చేస్తుంది.

నేడు ప్రపంచవ్యాప్తంగా నయా-ఫాసిజం విజృంభించడం ప్రపంచ పెట్టుబడిదారీ విధాన సంస్థాగత సంక్షోభానికి నిదర్శనం. అర్జెంటీనా,, ఇటలీ, అమెరికా వంటి కొన్ని దేశాలలో నయా-ఫాసిస్టులు అధికారాన్ని దక్కించుకున్నారు. ఫ్రాన్స్, జర్మనీ వంటి ఇతర దేశాలలో వారు అధికారానికి దగ్గరగా ఉన్నారు. కానీ ప్రతిచోటా పచ్చి మితవాద శక్తుల మొగ్గు కనిపిస్తా ఉంది.

అయితే, ఈ ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించే శక్తి నయా - ఫాసిజానికి కూడా లేదు. ఉదారవాద-బూర్జువా ప్రభుత్వాన్ని మాంద్యాన్ని ఎదుర్కోకుండా ఏ అంశాలైతే నిరోధించాయో, అవే అంశాలు నయా-ఫాసిస్ట్ ప్రభుత్వాన్ని కూడా నిరోధిస్తాయి. జాతి రాజ్యాల ప్రపంచంలో ద్రవ్య పెట్టుబడి అంతర్జాతీయ కరణ మూలంగా ఏర్పడే వైరుధ్యం ఉదారవాద ప్రభుత్వాన్ని ఎంతగా వేధిస్తుందో నయా-ఫాసిస్ట్ ప్రభుత్వాన్ని కూడా అంతే వేధిస్తుంది.

ఫలితంగా, 1930లలో సాంప్రదాయ ఫాసిజం చేసినట్లుగా - అంటే ద్రవ్య లోటుతో కూడిన భారీ సైనిక వ్యయం ద్వారా నిరుద్యోగాన్ని సమసి పోయేలా చూడడం - నేటి నయాఫాసిజం చేయలేదు. దాని మూలంగా సమాజంపై నయా-ఫాసిజానికి తక్కువ నియంత్రణ కల్పిస్తుంది, కానీ దానిని దీర్ఘ కాలం కొనసాగేలా చేస్తుంది. వారు ఎన్నికల్లో ఓడిపోవచ్చు (ఎందుకంటే ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసినప్పటికీ ఎన్నికలను పూర్తిగా రద్దు చేయరు), కానీ వారు మళ్లీ అధికారంలోకి రావడానికి సిద్ధంగా ఉంటారు (డొనాల్డ్ ట్రంప్ మాదిరిగా ).

అయితే నయా-ఫాసిస్టులకు కూడా ఒక ఆర్థిక ఎజెండా ఉండక తప్పదు, ఎందుకంటే మైనారిటీలపై ద్వేషం మాత్రమే ఎల్లవేళలా అధికారం చెలాయించడానికి సరిపోదు. జాతి రాజ్యానికి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి మధ్య ఉన్న వైరుధ్యాన్ని అధిగమించడానికి ఉన్న రెండు మార్గాలు నయా-ఫాసిజం అనుసరించలేదు

అంతర్జాతీయ పెట్టుబడిని నియంత్రించడానికి , ప్రపంచ సగటు డిమాండును పెంచడానికి “ప్రపంచ రాజ్యం”గా ఏర్పడటం లేదా దానిని అనుకరించడం - అంటే అనేక దేశాలు కలిసి ద్రవ్య లోటును పెంచడం ద్వారా లేదా ధనికులపై ఒకేసారి పన్నులు వేయడం ద్వారా - ఒక సమన్వయ వ్యయాన్ని చేయడం అవసరం.

జాతీయ స్థాయిలో పెట్టుబడుల ప్రవాహాలపై నియంత్రణలు విధించడం ద్వారా, ముందుగా మనం చెప్పుకున్నట్లు రెండు మార్గాల ద్వారా ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం ద్వారా గ్లోబలైజేషన్ నుండి పూర్తిగా విడగొట్టుకోవాలి.

గుత్త పెట్టుబడి ఈ రెండింటినీ తిరస్కరిస్తుంది, ఎందుకంటే అవి దాని ఆధిపత్యాన్ని సవాలు చేస్తాయి. ఈ నేపథ్యంలో నయా-ఫాసిజం ఏ రకమైన కార్యక్రమాన్ని ప్రతిపాదిస్తుంది అనేది ఆసక్తికరమైన అంశంగా మారుతుంది.

**యుద్ధానంతర పెట్టుబడిదారీ విధానం: వలసలు లేని నాయకుడు**

ప్రస్తుత సంక్షోభపు రెండవ ఆర్థిక అంశం రెండవ ప్రపంచ యుద్ధానంతర పెట్టుబడిదారీ

> **“ 1910లో బ్రిటన్ తన వలసల నుండి (ముఖ్యంగా భారత్ నుండి వచ్చిన 6 కోట్ల డాలర్ల మిగులు ద్వారా) యూరప్, అమెరి కాలతో తనకున్న లోటులో మూడింట రెండు వంతులను భరించగలిగింది. భారత్‌పై వేసిన పన్నులు, భారత ఎగుమతి మిగులును బ్రిటన్ కాజేయడం వల్ల ఇది సాధ్యమైంది. అమెరికాకు అలాంటి వలసలు లేకపోవడం వల్ల అది అప్పుల్లో మునిగిపోయింది. ”**

విధానపు స్వభావంలో ఉంది. రెండవ ప్రపంచ యుద్ధానంతర పెట్టుబడిదారీ విధానం, మొదటి ప్రపంచ యుద్ధానికి పూర్వం ఉన్న పెట్టుబడిదారీ విధానం కంటే ఒక ముఖ్యమైన విషయంలో భిన్నంగా ఉంది. యుద్ధానంతర కాలంలో ఈ వ్యవస్థ తన వలస సామ్రాజ్యాన్ని కోల్పోవాల్సి వచ్చింది. దీని వలన రెండు విషయాలు స్పష్టం అవుతాయి.

గతంలో తను చిటిక వేస్తే సిద్ధంగా ఉండే మార్కెట్లను కోల్పోయింది.

వలస ప్రాంతాల నుండి వచ్చే వార్షిక “మిగులు దోపిడీ” కొత్త నాయకుడైన అమెరికాకు దక్కకుండా పోయింది.

ఈ “దోపిడీ” అంటే నాటి నాయకత్వ దేశమైన బ్రిటన్, తన వలస ప్రాంతాలు ప్రపంచంతో కలిగిన ఎగుమతి మిగులును ఎలాంటి ప్రతిఫలం లేకుండా ఉచితంగా లాక్కునేది. వలస పాలన నుండి అనేక దేశాలు విముక్తి పొందినందున ఈ దోపిడీ ముగిసిపోయింది.

పెట్టుబడిదారీ ప్రపంచానికి ఎల్లప్పుడూ ఒక నాయకత్వ దేశం ఉంటుంది. దాని ఆధ్వర్యంలోనే పెట్టుబడిదారీ విధానం కొత్త ప్రాంతాలకు వ్యాపిస్తుంది. అది వ్యవస్థకు రక్షకుడిగా పనిచేస్తుంది. ఈ నాయకత్వ బాధ్యత నెరవేర్చాలంటే నాయకత్వ దేశం ఇతర వలసేతర దేశాలతో కరెంట్ ఖాతా లోటును నడపాల్సి ఉంటుంది. ఎందుకంటే పెట్టుబడి కొత్త దేశాలకు వ్యాపించాలంటే ఆ దేశాలకు తమ సరుకుల అమ్మకానికి మార్కెట్ కావాలి, నాయకత్వ దేశం తన మార్కెట్‌ను తెరిచి ఉంచి ఆ లోటును భరించాలి. అలాగే అంతర్జాతీయంగా తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి భారీగా వ్యయం చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు, అమెరికా ప్రపంచవ్యాప్తంగా 750 కంటే ఎక్కువ సైనిక స్థావరాలను నిర్వహి స్తోంది, ఇది దాని కరెంట్ ఖాతా లోటుకు తోడ్పడుతుంది.

గతంలో బ్రిటన్ వలస ప్రాంతాల నుండి దోపిడీ ద్వారా, ఆ మార్కెట్లలో తన సరుకులను అమ్మడం ద్వారా ఈ లోటును భరించి, అప్పుల్లో పడకుండా ఉండటమే కాకుండా, పెట్టుబడి ఎగుమతులు చేసే స్థితిలో ఉండేది. కానీ యుద్ధానంతర నాయకుడిగా అమెరికాకు అలాంటి వలస సామ్రాజ్యం లేకపోవడం వల్ల క్రమంగా బాహ్యగత అప్పుల్లోకి ( ఎక్స్‌టర్నల్ డెట్) లో కూరుకుపోయింది. దీనికి ఆర్థిక శక్తి ఉన్నప్పటికీ, పన్నుల రూపంలో వలసల నుండి సరుకులను ఉచితంగా పొందలేకపోయింది. అలాగే సుంకాల నిరోధం లేకుండా సరుకులను అమ్మలేకపోయింది. అందుకే, 1970ల నాటికే అమెరికా తీవ్ర లోటులోకి వెళ్లి, నేడు ప్రపంచంలోనే అత్యధికంగా అప్పులు ఉన్న దేశంగా మారింది.

1910లో బ్రిటన్ తన వలసల నుండి (ముఖ్యంగా భారత్ నుండి వచ్చిన 6 కోట్ల డాలర్ల మిగులు ద్వారా) యూరప్, అమెరి కాలతో తనకున్న లోటులో మూడింట రెండు వంతులను భరించగలిగింది. భారత్‌పై వేసిన పన్నులు, భారత ఎగుమతి మిగులును బ్రిటన్ కాజేయడం వల్ల ఇది సాధ్యమైంది. అమెరికాకు అలాంటి వలసలు లేకపోవడం వల్ల అది అప్పుల్లో మునిగిపోయింది.

**ఆర్థిక వ్యవస్థకు ప్రమాదం**

నాయకత్వ దేశపు కరెన్సీ “బంగారంతో సమానం” అని భావించినంత కాలం ఈ బాహ్యగత అప్పు పెద్ద సమస్య కాదు. బ్రెటన్ వుడ్స్ వ్యవస్థలో డాక్యుమెంటరీగా డాలర్ విలువ ఔన్స్ బంగారానికి $35 గా నిర్ణయించ బడింది. నిక్సన్ ప్రభుత్వం దీనిని రద్దు చేసినప్పటికీ, డాలర్‌పై నమ్మకం కొనసాగింది.

అయితే ప్రపంచంలో అత్యంత అప్పుల్లో ఉన్న అమెరికా పరిస్థితి, ప్రపంచవ్యాప్తంగా చలామణిలో ఉన్న ట్రిలియన్ల కొద్దీ డాలర్లు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు ముప్పుగా మారాయి. సంపద కలిగినవారు డాలర్లను వదిలి వేరే కరెన్సీకి మారతారనే కోణంలోనే ఈ ముప్పును సాధారణంగా చర్చిస్తారు. కానీ ఇక్కడ ప్రధానంగా గుర్తించాల్సింది ఏమిటంటే, డాలర్ల నుండి చమురు వంటి కీలకమైన సరుకుల వైపు మారితే వచ్చే ప్రమాదం.

బ్రెటన్ వుడ్స్ అనంతర వ్యవస్థ స్థిరత్వం అనేది చమురు యొక్క డాలర్ ధర స్థిరంగా ఉంటుందనే నమ్మకంపైనే ఆధారపడి ఉంది (దీనినే “ఆయిల్-డాలర్ స్టాండర్డ్” అంటారు). డాలర్ నుండి చమురు వైపు స్వల్పకాలిక మార్పు వచ్చినా ఈ వ్యవస్థ తీవ్రంగా అస్థిరపడుతుంది.

పాల్ బారన్ తన నివేదికలో పేర్కొన్నట్లుగా, ప్రభుత్వ అప్పులు జిడిపితో పోలిస్తే పెరిగే కొద్దీ, సరుకులపై స్పెక్యులేషన్ పెరిగి ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. ప్రపంచవ్యాప్తంగా అమెరికా కరెంట్ ఖాతా లోటు పెరగడం వల్ల కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. ద్రవ్యోల్బణం ఒక్కసారిగా విజృంభిస్తే, ఇప్పటికే మాంద్యంలో ఉన్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఆర్థిక సంక్షోభం లోకి నెట్టబడుతుంది.

**ట్రంప్ ఆర్థిక వ్యూహం**

డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక వ్యూహాన్ని ఈ కోణంలోనే చూడాలి. ఆయన చర్యలను ఒక బుద్ధిహీనుడి చర్యలుగా కొట్టిపారేయడం చాలా పొరపాటు. ట్రంప్ వ్యూహంలో రెండు ప్రధాన భాగాలు ఉన్నాయి.

1. రక్షణ భారాన్ని పంచుకోవడం:

## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ రక్షకుడి పాత్రను ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పంచుకోవడం. యూరోపియన్ దేశాలు తమ జిడిపిలో 5 శాతాన్ని సైనిక వ్యయం కోసం ఖర్చు చేయాలని ట్రంప్ ఒత్తిడి తేవడం ఇందులో భాగమే. ఇది అమెరికా కరెంట్ ఖాతా లోటును తగ్గిస్తుంది.

2. దక్షిణార్ధ గోళ దేశాల పునర్వలస వాదం: గతంలో బ్రిటన్ తన వలస సామ్రాజ్యం నుండి పొందిన ప్రయోజనాలను అమెరికా కోసం తిరిగి పొందడం.

> **"దక్షిణార్ధ గోళాన్ని పునర్వలస ప్రాంతంగా మార్చడమంటే వాషింగ్టన్ నుండి ప్రతినిధులను పంపి పాలించడం కాదు. అమెరికాకు లొంగిపోయే ప్రభుత్వాలను అక్కడ ఏర్పాటు చేయడం. ఇది నయా-ఉదారవాదాన్ని అధిగమించి పోవడం కాదు, నయా-ఉదారవాద వ్యవస్థలో కొత్త అసమానతలు సృష్టించడం. అంటే దక్షిణార్ధ గోళం నయా-ఉదారవాదంలోనే ఉండి పోతుంది, కానీ అమెరికా మాత్రం వర్తక విషయాల్లో నయా- ఉదారవాదం నుండి బయట కొచ్చి, పెట్టుబడి స్వేచ్ఛ విషయంలో ఆ విధానాలను కొనసాగిస్తుంది."**

దక్షిణార్ధ గోళాన్ని పునర్వలస ప్రాంతంగా మార్చడం అంటే వాషింగ్టన్ నుండి ప్రతినిధులను పంపి పాలించడం కాదు, అమెరికా చెప్పినట్లు వినే, లొంగిపోయే ప్రభుత్వాలను అక్కడ ఏర్పాటు చేయడం. ఇది నయా – ఉదారవాదాన్ని అధిగమించి పోవడం కాదు, నయా–ఉదారవాద వ్యవస్థలో ఒక కొత్త అసమానతను తీసుకురావడం. దీని ప్రకారం, దక్షిణార్ధ గోళం నయా–ఉదారవాదంలోనే ఉండిపోతుంది, కానీ అమెరికా మాత్రం వర్తక విషయాల్లో నయా–ఉదారవాదం నుండి బయటకు వచ్చి, పెట్టుబడి స్వేచ్ఛ విషయంలో మాత్రం ఆ విధానాలను కొనసాగిస్తుంది.

ఈ విధానం వల్ల సంక్షోభ భారం అభివృద్ధి చెందుతున్న దక్షిణార్ధ గోళదేశాల ప్రజలపై పడుతుంది. అక్కడ ఉన్న రైతులు, చిన్న వ్యాపారులు, కార్మికులపై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతుంది.

**దక్షిణార్ధ గోళ దేశాల పునర్వలసవాదం**

ఈ పునర్వలస యత్నాలలో ఒకటి, దక్షిణార్ధ గోళ దేశాలపై అమెరికా అసమాన వర్తక ఒప్పందాలను రుద్దడం. భారత్–అమెరికా వర్తక ఒప్పందం దీనికి ఒక ఉదాహరణ. ట్రంప్ సుంకాల బెదిరింపులు ఈ రకమైన అసమాన ఒప్పందాలను రుద్దడానికి ఒక సాధనంగా ఉపయోగపడుతున్నాయి.

ఈ ఒప్పందం ప్రకారం, భారతీయ వస్తువులపై అమెరికా సుంకాలు విధించవచ్చు, కానీ అమెరికా వస్తువులపై భారత్ సున్నా లేదా చాలా స్వల్ప సుంకాలు మాత్రమే విధించాలి. అంటే, వలస పాలనలో భారత్ బ్రిటన్ నుండి సరుకులను దిగుమతి చేసుకున్నట్లే, ఇప్పుడు అమెరికా నుండి ఎక్కువ దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. ఇది వలస పాలన నాటి కంటే దారుణమైనది, ఎందుకంటే నిర్దిష్ట కాలానికి భారత్ ఎంత దిగుమతి చేసుకోవాలో ఈ ఒప్పందం లక్ష్యాలను నిర్దేశిస్తుంది.

ఇలాంటి ఒప్పందాల వల్ల అమెరికాలో ఉపాధి, ఉత్పత్తి రెండూపెరుగుతాయి, కరెంట్ ఖాతా లోటు తగ్గుతుంది. అంతర్జాతీయ ద్రవ్య




పెట్టుబడిని సవాలు చేయకుండానే (పన్నులు పెంచకుండానే) అమెరికా తన మాంద్యాన్ని, లోటును అధిగమించడానికి ఈ విధంగా ప్రయత్నిస్తోంది.

ఈ ప్రయత్నంలో రెండవ భాగం: కీలకమైన ముడిసరుకులను, ముఖ్యంగా చమురును సొంతం చేసుకోవడం. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలు ఉన్న వెనిజులాపై దాడి చేయడం, దాని అధ్యక్షుడిని అపహరించడం, చమురు ఉత్పాదక దేశమైన ఇరాన్‌పై దాడి, అరుదైన ఖనిజాలు ఉన్న గ్రీన్‌లాండ్ వనరులను తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని చూడటం.

చమురుపై ఆధిపత్యం సాధించడం వల్ల డాలర్ వర్తకంలోనే చమురు లావాదేవీలు జరుగుతాయి. దీనివల్ల డాలర్ ఆధిపత్యం నిలబడుతుంది. అలాగే అమెరికన్ కంపెనీలు ఈ వనరులను నేరుగా దోపిడీ చేసి మిగులును అమెరికాకు తరలించవచ్చు.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత రాజకీయ విముక్తి సులభంగానే వచ్చినప్పటికీ, ఆర్థిక విముక్తి కోసం దక్షిణార్ధ గోళ దేశాలు తీవ్రంగా పోరాడాల్సి వచ్చింది. గతంలో గ్వాటెమాలా, ఇరాన్, ఈజిప్ట్, కాంగో, చిలీ దేశాలలో సామ్రాజ్యవాదులు కుట్రలు పన్ని అక్కడ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను పడగొట్టారు. ట్రంప్ ఇప్పుడు ఈ ఆర్థిక విముక్తిని తిరగరాస్తూ, ప్రత్యక్ష సైనిక చర్యల ద్వారా వనరులను ఆక్రమించుకోవాలని చూస్తున్నారు, ఇది ఆధునిక సామ్రాజ్యవాద చరిత్రలో ఒక కొత్త అధ్యాయం.

**దక్షిణార్ధ గోళ దేశాల ప్రతిఘటన**

అయితే దక్షిణార్ధ గోళ దేశాల ప్రజలు ఈ పునర్వలస విధానాన్ని అంత తేలికగా అంగీకరించరు. గతంలో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న పెద్ద కార్పొరేట్ వర్గాలు, ఎగువ మధ్యతరగతి ప్రజలు ఇప్పుడు సామ్రాజ్యవాదానికి లొంగిపోయి ఉండవచ్చు, కానీ రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలు దీనిని తీవ్రంగా ప్రతిఘటిస్తారు.

ఈ ప్రతిఘటన కేవలం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మాత్రమే కాక, స్వదేశీ గుత్త పెట్టుబడిదారులకు, నయా–ఫాసిస్ట్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కూడా సాగుతుంది. అందువల్ల ఇది విప్లవాత్మకమైన మార్పులకు దారితీసే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో దక్షిణార్ధ గోళ దేశాల్లో తీవ్ర పోరాటాలు చోటుచేసుకోనున్నాయి.

ఇరాన్‌లో జరుగుతున్న ప్రతిఘటనే దీనికి నిదర్శనం. ఇరాన్ లొంగిపోయి ఉంటే సామ్రాజ్యవాదం మరింత విజృంభించి ఉండేది. కానీ ఇరాన్ చూపుతున్న ధీటైన ప్రతిఘటన దక్షిణార్ధ గోళంలోని ఇతర దేశాలకు నైతిక బలాన్ని ఇస్తోంది. సామ్రాజ్యవాదం తన పునర్వలస ఎజెండాను వదులుకోకపోయినా, ఈ ప్రతిఘటన వల్ల దాని వేగం ఖచ్చితంగా మందగిస్తుంది.

**(అనువాదం : కె సత్యరంజన్)**

# కనిపించేది మనమే కానీ.. చూపించేది అల్గోరిథమ్!

## దృష్టిని సరుకుగా మార్చే డిజిటల్ పెట్టుబడిదారీ వ్యవస్థపై ఒక విశ్లేషణ



రచయిత రిసెర్చ్ స్కాలర్

డి ఉదయ్ కిరణ్

డిజిటల్ యుగంలో సమాచారం మన చుట్టూ విపరీతంగా పెరిగిపోయింది. మన చేతిలో ఉన్న మొబైల్ ఫోన్ ప్రపంచంలోని దాదాపు ఏ సమాచారాన్నైనా కొన్ని క్షణాల్లో మన ముందుకు తీసుకురాగలదు. కానీ మనం చూస్తున్న ప్రపంచం మొత్తం ప్రపంచం కాదు. మనకు కనిపిస్తున్నది, మన కోసం ఎంపిక చేయబడిన ప్రపంచం.

ఒకప్పుడు ఉదయాన్నే పత్రిక చేతిలోకి తీసుకున్నప్పుడు ఏ వార్త మొదటి పేజీలో ఉండాలి, ఏ ఫోటోకు పెద్ద స్థానం ఇవ్వాలి, ఏ అంశాన్ని ప్రధాన వార్తగా ఎంచుకోవాలి అనే నిర్ణయాన్ని ఒక సంపాదకుడు తీసుకునేవాడు. పత్రిక కేవలం వార్తలను ముద్రించేది కాదు; ప్రజల దృష్టిని కూడా ఒక క్రమంలోకి తీసుకువచ్చేది.నేడు పత్రిక స్థానంలో మొబైల్ స్క్రీన్ వచ్చింది. సంపాదకుడి స్థానంలో ఒక అల్గోరిథం నిలిచింది.

ఈ కొత్త సంపాదకుడికి కార్యాలయం లేదు. ముఖం లేదు. పేరు కూడా చాలామందికి తెలియదు. అయినప్పటికీ ప్రతిరోజూ కోట్లాది మంది ఏమి చూడాలి, ఏ వీడియో దగ్గర ఆగాలి, ఏ వార్త ముందుగా కనిపించాలి, ఏ రాజకీయ అంశం గురించి తెలుసుకోవాలి, ఏ సినిమా పాట వినాలి, ఏ పుస్తకం గురించి ఆసక్తి కలగాలి అనే ప్రక్రియలో అది కనిపించని సంపాదకుడిలా పనిచేస్తోంది.

కార్పొరేట్ సంస్థలు, రాజకీయ నాయకులు, సినిమా పరిశ్రమ, పుస్తక ప్రచురణ సంస్థలు, విద్యా సంస్థలు, చిన్న వ్యాపారులు, కళాకారులు, ఉద్యమకారులు... అందరూ ఇప్పుడు ఒకే ప్రశ్నకు సమాధానం వెతుకుతున్నారు: 'ప్రజల దృష్టిని ఎలా ఆకర్షించాలి?'

ఈ ప్రశ్నకు సమాధానం వెతుకుతున్నప్పుడు ఇన్‌స్టాగ్రామ్ (Instagram), యూట్యూబ్ (YouTube), ఫేస్‌బుక్ (Facebook), ఎక్స్ (X) వంటి డిజిటల్ వేదికలు కేవలం సమాచార మాధ్యమాలుగా కాకుండా, సమాజంలోని కార్యకలాపాలను, అభిరుచులను, చర్చలను ప్రభావితం చేసే వ్యవస్థలుగా మారాయి. అందుకే ఈ వ్యాసం ఇన్‌స్టాగ్రామ్ గురించి మాత్రమే కాదు. డిజిటల్ యుగంలో అల్గోరిథం అనే కొత్త సంపాదకుడు సమాజాన్ని ఎలా పునర్నిర్మిస్తున్నాడో అర్థం చేసుకునే ప్రయత్నం.

ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. సాధారణ పరిభాషలో కృత్రిమ మేధ – (Artificial Intelligence), అల్గోరిథమ్ రెంటినీ ఒకటిగా చెబుతుంటారు. అయితే రెండూ ఒకటి కావు. అల్గోరిథమ్ అనేది ఒక నిర్దిష్ట పని చేయడానికి లేదా నిర్ణయం తీసుకోవడానికి కంప్యూటర్ అనుసరించే నియమాలు, దశలు, లెక్కల పద్ధతి. AI అనేది డేటా నుంచి నేర్చుకుని అంచనాలు వేయగల విస్తృత సాంకేతిక వ్యవస్థ. AIలో అల్గోరిథమ్‌లు ఉపయోగించబడతాయి, కానీ ప్రతి అల్గోరిథమ్ AI కాదు. ఈ వ్యాసంలో మనం ప్రధానంగా మాట్లాడేది మన ప్రవర్తనను విశ్లేషించి, మనకు ఏ సమాచారం లేదా కంటెంట్ కనిపించాలో ఎంపిక చేసే అల్గోరిథమిక్ వ్యవస్థల గురించి.

అల్గోరిథం (Algorithm) అనేది కేవలం కంప్యూటర్ కోడ్ కాదు. అది ఒక ఎంపిక చేసే వ్యవస్థ. కోట్లాది పోస్టులు, వీడియోలు, ఫోటోలలో మనకు ఏది ముందుగా కనిపించాలో అది నిర్ణయిస్తుంది.

ఒక చిన్న ఉదాహరణ తీసుకుందాం:

మీరు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పుస్తకం గురించి వెతికారు. దానికి సంబంధించిన ఒక రీల్ (Reel)ను పూర్తిగా చూశారు. మరో వీడియోను వెంటనే దాటేశారు. ఒక పోస్టును సేవ్ (Save) చేశారు. ఇంకొకదాన్ని స్నేహితుడికి పంపారు. మీకు ఇవన్నీ సాధారణమైన చర్యలే. కానీ డిజిటల్ ప్లాట్‌ఫామ్ (digital Platform)కు ఇవి మీ ఆసక్తిని అర్థం చేసుకునే సంకేతాలు. మీరు ఏ కంటెంట్ (Content) దగ్గర ఆగుతున్నారు, దేనిని వెంటనే దాటేస్తున్నారు, దేనిని ఎక్కువసేపు చూస్తున్నారు, దేనిని షేర్ (Share) చేస్తున్నారు, దేనిని సేవ్ చేస్తున్నారు అనే సమాచారాన్ని అది విశ్లేషిస్తుంది. దాని ఆధారంగా తర్వాత మీకు ఎలాంటి కంటెంట్‌ను చూపించాలో నిర్ణయిస్తుంది.

అందుకే ఇద్దరు వ్యక్తులు ఒకే ఇన్‌స్టాగ్రామ్ తెరిచినా, వారికి కనిపించే కంటెంట్ ఒకేలా ఉండదు.

ఇక్కడే ఒక ముఖ్యమైన విషయం అర్థమవుతుంది. మనం ఇన్‌స్టాగ్రామ్‌ను ఉపయోగిస్తున్నామని అనుకుంటాం. కానీ అదే సమయంలో ఇన్‌స్టాగ్రామ్ కూడా మన గురించి నేర్చుకుంటోంది. మన ఆసక్తులు, మన ప్రవర్తన, మనం ఏ విషయాలపై ఎక్కువగా స్పందిస్తున్నామన్నది ప్లాట్‌ఫామ్‌కు సంకేతాలుగా మారుతున్నాయి.

అంటే అల్గోరిథం కేవలం మనకు కంటెంట్‌ను చూపించే వ్యవస్థ కాదు. మన ప్రవర్తన నుంచి నేర్చుకుని, మనకు తదుపరి ఏమి చూపించాలో నిర్ణయించే వ్యవస్థ. అయితే అల్గోరిథంలు ఎందుకు ఈ విధంగా పనిచేస్తున్నాయి?

ఈ ప్రశ్నకు సమాధానం వెతకడానికి మనం సాంకేతిక ప్రపంచం నుంచి రాజకీయ ఆర్థిక శాస్త్రం వైపు అడుగు వేయాలి.

అమెరికన్ ఆర్థికవేత్త హెర్బర్ట్ సైమన్ (Herbert Simon) చాలా కాలం క్రితమే ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తించాడు. సమాచారం పెరిగే కొద్దీ మనిషి దృష్టి అరుదైన వనరుగా మారుతుంది. సమస్య సమాచారం కొరత

కాదు. సమస్య మన దృష్టి కొరత. నేడు ఈ ఆలోచన డిజిటల్ ప్రపంచానికి మరింతగా సరిపోతుంది. మన దృష్టి కోసం డిజిటల్ వేదికల మధ్య పోటీ జరుగుతోంది. మనం ఒక వీడియో దగ్గర మరో పది సెకన్లు ఆగినా, ఒక పోస్టును మరొకరికి పంపినా, ఒక పుస్తక సమీక్షను సేవ్ చేసినా, ఆ చర్యలు ప్లాట్‌ఫామ్ ఆర్థిక వ్యవస్థలో విలువను సృష్టిస్తాయి.


ఇక్కడ మన దృష్టి కూడా ఒక విలువైన వనరుగా మారుతుంది. దీన్నే దృష్టి ఆధారిత ఆర్థిక వ్యవస్థ (Attention Economy)గా పిలుస్తారు.

ఈ కొత్త ఆర్థిక వ్యవస్థలో కేవలం సరుకులు మాత్రమే అమ్మబడవు. మన దృష్టి కూడా ఒక మార్కెట్‌గా మారుతుంది. మనం స్క్రీన్‌పై ఎంతసేపు ఉంటాం, దేనిని చూస్తాం, దేనితో పరస్పర చర్య చేస్తాం అనేవి ప్లాట్‌ఫామ్‌ల ఆర్థిక విలువతో ముడిపడతాయి. ఈ మార్పు పెట్టుబడిదారీ వ్యవస్థ స్వభావంలో కూడా ఒక కొత్త దశను చూపిస్తోంది. ఒకప్పుడు కర్మాగారం ఉత్పత్తికి కేంద్రంగా ఉండేది. యంత్రాలు, ముడిసరుకు, కార్మిక శ్రమ అక్కడే కేంద్రీకృతమయ్యేవి. ఇప్పుడు డిజిటల్ వేదికలు మరో రకమైన ఆర్థిక మౌలిక వసతులుగా మారాయి.

"ఈ కొత్త ఆర్థిక వ్యవస్థలో కేవలం సరుకులు మాత్రమే అమ్మబడవు. మన దృష్టి కూడా ఒక మార్కెట్‌గా మారుతుంది. మనం స్క్రీన్‌పై ఎంతసేపు ఉంటాం, దేనిని చూస్తాం, దేనితో పరస్పర చర్య చేస్తాం అనేవి ప్లాట్‌ఫామ్‌ల ఆర్థిక విలువతో ముడిపడతాయి. ఈ మార్పు పెట్టుబడిదారీ వ్యవస్థ స్వభావంలో కూడా ఒక కొత్త దశను చూపిస్తోంది. ఒకప్పుడు కర్మాగారం ఉత్పత్తికి కేంద్రంగా ఉండేది. యంత్రాలు, ముడిసరుకు, కార్మిక శ్రమ అక్కడే కేంద్రీకృతమయ్యేవి. ఇప్పుడు డిజిటల్ వేదికలు మరో రకమైన ఆర్థిక మౌలిక వసతులుగా మారాయి."

నిక్ స్రినెక్ (Nick Srnicek) దీనినే ప్లాట్‌ఫామ్ పెట్టుబడిదారీ విధానం (Platform Capitalism)గా విశ్లేషించాడు. కంపెనీలు ఉత్పత్తులను మాత్రమే విక్రయించవు. ప్రజలు కలిసే వేదికలను నిర్మిస్తాయి. ఆ వేదికలపై జరిగే కార్యకలాపాలు, సేకరించబడే డేటా, ప్రజల దృష్టి అన్నీ ఆర్థిక విలువతో ముడిపడతాయి.

ఇక్కడ కార్ల్ మార్క్స్ ఆలోచనలు మరోసారి గుర్తుకు వస్తాయి. పారిశ్రామిక యుగంలో కార్మికుడి శ్రమ ద్వారా విలువ ఎలా సృష్టించబడుతుందో మార్క్స్ విశ్లేషించాడు. డిజిటల్ యుగంలో శ్రమ స్వరూపం భిన్నంగా కనిపించినప్పటికీ ఒక ఆసక్తికరమైన పోలిక ఉంది. నేడు కోట్లాది మంది ప్రతిరోజూ ఫొటోలు, వీడియోలు, వ్యాఖ్యలు, సమీక్షలు, మీమ్స్, రీల్స్ వంటి కంటెంట్‌ను సృష్టిస్తున్నారు. మనం వీటిని వ్యక్తిగత వ్యక్తీకరణగా చూస్తాం. కానీ ఈ మొత్తం డిజిటల్ శ్రమ (Digital Labour) ప్లాట్‌ఫామ్‌లను సజీవంగా ఉంచుతుంది. ప్రజలు ఎక్కువగా పాల్గొన్న కొద్దీ ప్లాట్‌ఫామ్‌కు మరింత డేటా లభిస్తుంది, మరింత ఎంగేజ్‌మెంట్ (Engagement) వస్తుంది, మరింత ప్రకటనల విలువ ఏర్పడుతుంది.



కృత్రిమ మేధ అల్గోరిథమ్స్

అయితే ఈ విలువ సృష్టిలో పాల్గొంటున్న వ్యక్తికి దానిలో ఎంత భాగం తిరిగి వస్తుంది?

పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రమ, విలువ, లాభం మధ్య ఉన్న సంబంధాలను మార్క్స్ విశ్లేషించిన ప్రశ్నలకు ఇది డిజిటల్ యుగం నుంచి వస్తున్న కొత్త ప్రశ్న. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఆర్థిక వ్యవస్థలో కీలకంగా మారిన తర్వాత మరో ప్రశ్న ముందుకొస్తుంది. ఈ సంస్థల అసలు ఆస్తి ఏమిటి? కార్యాలయ భవనాలా? కంప్యూటర్ సర్వర్లా? లేక వినియోగదారులేనా?

షోషానా జుబాఫ్ (Shoshana Zuboff) దీనిని నిఘా పెట్టుబడిదారీ విధానం (Surveillance Capitalism) అనే భావనతో విశ్లేషించారు. మన డిజిటల్ కార్యకలాపాల నుంచి సేకరించే సమాచారాన్ని భవిష్యత్ ప్రవర్తనను అంచనా వేయడానికి ఉపయోగించవచ్చని ఆమె వివరించారు. మీరు ఒక వస్తువు గురించి వరుసగా వెతికితే, కొద్దిసేపటికే దానికి సంబంధించిన ప్రకటనలు కనిపించడం యాదృచ్ఛికం కాదు. మీ గత చర్యల నుంచి వచ్చిన సంకేతాల ఆధారంగా మీ తదుపరి ఆసక్తిని అంచనా వేసే ప్రయత్నం జరుగుతోంది.

అంటే డేటా విలువ మనం ఏం చేశామో తెలుసుకోవడంలో మాత్రమే లేదు. మనం తర్వాత ఏం చేయబోతున్నామో అంచనా వేయడంలో కూడా ఉంది. ఇక్కడ మరో ముఖ్యమైన ప్రశ్న వస్తుంది. ఈ డేటా ఎక్కడి నుంచి వస్తుంది?

చమురు భూమిలో ఉంటుంది. దాన్ని వెలికితీయాలి, కానీ డేటా మన రోజువారీ జీవితంలోనే ఉత్పత్తి అవుతుంది. మనం చూసే ప్రతి వీడియో, చదివే ప్రతి వ్యాసం (Article) చేసే ప్రతి సెర్చ్ (Search), పంపే ప్రతి మెసేజ్ (Message), నొక్కే ప్రతి లైక్ (Like), చేసే ప్రతి షేర్ (Share).. ఇవన్నీ కలిసి ఒక డిజిటల్ చరిత్రను నిర్మిస్తాయి.

ఈ నేపథ్యంలో నిక్ కౌల్డ్రీ (Nick

“ పుస్తకాల ప్రపంచంలో కూడా ఈ మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు మంచి పుస్తకాన్ని రాయడం, ప్రచురించడం, సమీక్షలు రావడం, పుస్తక ప్రదర్శనల్లో పాఠకులను కలవడం చాలు అనుకునేవారు. నేడు బుక్‌స్టాగ్రామ్ (Bookstagram), బుక్ రీల్స్ (Book Reels), రచయితల వీడియో సంభాషణలు, పాఠకుల రివ్యూస్ (Reviews) కూడా ఒక పుస్తక ప్రయాణంలో భాగమయ్యాయి. ”

Couldry), ఉలిసెస్ ఎ. మెజియాస్ (Ulises A. Mejias) వంటి పరిశోధకులు డేటా వలసవాదం (Data Colonialism) అనే భావనను ప్రతిపాదించారు. ఒకప్పుడు వలస వాదం భూమి, ఖనిజాలు, సహజ వనరులను స్వాధీనం చేసుకుని సంపదను కేంద్రీకరించింది. నేడు డిజిటల్ వేదికలు మన దైనందిన జీవితాన్నే డేటాగా మార్చి దాని నుంచి విలువను సృష్టిస్తున్నాయని వారు వాదించారు.

ఈ పోలికతో పూర్తిగా ఏకీభవించాల్సిన అవసరం లేకపోయినా, డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో డేటా ఎంత కేంద్రీయమైన వనరుగా మారిందో ఇది గుర్తు చేస్తుంది. అంటే మనం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగిస్తున్నప్పుడు కేవలం కంటెంట్‌ను వినియోగించడం మాత్రమే జరగడం లేదు. మన ప్రవర్తన కూడా ఆర్థిక వ్యవస్థకు ఒక వనరుగా మారుతోంది.

అయితే డిజిటల్ ప్రపంచాన్ని కేవలం మార్కెట్ కోణంలో మాత్రమే చూడలేం. ఈ మార్పు మన సంస్కృతిపై కూడా ప్రభావం చూపుతోంది.

సినిమా పరిశ్రమలో ఇదే పరిణామం కనిపిస్తోంది. ఒకప్పుడు సినిమా విడుదలైన తర్వాత ప్రేక్షకుల స్పందనను అంచనా వేసేవారు. ఇప్పుడు విడుదలకు ముందే సినిమా డిజిటల్ ప్రయాణం మొదలవుతోంది. ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్, పాటలు, చిన్న వీడియోలు, నటీనటుల ఇంటర్వ్యూలు, అభిమానుల స్పందనలు... ఇవన్నీ సినిమా మార్కెటింగ్‌లో భాగమవుతు న్నాయి. నిర్మాతలు సినిమా మాత్రమే తీయడం లేదు. అది అల్గోరిథంల ప్రపంచంలో ఎలా ప్రయాణిస్తుందో కూడా ఆలోచిస్తున్నారు.

పుస్తకాల ప్రపంచంలో కూడా ఈ మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు మంచి పుస్తకాన్ని రాయడం, ప్రచురించడం, సమీక్షలు రావడం, పుస్తక ప్రదర్శనల్లో పాఠకులను కలవడం చాలు అనుకునేవారు. నేడు బుక్‌స్టాగ్రామ్ (Bookstagram), బుక్ రీల్స్ (Book Reels), రచయితల వీడియో సంభాషణలు, పాఠకుల రివ్యూస్ (Reviews) కూడా ఒక పుస్తక ప్రయాణంలో భాగమయ్యాయి.

ఒక పుస్తకం మరో పుస్తకంతో మాత్రమే పోటీ పడటం లేదు. అదే స్క్రీన్‌పై ఒక సినిమా ట్రైలర్‌తో, ఒక రాజకీయ వీడియోతో, ఒక వంట వీడియోతో, ఒక కామెడీ రీల్‌తో కూడా పాఠకుడి దృష్టి కోసం పోటీ పడుతోంది. ఇది ప్రచురణ సంస్థల ముందు ఒక కొత్త ప్రశ్నను నిలబెడుతోంది. మంచి పుస్తకాలను ప్రచురించ డం మాత్రమే సరిపోతుందా? లేక వాటిని డిజిటల్ ప్రపంచంలో కనిపించేలా చేయడం కూడా ప్రచురణలో భాగమా? నాణ్యత అవ సరం. కానీ నాణ్యత కనిపించకపోతే పాఠకుడిని చేరుకోలేని పరిస్థితి కూడా ఏర్పడుతోంది.

ఈ మార్పును పెద్ద సంస్థలకే పరిమితం చేయలేం. ఒక చిన్న గ్రామంలోని కళాకారుడు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను చేరుకోగలుగు తున్నాడు. ఒక కొత్త రచయిత పెద్ద ప్రచురణ సంస్థ సహాయం లేకుండానే పాఠకులను సంపాదించగలుగుతున్నాడు. ఒక చిన్న వ్యాపారి భారీ ప్రకటనల ఖర్చు లేకుండానే తన ఉత్ప త్తిని పరిచయం చేయగలుగుతున్నాడు. డిజిటల్ ప్లాట్‌ఫార్మ్స్ ఈ అవకాశాలను నిజంగా విస్తరిం చాయి. కానీ మరో వాస్తవాన్ని కూడా గుర్తిం చాలి. వేదిక అందరికీ అందుబాటులో ఉన్నా, వీక్షకాదరణ అందరికీ సమానంగా దక్కదు. ఆ వీక్షకాదరణకు ఇప్పుడు అల్గోరిథమే మధ్యవర్తి.

ఇక్కడే ఇటాలియన్ ఆలోచనాపరుడు ఆంటోనియో గ్రామ్సీ చేసిన పరిశీలన కొత్త అర్థాన్ని సంతరించుకుంటుంది. సమాజంలో ఆధిపత్యం కేవలం రాజకీయ అధికారంతోనే ఏర్పడదని, సంస్కృతి ద్వారా కూడా నిర్మిత మవుతుందని ఆయన వివరించాడు. నేడు ఆ సంస్కృతిని ప్రభావితం చేసే ప్రక్రియలో అల్గోరిథంలు కూడా భాగమవుతున్నాయా? ఏ ఆలోచన ఎక్కువ మందికి చేరుతుంది? ఏది పదేపదే కనిపిస్తుంది? ఏది ప్రజా చర్చగా మారుతుంది? ఒక సినిమా పాట ఎందుకు

‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.

సెల్: 9490099333 email: venkataraosankarapu@gmail.com

**"ఇక్కడ ఫ్రెంచ్ తత్వవేత్త మిషెల్ ఫూకో చేసిన అధికారంపై విశ్లేషణ కూడా గుర్తుకు వస్తుంది. అధికారం ఎప్పుడూ చట్టాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో లేదా బలప్రయోగంలో మాత్రమే ఉండదు. మన దైనందిన జీవితాన్ని నిశ్శబ్దంగా క్రమబద్ధీకరించే వ్యవస్థల్లో కూడా అధికారం ఉంటుంది. ఆ కోణంలో అల్గోరిథం లను చూస్తే అవి మనకు ఆదేశాలు ఇవ్వవు. నిషేధాలు విధించవు. కానీ మనకు కనిపించే ప్రపంచాన్ని క్రమబద్ధీకరిస్తాయి."**

ఒక్కసారిగా దేశవ్యాప్తంగా వినిపిస్తుంది? ఒక పుస్తకం ఎందుకు వేలాది కొత్త పాఠకులను చేరుకుంటుంది? ఒక అంశం ఎందుకు జాతీయ చర్చగా మారుతుంది? ఈ ప్రశ్నలకు సమాధానం వెతికేటప్పుడు అల్గోరిథంల పాత్రను పూర్తిగా పక్కన పెట్టడం సాధ్యం కాదు.

అయితే అల్గోరిథంను ఒక సర్వశక్తిమంతమైన వ్యవస్థగా కూడా చూడకూడదు. అది సమాజానికి వెలుపల ఉన్న శక్తి కాదు. సమాజం ఎలా స్పందిస్తుందో దాన్నుంచే నేర్చుకునే వ్యవస్థ. మనం ఏది చూస్తామో, ఏది పంచుకుంటామో, ఏది ఎక్కువసేపు చూస్తామో అవే దానికి సంకేతాలుగా మారుతాయి. కానీ ఒకసారి ఆ సంకేతాలను విశ్లేషించిన తర్వాత, మనలో ప్రతి ఒక్కరికీ వేర్వేరు ప్రపంచాలను నిర్మించడం ప్రారంభిస్తుంది. అదే దాని శక్తి. అదే దాని పరిమితి.

ఇక్కడ ఫ్రెంచ్ తత్వవేత్త మిషెల్ ఫూకో చేసిన అధికారంపై విశ్లేషణ కూడా గుర్తుకు వస్తుంది. అధికారం ఎప్పుడూ చట్టాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో లేదా బలప్రయోగంలో మాత్రమే ఉండదు. మన దైనందిన జీవితాన్ని నిశ్శబ్దంగా క్రమబద్ధీకరించే వ్యవస్థల్లో కూడా అధికారం ఉంటుంది. ఆ కోణంలో అల్గోరిథం లను చూస్తే అవి మనకు ఆదేశాలు ఇవ్వవు. నిషేధాలు విధించవు. కానీ మనకు కనిపించే ప్రపంచాన్ని క్రమబద్ధీకరిస్తాయి.

మనకు ఏది ముందుగా కనిపించాలి? ఏది తర్వాత కనిపించాలి? ఏది ఎక్కువసేపు మన ముందుండాలి? ఏది కనిపించకుండానే మిగిలిపోవాలి? ఇవి కూడా అధికారానికి సంబంధించిన ప్రశ్నలే. అందుకే అల్గోరిథంను కేవలం సాంకేతిక వ్యవస్థగా చూడటం సరిపోదు. అది మన దృష్టిని క్రమబద్ధీకరించే ఒక సామాజిక శక్తి కూడా. ఈ మార్పును అత్యంత వేగంగా స్వీకరించిన రంగాల్లో రాజకీయాలు ఒకటి. ఒకప్పుడు ఎన్నికల ప్రచారం అంటే సభలు, గోడపత్రికలు, కరపత్రాలు, పత్రికా ప్రకటనలు. ఇప్పుడు రాజకీయ కమ్యూనికేషన్ (Political Communication) మొబైల్ స్క్రీన్‌పైకి వచ్చింది.

అన్ని రాజకీయ పార్టీలు చిన్న వీడియోలు, రీల్స్, ప్రత్యక్ష ప్రసారాలు, మీమ్స్, డిజిటల్ ప్రచారాలు (Digital Campaigns) ద్వారా ప్రజలను చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ప్రజలను ఆకర్షించే ప్రసంగం మాత్రమే కాదు, అల్గోరిథం దృష్టిని ఆకర్షించే కమ్యూనికేషన్ కూడా ఇప్పుడు రాజకీయ వ్యూహంలో భాగమైంది.

ఇక్కడే సోషల్ మీడియాలో రాజకీయ కమ్యూనికేషన్‌లో మరో సమస్య వస్తుంది. ఎవరైనా ఒక రెచ్చగొట్టే (Provocative) ప్రశ్న అడుగుతారు. మనం వెంటనే సమాధానం ఇస్తాం. వాళ్లు మరో ప్రశ్న వేస్తారు. మనం మళ్లీ స్పందిస్తాం. చివరికి మనం చెప్పాలనుకున్న విషయాన్ని ప్రజలకు చెప్పకుండా, ఇతరులు నిర్ణయించిన అంశాల చుట్టూనే మన సంభాషణ తిరుగుతుంది.

ఇది కేవలం రాజకీయ చర్చ సమస్య కాదు. దృష్టి ఆధారిత ఆర్థిక వ్యవస్థ (Attention Economy)లో ఇది ఒక ముఖ్యమైన సమస్య. ఎందుకంటే సోషల్ మీడియాలో ఎవరు మాట్లాడుతున్నారు అన్నదానికంటే, ప్రజలు దేనిపై మాట్లాడుతున్నారు అన్నదే ఎక్కువ విలువైనది.

అందువల్ల ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వడం మాత్రమే రాజకీయ కమ్యూనికేషన్ కాదు. ఆ ప్రశ్న వెనుక ఉన్న కారణాలు ఏమిటి? దాని ద్వారా ఏ సమస్యను దాచిపెడుతున్నారు? ప్రజల దృష్టిని ఏ విషయం నుంచి మరొక విషయం వైపు మళ్లిస్తున్నారు? ఇవన్నీ బయటపెట్టాలి.

అంటే ఇతరులు నిర్దేశించిన ప్రతి అంశానికి ప్రతిస్పందిస్తూ ఉండటం కాకుండా, మనం చర్చించాల్సిన అసలు సమస్యలను ప్రజల ముందుకు తీసుకురావాలి. ఇది డిజిటల్ ప్రపంచంలో అజెండా సెట్ చేయడంపై జరిగే పోరాటం కూడా.

జులై మాసంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగిన సిజెపి విద్యార్థుల నిరసనల్లో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, మీమ్స్, షార్ట్ వీడియోలు, ఇంటర్నెట్ భాష వంటి డిజిటల్ రూపాలు నిరసన సమాచారంలో భాగమయ్యాయి. నిరసన స్థలంలో జరుగుతున్న పరిణామాలను అక్కడికక్కడే కంటెంట్‌గా రూపొందించి, సోషల్ మీడియా ద్వారా విస్తరించడం ఈ తరం నిరసన సంస్కృతిలో (Protest Culture) ఒక ప్రత్యేక లక్షణంగా కనిపించింది.

ఒకప్పుడు ఒక నిరసనకు ప్రజలను పిలవడానికి పోస్టర్, కరపత్రం, సమావేశం అవసరమయ్యేవి. ఇప్పుడు ఒక 30 సెకన్ల షార్ట్ వీడియో కూడా ఒక పిలుపుగా పనిచేయగలదు. ఒక నిరసనలో జరిగిన సంఘటనను ఒక మీమ్‌గా, ఒక రీల్‌గా మార్చి కొన్ని గంటల్లో వేలాది మందికి చేరవేయగల అవకాశం ఉంది. ఈ మార్పు జెన్ జి రాజకీయ వ్యక్తీకరణలో డిజిటల్ వేదికలకు వచ్చిన ప్రాధాన్యతను చూపిస్తుంది.

జెన్ జి అల్గోరిథమిక్ ప్లాట్‌ఫామ్‌లలో పెరిగిన తరం. అందుకే మీమ్స్, రీల్స్, షార్ట్‌ఫామ్ వీడియోలు, విజువల్ కమ్యూనికేషన్ (Visual Communication), ఇంటర్నెట్ భాష వంటి వాటిని తమ రాజకీయ వ్యక్తీకరణలోకి తీసుకురావడం సహజంగా కనిపిస్తుంది.

జెన్ జి కి సోషల్ మీడియా కేవలం వినోద సాధనం కాదు. సమాచారం తెలుసుకోవడం, స్నేహితులతో సంబంధాలు కొనసాగించడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం, కొత్త విషయాలు నేర్చుకోవడం, రాజకీయ సంఘటనలపై స్పందించడం వంటి అనేక కార్యకలాపాలు అదే డిజిటల్ వేదికల ద్వారా జరుగుతున్నాయి. అందువల్ల ఈ తరం రాజకీయంగా ఒక సమస్యను ఎలా చూస్తుంది, దాని గురించి ఎలా మాట్లాడుతుంది, ఇతరులకు ఎలా చేరవేస్తుంది అనే విషయాల్లో అల్గోరిథమిక్ ప్లాట్‌ఫామ్‌లకు ఒక ప్రత్యేకమైన పాత్ర ఏర్పడింది.

ఒక యువకుడు ఒక రాజకీయ సంఘటనకు సంబంధించిన రీల్‌ను చూడటం అక్కడితో ఆగిపోదు. ఆ రీల్ ద్వారా మరో ఖాతాను అనుసరించవచ్చు. వ్యాఖ్యలు చదవవచ్చు. మరో వీడియో చూడవచ్చు. ఒక మీమ్‌ను

> " డిజిటల్ స్వేచ్ఛ అంటే మనం కంటెంట్‌ను సృష్టించ గలగడం మాత్రమే కాదు. మనకు ఏ కంటెంట్ కనిపిస్తోంది, అది ఎందుకు కనిపిస్తోంది, మన దృష్టిని ఎవరు ఏ దిశలోకి తీసుకెళ్తున్నారు అనే ప్రశ్నలను కూడా అడగగలగడం. అంటే సాంకేతికత కేవలం సమాచారాన్ని వేగంగా పంపించే సాధనం మాత్రమే కాదు; ప్రజలను చేరుకునే రాజకీయ సాధనంగా కూడా మారింది. "

షేర్ చేయవచ్చు. ఇలా ఒక చిన్న కంటెంట్ నుంచి ఒక పెద్ద సమాచార పరంపర ఏర్పడు తుంది. ఈ ప్రక్రియలో జెన్ జి కేవలం కంటెంట్‌ను వినియోగించే ప్రేక్షకుడిగా ఉండదు. తానే కంటెంట్‌ను సృష్టిస్తుంది, పంచుతుంది, దానిపై వ్యాఖ్యానిస్తుంది. అంటే ప్రేక్షకుడు, ప్రచురణకర్త, వ్యాఖ్యాత అనే పాత విభజనలు కొంతవరకు కలిసిపోతాయి.

అయితే జెన్ జి మొత్తాన్ని ఒకే విధమైన రాజకీయ అభిప్రాయాలు కలిగిన సమూహంగా చూడలేం. కానీ డిజిటల్ వేదికలు వారి రాజకీయ వ్యక్తీకరణకు ఒక ముఖ్యమైన మాధ్యమంగా మారిన విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తుంది.

అయితే ఇదే సమయంలో ఒక వైరుధ్యం కూడా ఉంది. జెన్ జి అల్గోరిథమిక్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించి తన గొంతును వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలుగుతోంది. అదే సమయంలో ఆ ప్లాట్‌ఫామ్‌లు జెన్ జి దృష్టిని, ఆసక్తులను, ప్రవర్తనను కూడా అర్థం చేసుకుని తదుపరి కంటెంట్‌ను నిర్ణయిస్తున్నాయి. అంటే జెన్ జి అల్గోరిథంను ఉపయోగిస్తోంది; అదే సమయంలో అల్గోరిథం కూడా జెన్ జి ని ఉపయోగిస్తోంది.

ఈ వైరుధ్యాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే డిజిటల్ స్వేచ్ఛ అంటే మనం కంటెంట్‌ను సృష్టించగలగడం మాత్రమే కాదు. మనకు ఏ కంటెంట్ కనిపిస్తోంది, అది ఎందుకు కనిపిస్తోంది, మన దృష్టిని ఎవరు ఏ దిశలోకి తీసుకెళ్తున్నారు అనే ప్రశ్నలను కూడా అడగగలగడం. అంటే సాంకేతికత కేవలం సమాచారాన్ని వేగంగా పంపించే సాధనం మాత్రమే కాదు; ప్రజలను చేరుకునే రాజకీయ సాధనంగా కూడా మారింది.

అయితే ఒక ఉద్యమం వైరల్ కావడం, అది విజయవంతం కావడం రెండూ ఒకటి కాదు. అల్గోరిథం దృష్టిని తీసుకురాగలదు. కానీ ప్రజల భాగస్వామ్యం, రాజకీయ స్పష్టత, సంస్థాగత శక్తిని భర్తీ చేయలేదు.

అల్గోరిథం వల్ల సమస్యలు ఉన్నాయి కాబట్టి సోషల్ మీడియాను పూర్తిగా తిరస్కరించాలా?

అది పరిష్కారం కాదు. కాబట్టి ప్రశ్న సాంకేతికత మంచిదా, చెడ్డదా అనేది కాదు. దాన్ని ఎవరు ఉపయోగిస్తున్నారు? ఏ ప్రయోజనం కోసం ఉపయోగిస్తున్నారు? ఏ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు? అన్నదే అసలు ప్రశ్న.

సాంకేతికతను అర్థం చేసుకోకుండా దాని నుంచి దూరంగా నిలబడటం ఒక మార్గం కాదు. దాని స్వభావాన్ని, పరిమితులను అర్థం చేసుకుని, దాని అవకాశాలను ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం అవసరం. రేపటి భావజాల పోరాటం కేవలం పుస్తకాల్లో, సభల్లో, పత్రికల్లో మాత్రమే జరగదు. అది మొబైల్ స్క్రీన్‌పైనా జరుగుతుంది. అక్కడ ఒక ఆలోచన కొన్ని సెకన్లలో వేలాది మందికి చేరవచ్చు. అదే వేగంతో తప్పుడు సమాచారం కూడా వ్యాపించవచ్చు. కాబట్టి వేగం మాత్రమే ముఖ్యం కాదు. దిశ కూడా ముఖ్యం.

ప్రజల దృష్టిని ఆకర్షించడం మొదటి అడుగు మాత్రమే. ఆ దృష్టిని ఆలోచనగా, ఆలోచనను చర్చగా, చర్చను ప్రజా భాగస్వామ్యంగా మార్చడం అసలు సవాలు. ఇక్కడే టెక్నాలజీని ఉపయోగించడం, టెక్నాలజీ చేత ఉపయోగించబడటం మధ్య తేడా తెలుస్తుంది.

అల్గోరిథం మన దృష్టిని ఎటు తీసుకెళుతుందో తెలుసుకోవాలి. అదే సమయంలో మనం ప్రజల దృష్టిని ఏ సమస్యల వైపు తీసుకెళ్లాలనుకుంటున్నామో కూడా నిర్ణయించుకోవాలి. ఇది అల్గోరిథంను జయించడం కాదు. దాని లాజిక్‌ను అర్థం చేసుకుని, దాని అవకాశాలను మన సామాజిక లక్ష్యాలకు ఉపయోగించుకోవడం.

ఒకప్పుడు సంపాదకుడు అందరికీ ఒకే మొదటి పేజీని రూపొందించేవాడు. నేడు అల్గోరిథం ప్రతి వ్యక్తికీ వేర్వేరు మొదటి పేజీని రూపొందిస్తోంది. ఇది కేవలం సాంకేతిక మార్పు కాదు. ప్రజలు ప్రపంచాన్ని చూసే విధానంలో వచ్చిన మార్పు. అందుకే డిజిటల్ యుగంలో అత్యంత ముఖ్యమైన ప్రశ్న ఇదే:

నేను ప్రపంచాన్ని చూస్తున్నానా?

లేక…

అల్గోరిథం నాకు చూపిస్తున్న ప్రపంచాన్నే చూస్తున్నానా?

అల్గోరిథం చూపించే ప్రపంచాన్ని మాత్రమే చూడకుండా, మనం చూడాల్సిన ప్రపంచాన్ని మనమే ప్రజల ముందుకు తీసుకురావడం అసలు సవాలు.

*

చదవండి! చదివించండి!!

Marxist

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సైద్ధాంతిక త్రైమాస ఆంగ్ల పత్రిక

వెల: ఒక ప్రతి రూ. 50

ప్రతులకొరకు

**The Manager,**

The Manager, Marxist, A. K. Gopalan Bhawan
27-29 Bhai Vir Singh Marg, New Delhi 110001
Phone: (91-11) 23348725; Email: pdpbln@gmail.com
Marxist is also available online at: https://cpim.org/the-marxist

మతతత్వం

# ఇంతకీ సనాతన ధర్మం అంటే ఏమిటి?



రచయిత విజయవాడ టాక్స్ పేయర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

**ఎంవి ఆంజనేయులు**

దేశంలో గత కొంత కాలంగా సనాతన ధర్మం గురించి చర్చ నడుస్తున్నది. సనాతన ధర్మాన్ని గురించి ఎవరైనా ప్రశ్నిస్తే, తల తీసేస్తాం, నాలుకలు కోసేస్తాం అంటూ సోషల్ మీడియాలో మీదబడిపోతుంటారు.

సనాతన ధర్మాన్ని గురించి మాట్లాడేవారిని ఎవరినైనా సనాతన ధర్మం అంటే ఏమిటి అని ప్రశ్నిస్తే సనాతనం అన్నంత వరకు సరిగానే చెబుతున్నారు. ధర్మం అంటేనే ఎవరికి తోచిన నిర్వచనం వారు చెబుతున్నారు. ఒకరు పూర్వీకులు చెప్పిన ధర్మం అంటారు. మరొకరు మన ఋషులు చెప్పిన ధర్మం అంటారు. మరికొంతమంది మన పురాణాలు చెప్పిన ధర్మం అంటారు. సాధారణమైన వారు అలా చెప్పారంటే అర్థం చేసుకోవచ్చు. ఒక యూట్యూబ్ ఛానల్ యాంకర్, ఒక ప్రముఖ ప్రచనకారుణ్ణి "సనాతన ధర్మమంటే ఎవరూ సరిగా చెప్పటంలేదు, ఎవరికీ తెలియటం లేదు, మీరైనా చెప్పండి" అని కోరారు. ఆయన కూడా అదే పద్ధతిలో సమాధానం చెప్పాడు. సనాతనుడు అంటే నశించటం లేనివాడు, శాశ్వతమైనవాడు, అంటే భగవంతుడు అని. ఆ భగవంతుడు చెప్పిన ధర్మమే సనాతన ధర్మమని చెప్పారు. అది వేదాల్లో ఉండే ధర్మము అని చెప్పారు. ఇంతకూ భగవంతుడు చెప్పిన ధర్మం ఏమిటో, వేదాల్లో ఉన్న ధర్మమేదో చెప్పలేదు. అందరు ధర్మము అని వాడుతున్నారే తప్ప ధర్మం అంటే 'ఇది' అని స్పష్టంగా చెప్పలేక పోతున్నారు. అందువలన ఈ సమస్యను లోతుగా పరిశీలించాలి.

**ఎందుకు ధర్మమంటే ఫలానా అని చెప్పలేక పోతున్నారు?**

సనాతన ధర్మము అనేది సనాతనము, ధర్మము అనే రెండు పదాల కలయిక. ఈ రెండు పదాలు వ్యాకరణ రీత్యా కలువవచ్చు నేమో కాని, భావ రీత్యా కలువవు. పైగా వ్యతిరేకమైనవి. సనాతనము అంటే నశింపులేని, శాశ్వతమైన, మార్పులేని అనే అర్థాలు ఉన్నాయి. ఈ అర్థాలను అందరూ సులభంగానే చెప్తున్నారు. ధర్మం అనే పదం వివరించవలసి వచ్చేసరికి ధర్మం అంటే 'ఇది' అని ఇతిమిద్ధంగా చెప్పలేక పోతున్నారు. దాని ప్రధాన కారణం ధర్మానికున్న చలన స్వభావం. అంటే మార్పు చెందే స్వభావం. ధర్మం కాలానుగుణంగా మారుతూ ఉంటుంది. అందుకే చెప్పలేక పోతున్నారు.

**నిజంగా ధర్మం మారుతూ ఉంటుందా?**

ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలంటే ముందుగా ధర్మం అంటే ఏమిటో తెలుసుకోవాలి. ధర్మం అంటే సమాజం నియమ ప్రకారం ఆచరించేది. నియమం అంటే ఇలా జరగాలి అని చేసుకునే ఏర్పాటు. ఇంతకు ఈ నియమాలను ఎవరు రూపొందిస్తారు? నియమాలను ఆనాటి సమాజమే రూపొందించుకుంటుంది. సమాజం పురోగమిస్తున్న కొద్దీ, పాత ధర్మాలు సమాజపురోభివృద్ధికి ఆటంకాలుగా మారితే క్రొత్త సమాజానికి అనుగుణంగా ధర్మాలలో కూడా మార్పులు చేసుకుంటూ పోతుంటారు.

ధర్మంలో రెండు రకాలుంటాయి. మొదటిది, సామాజిక ధర్మం. రెండవది ప్రకృతి ధర్మం. ప్రకృతి ధర్మాన్ని ఎవరు రూపొందిస్తారు అంటే ప్రకృతే రూపొందించుకుంటుంది. మనం ఇప్పుడు ముందుగా సామాజిక ధర్మాన్ని గురించి చర్చించుకుందాం. చివరలో ప్రకృతి ధర్మాన్ని గురించి చర్చించుకుందాం.

సమాజంలో ధర్మం కాలానుగుణంగా మారుతూ ఉంటుంది. అది ఆనాడున్న ఆర్థిక సంబంధాలకు అనుగుణంగా ఉంటుంది. ఆర్థిక సంబంధాలకు అనుగుణంగా ధర్మం లేకపోతే ఆచరణ వికటిస్తుంది. ముందుగా మన సమాజంలో ధర్మాలు ఎలా మారాయో పురాణాలనుండే ఉదాహరణలుగా తీసుకుందాం.

కృతయుగంలో హరిశ్చంద్రుడు పాలించాడని, త్రేతాయుగంలో రామాయణం జరిగిందని, ద్వాపరయుగంలో మహాభారతం జరిగిందని, ప్రస్తుతం కలియుగం నడుస్తుందని, మనం కలియుగంలో ఉన్నామని పురాణవేత్తలు చెబుతారు. వీటినుండే మనం కొన్ని ఉదాహరణలు తీసుకుందాం.

**అబద్ధమాడరాదు అన్న ధర్మం**

హరిశ్చంద్రుడు సూర్యవంశంపు రాజు. అయోధ్యను రాజధానిగా చేసుకొని పాలించాడు. విశ్వామిత్రుడు అనే ఋషి తాను చేయబోయే యాగంకోసం ధనంకావాలని అడుగుతాడు. హరిశ్చంద్రుడు ఇస్తానంటాడు. తర్వాత తీసుకుంటానని వెళ్ళిపోతాడు. ఆ తర్వాత ఒక రోజు వచ్చి ధనం ఇమ్మంటాడు. ఎంత ధనం అని అడుగుతాడు హరిశ్చంద్రుడు. ఒక బలమైన ఏనుగుపై ఒక బలిష్టుడైన మనిషి ఎక్కి నిలుచొని ఒక రత్నాన్ని పైకి విసిరేస్తే ఎంత ఎత్తుగా ఎగురుతుందో అంత ఎత్తుధనం కావాలని అడుగుతాడు. అంత ధనం లేనందున నారాజ్యం మీకు ధారపోస్తాను, ధనాన్ని ఎలాగైనా తీసుకొచ్చి ఇచ్చి రాజ్యం తీసుకుంటానని చెప్పి హరిశ్చంద్రుడు రాజ్యాన్ని ఇచ్చేసి భార్యాబిడ్డలతో అడవికి వెళ్ళిపోతాడు. ఆ తర్వాత ఆ ధనం కోసం నానాపాట్లు పడతాడు. భార్యను దాసిగా పంపుతాడు. తనకు తాను ఒక కాటికాపరికి అమ్ముకుంటాడు. బిడ్డ పాముకాటుకు మరణిస్తాడు. చివరకు రాజాజ్ఞ ప్రకారం భార్యను నరికేయవలసి వచ్చినా వెనుకాడడు. ఎన్ని కష్టాలేదురైనా ఆడిన మాట తప్పరాదు అన్నది ఆనాటి ధర్మం.

ఇదే ద్వాపార యుగం వచ్చే సరికి కొంచెం మారుతుంది. కురుక్షేత్ర యుద్ధం జరుగుతూ ఉంటుంది. ద్రోణాచార్యుడి చేత అస్త్రసన్యాసం చేయించాలి. తన కొడుకైన అశ్వత్థామ మరణిస్తేగాని ఆయన అస్త్రసన్యాసం చేయడు. అందు వలన అశ్వత్థామ మరణించాడని

" స్త్రీలు యుద్ధంలో పాల్గొనరాదు అన్నది గత యుగాలలో సంప్రదాయం. అందుకే మహాభారత యుద్ధంలో పురుషులే పాల్గొన్నారు తప్ప స్త్రీలు పాల్గొనలేదు. నేటి యుగంలో అది మారింది. రాణీ రుద్రమదేవీ, మగువ మాంచాల, ఝాన్సీ లక్ష్మీబాయిల నుండి నేటి ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సోఫియా ఖురేషీ, వ్యోమికా సింగ్‌ల వరకు యుద్ధం చేసిన వారే. "

ద్రోణాచార్యునికి వినిపించేటంత బిగ్గరగా అశ్వత్థామ హతః (అంటే అశ్వత్థామ మరణించాడు) అని అరవమని కృష్ణుడు ధర్మరాజుకు చెబుతాడు. అశ్వత్థామ చనిపోలేదు కనుక అశ్వత్థామ చనిపోయాడని నేను అబద్ధమాడను అని ధర్మరాజు బదులిస్తాడు. వెంటనే కృష్ణుడు ఒక ఏనుగును తెప్పించి, దానికి అశ్వత్థామ అని పేరుపెట్టి చంపిస్తాడు. అప్పుడు అశ్వత్థామ హతః కుంజరః అని అరవమని చెప్పి ఎలా అరవాలో కూడా చెప్తాడు. ఆ మాట ప్రకారం ధర్మరాజు అశ్వత్థామ హతః అని ద్రోణాచార్యునికి వినపడేటంత బిగ్గరగా అరచి, కుంజరః అని ద్రోణాచార్యునికి వినబడనంత చిన్నగా అంటాడు. ఇక్కడ అశ్వత్థామ చనిపోయాడు, కానీ మనిషికాదు ఏనుగు అని చెప్పండ్వారా నిజం చెప్పినట్లు అయింది. అదేసమయంలో చనిపోయింది ఏనుగు అని వినబడకుండా చెప్పటంద్వారా ద్రోణాచార్యుణ్ణి మోసగించినట్లయింది. అంటే నిజం భాగాన్ని మింగేసి అబద్ధం భాగాన్ని బిగ్గరగా చెప్పాడు. అంటే అటు అబద్ధం కాకుండా, నిజం తెలుపకుండా మాట్లాడాడు. ఎన్ని కష్టాలేదురైనా అబద్ధమాడకూడదు అన్న హరిశ్చంద్రుని కాలపు ధర్మంనుండి, తమ పని నెరవేర్చుకోవటానికి నిజాన్నికూడా మోసపూరితంగా మార్చి చెప్పవచ్చు అన్నది ద్వాపరయుగంలో వచ్చిన మార్పు. అబద్ధము చెప్పరాదు అన్న ధర్మంలో మోసం అనే అంశం జొరబడింది.

ఇక కలియుగంలో బమ్మెర పోతన భాగవతాన్ని రచించాడు. అందులో కొన్ని సందర్భాలలో అబద్ధం ఆడటం తప్పు కాదని ఈ క్రింది పద్యం ద్వారా చెప్పాడు.

వారిజాక్షులందు, వైవాహికములందు,
ప్రాణవిత్త మాన భంగమందు
జకితగోకులాగ్రజన్మరక్షణమందు
బొంకవచ్చు నఘము బొందదధిప.

దీని అర్థం: ఓ రాజా! స్త్రీల విషయంలోను, వివాహ విషయాలలోనూ, ప్రాణం మీదకు వచ్చినప్పుడు, తన పరువు పోతున్నప్పుడు, భయంతో ఉన్న ఆవులు, బ్రాహ్మణుల ప్రాణాలను రక్షించటంలోనూ అబ్ధమాడవచ్చు. అది పాపంకాదు.

ఎంత ప్రాణం మీదకు వచ్చినా, ఎన్ని కష్టాలెదురైనా అబద్ధమాడరాదు అన్న హరిశ్చంద్రుని కాల ధర్మం, పని నెరవేర్చుకోవటానికి నిజాన్నికూడా మోసపూరితంగా మార్చి చెప్పవచ్చు అన్న విధంగా మారి, చివరకు స్త్రీలు, వివాహాలు, ప్రాణం మీదకు వచ్చినప్పుడు, పరువుపోతున్నప్పుడు, ఆవులు, బ్రాహ్మణుల ప్రాణాలను రక్షించవలసి వచ్చినప్పుడు అబద్ధమాడవచ్చు అనేవరకు మారింది. ప్రస్తుమైతే, ఎన్నికలప్పుడు ఏవాగ్దానాలైనా చేయవచ్చు, ఎన్నికలైనాక వాటిని పట్టించుకోనవసరం లేదు అని పాలకులే చెప్పే స్థాయికి ఈ ధర్మం దిగజారింది.

### స్త్రీ ధర్మం

భర్తకు ఎదురు చెప్పకూడదు, భర్తను ప్రశ్నించకూడదు అన్నది కృతయుగ ధర్మం. అందుకే హరిశ్చంద్రుని భార్య చంద్రమతి ఏనాడు భర్తకు ఎదురు చెప్పలేదు. భర్తతోపాటే అడవిలో కష్టాలనుభవించింది. అయినా భర్తను ఒక్కమాట అనలేదు. కాశీ పురవీధిలో దాసిగా అమ్మేయటానికి ఉంచినపుడు కూడా ఆమె ఎదురు చెప్పలేదు. దాసిగా కొనుక్కున్న వారి ఇంటికి మారాడకుండా వెళ్ళిపోయింది.

కానీ మహాభారత కాలంలో ధర్మరాజు జూదంలో ద్రౌపదిని ఓడిపోయిన తర్వాత, దుర్యోధనుడు ద్రౌపదిని సభకు తీసుకు రమ్మని ప్రతిగామిని పంపుతాడు. అప్పుడు ఆమె ధర్మరాజు అధికారాన్ని ప్రశ్నిస్తుంది. తానోడి నన్నోడెనా, నన్నోడి తానోడెనా, నేను ధర్మవిదితనా, అధర్మ విదితనా అని ప్రశ్నిస్తుంది. జూదంలో ముందు ధర్మారాజు ఓడిపోతే, భర్తతోపాటు భార్యకూడా ఓడిపోయినట్లే. ఇక తనను జూదంలో పణంగా పెట్టడం కుదరదు. లేక జూదంలో ముందు ద్రౌపదినే పణంగా పెట్టాలంటే, ధర్మరాజుకు ఆ అధికారంలేదు. కారణం ద్రౌపది కేవలం ఒక్క ధర్మరాజు భార్యమాత్రమే కాదు. మిగిలిన నలుగురు పాండవులకు కూడా భార్య. అందువలన ధర్మరాజు ఒక్కడే ఆమెను జూదంలో పణంగా పెట్టడం అధర్మం. అందువలననే నేను ధర్మ విదితనా, అధర్మ విదితనా అని ప్రశ్నించింది. అంటే భర్తను ప్రశ్నించే గొంతుక వినిపించింది.

ఇక కలియుగంలోకి వస్తే, భార్యాభర్తలిరువురూ సమానమే. భర్త స్త్రీని ప్రశ్నించినట్లుగానే భార్య కూడా భర్తను ప్రశ్నించవచ్చు.

ఇక కృత యుగంలో చంద్రమతిని దాసిగా కొన్న బ్రాహ్మణుడుకూడా చంద్రమతిని నీచంగా వక్రబుద్ధితో చూచినట్టుగా లేదు. రావణుడు సీతను తీసుకువెళ్లినప్పటికీ అశోకవనంలో ఉంచాడేతప్ప అత్యాచార ప్రయత్నం చేయలేదు. ఇక్కడవరకు స్త్రీని గౌరవంగానే చూశారు. కాని పాండవులు విరాట్‌రాజు కొలువులో అజ్ఞాతవాసంలో ఉన్నప్పుడు ద్రౌపది సైరంధ్రిగా పేరుమార్చుకొని దాసిగా పని చేస్తుంది. ఆ సందర్భంలో ద్రౌపదిని కీచకుడు బలాత్కారం చేస్తాడు. ఇక్కడ తమ ఇంటనున్న స్త్రీని గౌరవంగా చూడాలన్న ధర్మం మారిపోయింది.

ఇక మనుస్మృతిలో "పితారక్షతి కౌమారే, భర్తా రక్షతి యౌవనే, రక్షంతి స్థావిరేపుత్రా, నస్త్రీ స్వాతంత్రమర్హతి" అని ఉన్నది. అంటే బాల్యమునందు తండ్రి రక్షణలోనూ, యవ్వనంలో భర్త రక్షణలోనూ, వృద్ధాప్యమునందు కొడుకుల రక్షణలోనూ ఉండాలే తప్ప స్త్రీకి స్వతంత్రంగా ఉండే అర్హతలేదు అని అర్థం. స్త్రీకి స్వతంత్రంగా ఉండే అర్హతలేదు అన్న భావననుండి, స్త్రీకి స్వేచ్ఛకావాలి, స్వేచ్ఛగా జీవించాలి అన్న భావన నేడు మారింది.

స్త్రీలు యుద్ధంలో పాల్గొనరాదు అన్నది గత యుగాలలో సంప్రదాయం. అందుకే మహాభారత యుద్ధంలో పురుషులే పాల్గొన్నారుతప్ప స్త్రీలు పాల్గొనలేదు. నేటి యుగంలో అది మారింది. రాణీ రుద్రమదేవీ, మగువ మాంచాల, ఝాన్సీ లక్ష్మీబాయిల నుండి నేటి ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సోఫియా ఖురేషీ, వ్యోమికా సింగ్‌ల వరకు యుద్ధం చేసిన వారే. ఇటీవలన హోర్ముజ్ జలసంధిలో భారతనౌకపై బాంబుదాడి జరిగితే తమతోటి నేవి సిబ్బందిని కాపాడిందికూడా ఒకమహిళనే.

గత యుగాలలో స్త్రీకి రాజ్యాధికారం లేదు. నేటి కాలంలో స్త్రీలు దేశ పాలకులుగా ఉన్నారు.

### రాజ్యం పంపకాలు – రాజధర్మం

గతంలో రాచరికాలలో ఒక నియమం

“ధర్మం కాలానుగుణంగా మారుతూ ఉంటుందనడానికి ఎన్నో ఉదాహరణలు చెప్పకోవచ్చు. యుగానికనుగుణంగా యుగ ధర్మాలు మారాయని పురాణాలే చెబుతున్నాయి. సమాజం నిరంత రం అభివృద్ధి చెందుతుంది. సమాజం అభివృద్ధి చెందటం అంటే సమాజం లోని ఆర్థిక సంబంధాలు మార్పుచెందటమే. సమాజంలో ఆర్థిక సంబంధాలు మార్పుచెందు తున్న కొలదీ, దానికి అనుగు ణంగా సామాజిక ధర్మాలుకూడా మార్పు చెందవలసిందే. మార్పు చెందకపోతే సమాజం ముందుకు పోదు.”

ఉండేది. రాజుకు ఎంతమంది కొడుకులు ఉన్నప్పటికీ అందులో పెద్దకొడుకే రాజ్యాధికారానికి అర్హుడు. మిగిలిన కొడుకులు రాజ భోగాలను అనుభవించవచ్చు. అంతే తప్ప రాజ్యాధికారానికి అర్హులుకాదు. అయితే రామాయణంలో కైకేయి తనకుమారుడైన భరతుణ్ణి రాజుగా చేయాలని భావించింది. అందుకే రాముణ్ణి అడవికి పంపేలా చేస్తుంది. కాని రాముడు పెద్దవాడు. భరతుడు చిన్నవాడు. అందువలన భరతునికి రాజ్యాధికారం లేదు. రాముడు వనవాసానికి వెళ్లినప్పుడు భరతుడు రాజ్యపాలన చేయవలసి వస్తుంది. తాను రాజ్యాధికారానికి అర్హుడు కానందున, తన అన్న రాముని పాదుకలను సింహాసనంమీద ఉంచి తాను ప్రక్కన ఉండి పాలన నడిపించాడు. అది ఆనాటి ధర్మం.

ఇది భారతం కాలానికి మారిపోయింది. దృతరాష్ట్రుడు పెద్దవాడు, పాండురాజు చిన్న వాడు. అందువలన దృతరాష్ట్రుడు మాత్రమే రాజ్యాధికారానికి అర్హుడు. ఆ తర్వాత అతని కొడుకులు 100 మంది కౌరవులలో కూడా పెద్దవాడైన దుర్యోధనుడే రాజ్యానికి అర్హుడు. కానీ పాండవులు తమకు వాటా కావాలని డిమాండు చేశారు. దానిని కృష్ణుడు సమర్థిం చాడు. కారణం కృష్ణుడు కూడా తన కుటుం బంలో బలరామునికన్నా చిన్నవాడే. చిన్నవాళ్లకు కూడా రాజ్యాధికారం కావాలన్న డిమాండు ముందుకు వచ్చింది. దానికోసం కురుక్షేత్రయుద్ధం జరిగింది. కౌరవులు ఓడిపోయారు. చిన్నవారైన పాండవుల చేతికి రాజ్యాధికారం వచ్చింది. కుటుంబంలో పెద్దకొడుకుకే రాజ్యాధికారం అన్న ధర్మం మారిపోయింది. ఇప్పుడు తమ పూర్వీకుల ఆస్తిని పిల్లలందరూ సమానంగా పంచుకోవాలన్న ధర్మం చెలామణిలో ఉన్నది.

### యుద్ధ ధర్మం

రాముడు రావణునితో యుద్ధం చేసినప్పుడు కానీ, భారతంలో కురుక్షేత్రయుద్ధం జరిగినప్పు నడు కానీ, పగలు మాత్రమే యుద్ధంచేయాలనీ, నిరాయుధుల మీద యుద్ధం చేయరాదన్న ధర్మం ఉండేది. అది పాటించేవారు. కానీ అదే కురుక్షేత్ర యుద్ధంలో నిరాయుధుడైన దుర్యోధనుణ్ణి, భీముడు చంపుతాడు. నేడు యుద్ధాలన్నీ రాత్రి పూటే జరుగుతున్నాయి. నిరాయుధులే చనిపోతున్నారు. అంటే యుద్ధంలో అనుసరించే ధర్మం మారిపోయింది.

అంతేకాదు ధర్మం అనేది చూచే కోణాన్ని బట్టి ఉంటుందన్నది మహాభారతం చెబుతు న్నది. కురుక్షేత్రయుద్ధం అనంతరం అంపశయ్య మీద పడుకుని ఉన్న భీష్ముని వద్దకు కృష్ణుడు వెళ్తాడు. అప్పుడు భీష్ముడు ఈ యుద్ధం ధర్మం గా జరిగిందంటావా అని కృష్ణుదుని అడుగు తాడు. “కౌరవుల వైపునుండా లేక పాండవు లవైపు నుండా? ఎవరివైపు నుండి?” అని కృష్ణుడు అడుగుతాడు. కౌరవుల వైపునుంచి చూస్తే పెద్దవాళ్లదే రాజ్యాధికారం. చిన్న వారైన పాండవులకు పంచి ఇవ్వనవసరంలేదు. అందువలన రాజ్యాన్ని నిలుపుకోవటం కోసం కౌరవులు చేసింది ధర్మయుద్ధం, పాండవులు చేసింది అధర్మయుద్ధం. ఇక పాండవుల వైపునుండి చూస్తే, చిన్న వారికి కూడా రాజ్యాధి కారం కావాలి అని పాండవులు యుద్ధం చేశారు. అందువలన పాండవుల వైపునుండి చూస్తే పాండవులు చేసిన యుద్ధం ధర్మబద్ధ మైనది. అందువలన ధర్మంకూడా చూసే కోణాన్ని బట్టి ఉంటుంది.

ఇలా ధర్మం కాలానుగుణంగా మారుతూ ఉంటుందనడానికి ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. యుగానికనుగుణంగా యుగ ధర్మాలు మారాయని పురాణాలే చెబుతున్నాయి. సమాజం నిరంతరం అభివృద్ధి చెందుతుంది. సమాజం అభివృద్ధి చెందటం అంటే సమాజం లోని ఆర్థిక సంబంధాలు మార్పుచెందటమే. సమాజంలో ఆర్థిక సంబంధాలు మార్పుచెందు తున్న కొలదీ, దానికి అనుగుణంగా సామాజిక ధర్మాలుకూడా మార్పు చెందవలసిందే. మార్పు చెందకపోతే సమాజం ముందుకు పోదు.

### మార్పు చెందుతున్న ప్రకృతి ధర్మాలు

చివరిగా ప్రకృతి ధర్మాలు ఎలామారుతూ వచ్చాయో సంక్షిప్తంగా పరిశీలిద్దాం. కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం భూమి చాలా వేడిగా ఉండేది. అది చల్లబడే క్రమంలో అగాధాలు ఏర్పడ్డాయి. ఆకాలంలో సంవత్సరాల తరబడి వర్షాలు కురిసేవి. అలా కురవటం వలన ఆ అగాధాలలో నిలచిన నీరే సముద్రాలుగా ఏర్పడ్డాయి. ఏళ్ల తరబడి కురిసేవానలు క్రమేణా ఏడాదిలో కొన్ని రోజులపాటు నియమాను సారంగా కురవటం జరిగింది. ఇప్పుడు, ఆ నియమాలు కూడా మారి ఎప్పుడుబడితే అప్పుడు కురవటం, లేదా కొన్ని నెలలపాటు అసలు వానలు లేక పోవటం జరుగుతున్నది.

ఇదేకాదు పరిస్థితులనుబట్టి పదార్ధ ధర్మాలుకూడా మారతుంటాయి. సున్నం తెల్లగా ఉంటుంది. పసుపు పచ్చగా ఉంటుంది. రెండిం టినీ కలిపితే జేగురు రంగు (పారాణి రంగు) గా మారుతుంది. ఈ జేగురు రంగును తిరిగి తెలుపుగానూ, పచ్చగానూ మార్చటం కుదరదు. అదేవిధంగా వగరుగా, చేదుగా ఉండే వేపపం దును, పుల్లగా ఉండే చింతచిగురుతో కలిపి నలిపితే తియ్యగా మారుతుంది. తిరిగి చేదుగా పులుపుగా మార్చటం కుదరదు. బియ్యానికి నీరు కలిపి వేడిచేస్తే అన్నంగా మారుతుంది. అన్నాన్ని తిరిగి బియ్యంగా మార్చటం కుదరదు. ఇవన్నీ పాత ధర్మాన్నుండి క్రొత్త ధర్మానికి మారటమే. తిరిగి పాతధర్మానికి వెళ్ళటం కుదరదు. తల్లిగర్భంలో బిడ్డపెరిగి, బయటకు వచ్చి పెరిగి పెద్దవారవుతారు. ఆ మనిషి చివరకు చనిపోయి మరికొన్ని పదార్ధాలుగా విడిపోవల్సిందే తప్ప తిరిగి తల్లిగర్భంలోకి వెళ్ళటం సాధ్యపడదు.

పైవిషయాలన్నీ ధర్మం - ప్రకృతి ధర్మం గానీ, సామాజిక ధర్మం గానీ- మార్పు చెందు తుంది అని చెప్పటానికి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటివి కోకొల్లలుగా ఉన్నాయి. ధర్మం నిరంతరం మారుతుందని, శాశ్వతంగా అంటే సనాతనంగా ఉండదు అని పై ఉదా హరణలు నిరూపిస్తున్నాయి. ప్రకృతిలో ప్రతిదీ మారుతూ ఉంటుంది. మార్పు అనేది ప్రకృతి ధర్మం. సమాజం కూడా ప్రకృతిలో భాగమే. కనుక ప్రకృతితో బాటు సమాజం, సమాజం తోబాటు అందులో ఉన్న ధర్మాలు మారతాయి. మారి తీరుతాయి అని సమాజ చరిత్ర నిరూపించింది. కనక సనాతన ధర్మాన్ని గురించి ప్రశ్నిస్తే, తల తీసేస్తాం, నాలుకలు కోసేస్తాం అనేవారు, తాము నిఖార్సైన సనాతనీలని చెప్పుకునేవారు ఈ విషయాలన్నింటినీ పరిశీలిం చాలి. అప్పటికీ ధర్మం అనేది సనాతనమైనది అంటే శాశ్వతమైనది, మార్పులేనిది అంటే, ఆ మార్పుచెందని ధర్మమేదో వివరించాలి. *

# 13 -14 శతాబ్దాల్లో దక్షిణ భారతదేశం



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకులు

ఎంవిఎస్ శర్మ

దక్షిణ భారతదేశంలో ఆధిపత్యం చలాయించిన చాళుక్యులు, చోళుల సామ్రాజ్యాలు 12వ శతాబ్దంతో దాదాపు అంతమయ్యాయి. ఆ తర్వాత సుమారు రెండు శతాబ్దాల పాటు ఈ ప్రాంతంలో ప్రధానమైన రాజ్యాలు నాలుగు కొనసాగాయి. తమిళనాడు ప్రాంతంలో పాండ్యులు, కర్నాటక ప్రాంతంలో హొయసలలు, తెలుగునాట కాకతీయులు, కర్నాటకకు ఎగువన యాదవులు బలమైన శక్తులుగా ఉండేవారు. వీరు గాక కేరళ ప్రాంతంలో చేరులు, కళింగ ప్రాంతంలో గాంగులు ఉండేవారు. నెల్లూరు ప్రాంతానికి పరిమితమైన శక్తిగా తెలుగు చోళులు ఉండేవారు.

ఈ రాజ్యాధిపతులు అందరూ తమ తమ ప్రాబల్యాన్ని విస్తరించుకోడానికి తరచూ పొరుగు రాజ్యాలతో యుద్ధాలకు సిద్ధపడేవారు. 13, 14 శతాబ్దాల కాలం అంతా ఈ పరస్పర యుద్ధాలతో గడిచి పోయిందనే చెప్పాలి. (చూ. మ్యాప్, దక్షిణ భారతదేశం)

**పాండ్యులు:** 1216లో సుందర పాండ్యుడు సింహాసనాన్ని ఎక్కాక కులోత్తుంగ చోళుడిని, అతడి యువరాజైన 3వ రాజరాజచోళుడిని ఓడించి తంజావూరును స్వాధీనం చేసుకున్నాడు. అప్పుడు కులోత్తుంగుడు హొయసల రాజు 2వ బల్లాలుడిని సహాయం కోరాడు. కులోత్తుంగుడికి 2వ బల్లాలుడి సైన్యం తోడైంది. అప్పుడు సుందరపాండ్యుడు సంధికి దిగివచ్చాడు. పాండ్యుల సార్వభౌమత్వాన్ని అంగీకరించిన కులోత్తుంగుడు తిరిగి తన రాజ్యాన్ని పొందాడు. కులోత్తుంగుడి తర్వాత గద్దెనెక్కిన 3వ రాజరాజచోళుడు బలహీనుడు. తూర్పు నుంచి ఓఢ్ర సైన్యాలు శ్రీరంగం వరకూ చొచ్చుకువచ్చినా నిలవరించలేకపోయాడు. అప్పుడు 1225లో సుందర పాండ్యుడు ఓఢ్రులను వెనక్కి తరిమి, 3వ రాజరాజచోళుడిని దించి ఆ ప్రాంతాన్ని మరోసారి స్వాధీనం చేసుకున్నాడు. ఐతే మరోసారి హొయసల రాజు 2వ నరసింహుడి సైన్యం మళ్ళీ 3వ రాజరాజ చోళుడికి మద్దత్తుగా రంగంలోకి దిగింది. 1231లో మళ్ళీ 3వ రాజరాజ చోళుడు గద్దెనెక్కాడు.

ఇలా పాండ్య, చోళ, హొయసల రాజ్యాల నడుమ యుద్ధాలు దీర్ఘకాలం పాటు కొన సాగాయి. చివరికి ఆ రాజ్యాల పాలక వంశస్తులు పరస్పరం వివాహ సంబంధాలు కుదుర్చుకుని యుద్ధాలకు తెర దించారు. ఐతే, చోళ, పాండ్య రాజ్యాల మీద హొయసల రాజుల పెత్తనం క్రమంగా పెరుగుతూవచ్చింది. 2వ నరసింహుడి కుమారుడు సోమేశ్వరుడు చోళ, పాండ్య రాజ్యాల వ్యవహారాల్లో ఎక్కువగా జోక్యం చేసుకున్నాడు. 3వ రాజరాజ చోళుడి కుమారుడు 3వ రాజేంద్ర చోళుడు. 1246లో ఇతడు చోళ రాజ్యానికి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి పూనుకున్నాడు. పాండ్యులమీద దాడులకు దిగి ఓడించాడు. అప్పుడు సోమేశ్వరుడు ఈ సారి పాండ్యులకు బాసటగా నిలిచాడు. పాండ్యులతో కలిసి రాజేంద్రుడిని ఓడించి సంధి చేశాడు.

1251లో అధికారంలోకి వచ్చిన జాతవర్మ సుందర పాండ్యుడు శక్తివంతంగా పాలించాడు. నెల్లూరు వరకూ తన ఆధిపత్యాన్ని విస్తరించాడు. దక్షిణాన శ్రీలంకకు కూడా విస్తరించాడు. హొయసలుల ప్రభావాన్ని కర్నాటక ప్రాంతానికి పరిమితం చేశాడు. చోళరాజు రాజేంద్రుడు సుందర పాండ్యుడి సార్వభౌమాధికారానికి తలొగ్గక తప్పలేదు. పాండ్య రాజ్యానికి కాంచీపురం రెండవ రాజధాని అయింది. ఆ తర్వాత సుందర పాండ్యుడు చేర రాజ్యం (కేరళ) మీదకు దండెత్తి ఆ ప్రాంతాన్ని విధ్వంసం చేశాడు. 1262లో హొయసల రాజు సోమేశ్వరుడు సుందర పాండ్యుడితో జరిపిన యుద్ధంలో మరణించాడు. హొయసలులతో, శ్రీలంకతో, చేరులతో జరిపిన యుద్ధాలలో ఆ ప్రాంతాల సంపదను చాలా కొల్లగొట్టి తెచ్చాడు సుందరపాండ్యుడు. 1265లో సుందర పాండ్యుడి మరణం తర్వాత కులశేఖరుడు అధికారం చేపట్టాడు. పాండ్యుల ప్రాబల్యాన్ని మరింత పటిష్టం చేశాడు. ఆ తర్వాత అతడి కుమారుల నడుమ రాజ్యాధిపత్యం కోసం జరిగిన అంతర్గత పోరులో డిల్లీ సుల్తానుల సేనాని మాలిక్ కాఫిర్ జోక్యం చేసుకోడానికి అవకాశం చిక్కింది. ఆ తర్వాత పాండ్యరాజ్య వైభవం క్షీణించింది.


**హొయసలులు:** శక్తివంతుడైన సోమేశ్వరుడి కాలంలో హొయసల రాజ్యం బలంగా ఎదిగింది. బలమైన గజ దళాలు ఆ సైన్యంలో ఉండేవి. ఐతే, సోమేశ్వరుడి మరణంతో హొయసల రాజ్యం బలహీన పడింది. అతడి కుమారుల నడుమ రాజ్యం పంపకం అయింది. ఉత్తరభాగం పెద్ద కుమారుడు 3వ నరసింహుడికి, దక్షిణ భాగం రెండో కుమారుడు రామనాధుడికి వచ్చాయి. రామనాధుడు దక్షిణాన పాండ్యులతో పోరాడి గతంలో కోల్పోయిన తమిళ ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. ఉత్తరాన తన సోదరుడితో కూడా తలపడి చాలా భాగాన్ని ఆక్రమించుకున్నాడు. 3వ నరసింహుడి కుమారుడు 3వ బల్లాలుడు గద్దెనెక్కాక మళ్ళీ హొయసల రాజ్యం ఒకే రాజ్యంగా ఐక్యం అయింది. ఐతే, ఉత్తరం నుండి యాదవులతో,

తూర్పున కాకతీయులతో పోరు కొనసాగుతూ వచ్చింది.

**యాదవులు:** కర్నాటకకు ఉత్తర భాగాన యాదవ రాజ్యం ఉండేది. 1200–1247 మధ్య పాలించిన సింగన హయాంలో యాదవ సామ్రాజ్యం బలంగా ఎదిగింది. ఉత్తరాన గుజరాత్ మీద 1231–32లో ఒకసారి, 1237–38 లో మరొకసారి యుద్ధానికి దిగి ఓడించాడు. హొయసలుల స్వాధీనంలో ఉన్న కృష్ణా నది దక్షిణ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాడు. సింగన మనుమడు కృష్ణుడు తాత అనంతరం గద్దెనెక్కాడు. సింగన కాలంలో నెలకొల్పిన రాజ్యాన్ని నిలబెట్టుకోగలిగాడు. అతడి అనంతరం, అతడి సోదరుడు మహదేవుడు 1260–1271 మధ్య పాలించాడు. హొయసలుల నుంచి ఉత్తర కొంకణ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాడు. కాకతీయ రాజ్యాన్ని పాలించిన రుద్రమదేవిని ఓడించాడు. మహిళ గనుక ప్రాణాలతో విడిచిపెట్టాడు. మహదేవుడి మరణం తర్వాత కృష్ణుడి కుమారుడు రామచంద్రుడు రాజ్యం చేపట్టాడు. సింగన కాలం నుండి రామచంద్రుడి కాలం వరకూ యాదవులు కాకతీయులతో, హొయసలులతో వైరాన్ని కొనసాగిస్తూనే వున్నారు.

**కాకతీయులు:** దక్షిణాపథాన మరొక బలమైన రాజ్యం కాకతీయులది. 12వ శతాబ్దంలో ఆంధ్రప్రాంతంలో వెలనాటి చోడులు బలహీనపడిన అనంతరం నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితుల్లో గణపతిదేవుడు కాకతీయ రాజ్యాన్ని బలంగా తయారు చేశాడు. కృష్ణానదిని దాటి తూర్పున గోదావరి పరీవాహక ప్రాంతమంతటికీ విస్తరించాడు. నెల్లూరు తెలుగు చోడులు కాకతీయుల సార్వభౌమాధికారానికి అంగీకరించారు. కళింగ రాజ్యం పాలకుడు అనంగ భీముడి (1211–38) సేనలు గోదావరి తీరాన్ని దాటి ఇవతలికి రాకుండా గణపతిదేవుడు నిలువ రించాడు. మోతుపల్లి రేవు ద్వారా జరిగే వాణిజ్యాన్ని నియంత్రించాడు. గణపతిదేవుడి అనంతరం అతడి కుమార్తె రుద్రమదేవి అధికారం చేపట్టింది. ఆమె అధికారాన్ని కొందరు సామంతులు సవాలు చేశారు. ఐతే, తనకు విశ్వాసపాత్రులుగా ఉన్న సేనాధిపతుల తోడుతో రుద్రమదేవి ఆ తిరుగుబాట్లను అణచివేయగలిగింది. యాదవరాజు మహదేవుడు కాకతీయ రాజ్యం మీదకు దండెత్తివచ్చి రుద్రమదేవిని ఓడించాడు. ఐతే, కొంత సంపదను కొల్లగొట్టుకుపోయి రాజ్యాన్ని ఆక్రమించుకోకుండా విడిచిపెట్టాడు.

“దక్షిణాపథాన మరో బలమైన రాజ్యం కాకతీయులది. 12వ శతాబ్దంలో ఆంధ్ర ప్రాంతంలో వెలనాటి చోడులు బలహీనపడిన తరువాత నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితుల్లో గణపతిదేవుడు కాకతీయ రాజ్యాన్ని బలంగా తయారు చేశాడు. కృష్ణానదిని దాటి తూర్పున గోదావరి పరీవాహక ప్రాంతమంతటికీ విస్తరించాడు. నెల్లూరు తెలుగు చోడులు కాకతీయుల సార్వభౌమాధికారానికి అంగీకరిం చారు. కళింగ రాజ్యం పాలకుడు అనంగ భీముడి (1211-38) సేనలు గోదావరి తీరాన్ని దాటి ఇవతలికి రాకుండా గణపతిదేవుడు నిలువ రించాడు.”




**13, 14 శతాబ్దాల నాటి దక్షిణ భారత దేశ పటం**

1280లో రుద్రమదేవి మనుమడు ప్రతాపరుద్రుడు యువరాజుగా నియమితుడయ్యాడు. అప్పటివరకూ రుద్రమదేవికి విశ్వాసపాత్రుడిగా నిలచిన సేనాని అంబదేవుడు తిరుగుబాటు చేశాడు. అందుకు హొయసలులనుండి, యాదవులనుండి సహాయం తీసుకున్నాడు. కానీ ఆ తిరుగుబాటును ప్రతాపరుద్రుడు సమర్థవంతంగా అణచివేశాడు. 1326 వరకూ కాకతీయ

> “ తెలుగుచోడుల రాజ్యం నెల్లూరు ప్రాంతంలో, ప్రధానంగా పెన్నా పరీవాహక ప్రాంతంలో సాగింది. అప్పట్లో మోతుపల్లి ఒక ముఖ్య రేవుగా ఉండేది. దానిపై ఆధిపత్యం వహించిన తెలుగు చోడులు పరిమిత ప్రాంతానికే తమ అధికారాన్ని కొనసాగించారు. దక్షిణాన చోళులతో ఉత్తరాన కాకతీయులతో మైత్రి పాటించారు. దాంతో చోళులతో శత్రుత్వం ఉన్న పాండ్యులతో, కాకతీయులతో వైరం ఉన్న హొయసలులతో వైరాన్ని పాటించక తప్పలేదు. ”

సామ్రాజ్యాన్ని పాలించాడు. రాయచూరు దాకా తన రాజ్యాన్ని విస్తరించాడు. పరిపాలనాదక్షుడిగా పేరు పొందిన ప్రతాపరుద్రుడు పాలనాధికారాలను వికేంద్రీకరించాడు. రాజ్యాన్ని 77 భాగాలుగా విభజించి ఒక్కో భాగానికీ ఒక్కో నాయకుడిని నియమించాడు. పద్మనాయక కులానికి చెందినవారిని మాత్రమే నాయకులుగా ఎంపిక చేశాడు. ఉత్తరం నుంచి సాగిన ఢిల్లీ సుల్తానుల దాడులతో ప్రతాపరుద్రుడి పాలన, కాకతీయుల వైభవం అంతమయ్యాయి.

**గాంగులు:** కళింగ ప్రాంతం (దక్షిణ ఒడిశా) 1198 నుండి 1432 వరకూ గాంగుల వంశం పాలనలో ఉంది. అనంత వర్మ చోడ గాంగుడు ఈ రాజ్యాన్ని నిర్మించ డంలో ముఖ్యుడు. అతడి మనుమడు 3వ రాజరాజు 1198 నుండి 1211 వరకూ పరిపాలించాడు. అతడి కాలంలో బెంగాల్ వైపు నుంచి వచ్చిన ఢిల్లీ సుల్తానుల ప్రతినిధి భక్తియార్ ఖిల్జీ సేనలను మహానది దాటి కళింగ సీమలోకి ప్రవేశించకుండా తిప్పికొట్టాడు. అతడి తర్వాత పాలనలోకి వచ్చిన అనంగ భీముడు శక్తివంతుడు. 1224 వరకూ పాలించాడు. అతడి సైన్యాలు దక్షిణాన కాంచీపురం వరకూ చొచ్చుకుపోగలిగాయి. 1238 నుండి 1264 వరకూ పాలించిన నరసింహుడి కాలంలో కూడా గాంగులు బలంగా నిలిచి బెంగాల్ వైపు నుండి జరిగిన దాడులను తిప్పికొట్ట గలిగారు. ఐతే, 1306-28 మధ్య కాలంలో పాలించిన భానుదేవుడి కాలంలో తుగ్లఖ్ సైన్యాలతో జరిగిన యుద్ధంలో ఓడిపోయి, అనంతరం ఢిల్లీకి సామంతులుగా వ్యవహ రించారు. గాంగుల వంశంలో చివరివాడు 4వ భానుదేవుడు. 1414 నుంచి 1432 వరకూ పాలించాడు. అతడు సంతానహీనుడు కావడంతో అతడి సేనాని కపిలేశ్వర గజపతి అధికారం లోకి వచ్చాడు. అప్పటినుంచీ గజపతుల వంశ పాలన మొదలైంది.

**నెల్లూరు:** తెలుగుచోడుల రాజ్యం నెల్లూరు ప్రాంతంలో, ప్రధానంగా పెన్నా పరీవాహక ప్రాంతంలో సాగింది. అప్పట్లో మోతుపల్లి ఒక ముఖ్య రేవుగా ఉండేది. దానిపై ఆధిపత్యం వహించిన తెలుగుచోడులు పరిమిత ప్రాంతానికే తమ అధికారాన్ని కొనసాగించారు. దక్షిణాన చోళులతో ఉత్తరాన కాకతీయులతో మైత్రి పాటించారు. దాంతో చోళులతో శత్రుత్వం ఉన్న పాండ్యులతో, కాకతీయులతో వైరం ఉన్న హొయసలులతో వైరాన్ని పాటించక తప్పలేదు.

**చేర (కేరళ)** చేర రాజ్యం కొల్లం రాజధానిగా ఏర్పడింది. రవివర్మ కులశేఖరుడి కాలంలో కొంత బలపడింది. కాంచీపురం వరకూ విస్తరించింది. రవివర్మ పండితుడిగా పేరు పొందినవాడు.

### 12, 13 శతాబ్దాలలో సామాజిక, సాంస్కృతిక చిత్రం

ఈ కాలంలో ఉత్తర భారతంలోకి మధ్య ఆసియా నుండి వలసలు వచ్చిన తురుష్కులు, ఇతర తెగల వారు రావడం, సైనికంగా, ఆర్థికంగా, వాణిజ్య పరంగా అనేక మార్పులు జరగడం మనం చూశాం. మధ్య ఆసియా, చైనా లతో వాణిజ్య పరంగా కలిగిన సంపర్కం మెరుగైన వ్యవసాయ పద్ధతులనూ, సాంకేతిక పరిజ్ఞానాన్నీ అందించింది. పరిపాలనా పద్ధతులలో కూడా మార్పులు వచ్చాయి. కానీ ఇదే కాలంలో దక్షిణాన రాజ్యా లన్నీ పరస్పరం వైరంలో మునిగితేలాయి. ఆ ప్రభావం మన గమనంలో ఉండాలి.

ఇక్కడ ప్రతీ యుద్ధం తర్వాత రాజ్యాల సరిహద్దులు మారిపోతూవచ్చాయి. ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి ఒక్కోసారి వలసలు పోవలసిన పరిస్థితులు ప్రజలకు వచ్చాయి. కొత్త ప్రాంతానికి వలస వచ్చాక అక్కడి పరిస్థితులతో సర్దుబాట్లు చేసుకో వలసివచ్చింది. ఆర్థిక, సామాజిక మార్పుల మీద వాటి ప్రభావం పడింది.

ఐతే, కుంతల, ఆంధ్ర, తొండైనాడు, చోళ, పాండ్య, చేర, కళింగ ప్రాంతాలుగా కొన్ని ప్రత్యేకతలు కలిగిన ప్రాంతాలు రూపొందాయి. ఆయా ప్రాంతాల ప్రత్యేకతలతో కూడిన సంస్కృతి, జీవన విధానం, భాష రూపొందుతూ వచ్చాయి. రాజకీయ అస్థిరత మధ్య పెంపొందిన ధోరణి ఇది.

సామాజిక, ఆర్థిక రంగాలలో కులవ్యవస్థ బలమైన ప్రభావం కలిగివుండేది. వైశ్యుల, చేతివృత్తిదారుల ప్రాధాన్యత క్రమంగా పెరుగుతూవచ్చింది. వ్యవసాయం, పారిశు ధ్యం, చర్మకారవృత్తి వంటివి ప్రధానంగా శూద్రుల, దళితుల శారీరక కష్టంతో నిర్వహించబడేవి. ఐతే, ఆ కులాల వారు నవ ర్ణుల నివాసాలకు దూరంగా ఉండవలసివచ్చేది. విద్య ప్రధానంగా అగ్ర కులాలవారికే, అందునా, బ్రాహ్మణులకే ఎక్కువగా పరిమితం అయింది. బ్రాహ్మణులకు అగ్రహారాలను ఇచ్చి వారి ద్వారా కుల కట్టుబాట్లను అమలు చేయించడం కొనసాగింది. దేవాలయాలు పాలకుల ఆధిపత్యానికి చిహ్నాలుగా పరిగణించబడేవి. రాజులు దండయాత్రలలో కొల్లగొట్టిన ధనంలో కొంత భాగాన్ని దేవాలయాలకు కానుకగా ఇచ్చేవారు. ఇక గెలిచిన రాజులు ఓడించిన ప్రాంతాలలోని దేవాలయాలను కొల్లగొట్టడం పరిపాటి. **ఆయా రాజుల మత విశ్వాసాలకు, దేవాలయాలను కొల్లగొట్టడానికి ఎటువంటి సంబంధమూ లేదు.**

కౌలు విధానం వ్యవసాయంలో విస్త రించింది. దేవాలయాల, మఠాల భూములను కౌలు రైతులే సాగు చేసేవారు. రైతులమీద శిస్తుల భారం ఎక్కువగా ఉండేది. పాడిపశు వులలో అత్యధికభాగం దేవాలయాలకు, సత్రాలకు చెందినవే ఉండేవి. వాటిని సాకే వృత్తిలో పశువుల కాపరులు నియోగించ బడేవారు. రోడ్లు, కాలువలు నిర్మించే పనుల్లో నియోగించబడ్డ గ్రామస్తులు ఆ పనికి ఏ ప్రతిఫలమూ లేకుండానే చేయవలసివచ్చేది.

ఉత్పత్తి అయిన సంపదలో అధికభాగం స్థానిక వినియోగానికే సరిపోయేది. చేనేత బాగా అభివృద్ధి చెందింది. నేతగాళ్ళ గిల్డులు శక్తివంతంగా వ్యవహరించేవి. మేలురకం వస్త్రాలు ఎక్కువగా ఎగుమతయ్యేవి. ఆభరణాల తయారీ మరొక ప్రతిష్టాత్మక

వృత్తిగా ఉండేది. ఉప్పు తయారీ, అమ్మకం ప్రధానంగా ప్రభుత్వ ఆధీనంలో జరిగేది.

సుగంధద్రవ్యాలు, గంధపు చెక్కలు, ఏనుగు దంతాలు, వెదురు, రంగురాళ్ళు, నీలిమందు, పత్తి, నూలు ప్రధానంగా ఎగుమతయ్యే సరుకులు. ఎగుమతుల కన్నా దిగుమతులు తక్కువగా ఉండేవి. దాని వలన వాణిజ్యం ద్వారా దేశంలోకి వచ్చే బంగారు, వెండి నాణేలు ఎక్కువగా ఉండేవి. ఐతే, ఇవి ఎక్కువగా రాజుల వద్ద, వ్యాపారుల వద్ద పోగుబడ్డాయి.

"తమిళ భాష చాలా ప్రాచీన మైనది. క్రీ.శ. ఒకటవ శతాబ్దం నాటి తమిళ సాహిత్యం లభిస్తోంది. ఐతే, క్రమంగా తమిళం మీద సంస్కృత భాష, వైదిక (బ్రాహ్మణ) సంస్కృతి ప్రభావాలు పెరుగుతూ వచ్చాయి. భాషాపరంగా ఈ సంపర్కం వలన తమిళం అభివృద్ధి చెందింది. పలు సంస్కృత రచనలను తమిళంలోకి అనువాదం చేశారు. శైవ, వైష్ణవ సాంప్రదాయాలతో ముందుకొచ్చిన భక్తి ఉద్యమం జన సామాన్యంలోకి చొచ్చుకుపోడానికి తమిళంలో చాలా సాహిత్యాన్ని ఉత్పత్తి చేసింది."




కోణార్కులోని సూర్య దేవాలయం

**భాషలు**

దక్షిణాది భాషలు దేనికదే పెంపొం దినప్పటికీ, వీటన్నింటిమీదా తర తమ తేడాలతో సంస్కృత భాష ప్రభావం బలంగా పడింది. కుల వ్యవస్థను సమర్థించడానికి రూపొందిన శ్రౌత, గృహ్య, ధర్మ సూత్రాలు సంస్కృతంలో రాయబడివున్నాయి. ప్రజలు సులభంగా అర్థం చేసుకోలేని భాషలో ఉండడం వలన వాటిని ధర్మం పేరు చెప్పి అమలు చేయడం బ్రాహ్మణులకు తేలిక అయింది. అందుచేత బ్రాహ్మణులు అన్ని రాజ్యాలలోనూ సంస్కృత భాషను ఉపయోగించడానికి పూనుకున్నారు. దానిని పండిత భాషగా పరిగణించడం మొదలైంది. ఆ భాషా పదాలు స్థానిక భాషలలోకి ప్రవేశించసాగాయి.

చేర రాజులు సంస్కృతాన్ని బాగా ప్రోత్స హించారు. పలు సంస్కృత రచనలు వెలు వడ్డాయి. హొయసల రాజు 3వ బల్లాలుడి కాలంలో అలంకార సర్వస్వం, కావ్య ప్రకాశ అనే రెండు ముఖ్యమైన కావ్యాలు వచ్చాయి. యాదవ రాజ్యంలో జగదేక మల్లుడు సంగీత చూడామణి అన్న గ్రంధాన్ని రచించాడు. సంగదేవుడు సంగీత రత్నాకరం అన్న రచన చేశాడు.

**తమిళం:** తమిళ భాష చాలా ప్రాచీన మైనది. క్రీ.శ. ఒకటవ శతాబ్దం నాటి తమిళ సాహిత్యం లభిస్తోంది. ఐతే, క్రమంగా తమిళం మీద సంస్కృత భాష, వైదిక (బ్రాహ్మణ) సంస్కృతి ప్రభావాలు పెరుగుతూ వచ్చాయి. భాషాపరంగా ఈ సంపర్కం వలన తమిళం అభివృద్ధి చెందింది. పలు సంస్కృత రచనలను తమిళంలోకి అనువాదం చేశారు. శైవ, వైష్ణవ సాంప్రదాయాలతో ముందుకొచ్చిన భక్తి ఉద్యమం జన సామాన్యంలోకి చొచ్చుకుపోడానికి తమిళంలో చాలా సాహిత్యాన్ని ఉత్పత్తి చేసింది. బౌద్ధ, జైన సాంప్రదాయాలు కూడా బలమైన ప్రభావాన్ని చూపాయి. తమిళంలో రామాయణాన్ని తనదైన వ్యాఖ్యానంతో రచించి ప్రసిద్ధుడైన కవి కంబన్ 3వ కులోత్తుంగుడి కాలంనాటి వాడు. సెక్కిలర్ రచించిన పెరియ పురాణం (శైవం), జైనాన్ని ప్రబోధించిన నేమినాథం అన్న గ్రంథం ఈ కాలంనాటివే. ఇవి చాలా ప్రసిద్ధి పొందిన రచనలు.

**కన్నడం:** తమిళం తర్వాత ఎక్కువగా ప్రాచీన సాహిత్యం లభిస్తున్న దక్షిణాది భాష కన్నడం. హొయసల రాజులు కన్నడాన్ని ప్రోత్స హించారు. రామాయణాన్ని జైన వ్యాఖ్యానంతో నాగచంద్ర అన్న కవి 1105లో రచించాడు. దాని పేరు రామచంద్ర పురాణ. పశు వైద్యం మీద కిరిట్టివర్మ గోవైద్య అన్న గ్రంథం రచించాడు. కన్నడంలో రచనలు ఈ కాలంలో ఎక్కువగా చంపూ అనే శైలిలో వచ్చాయి. 1260 లో కేశిరాజు అనే పండితుడు శబ్దమణిదర్పణ అన్న కన్నడ వ్యాకరణ గ్రంధాన్ని రచించాడు. లింగాయత్ రచయిత హరీశ్వర 1వ నరసింహుడి కాలంలో (1152–73) హంపీ విరూపాక్షుడి మీద పంపశతక అన్న రచన చేశాడు.

**తెలుగు:** ప్రాచీన కాలంలో కాళహస్తి, శ్రీశైలం, దాక్షారామం అనే మూడు శైవాలయాల మధ్య ఉన్న ప్రాంతాన్ని త్రిలింగదేశం అని పిలిచేవారు. అది తెలింగ గా, తెలుగుగా రూపాంతరం చెందింది. తేనె నుండి తెనుగు అన్న పదం వచ్చిందని, అది తెలుగుగా మారిందని, ఈ భాష తీయనైనది కనుకనే ఆ పేరు వచ్చిందని కూడా చెప్తారు.

**"12వ శతాబ్దం నుంచీ తెలుగు సాహిత్యం మీద వీర శైవం ప్రభావం బలంగా కనిపిస్తుంది. నన్నెచోడుడు (కుమార సంభవం), పాల్కురికి సోమనాథుడు (పండితారాధ్య చరిత్ర) వంటి కవులు 12,13 శతాబ్దాలలో పేరు పొందినవారు. సోమనాథుడు కాకతీయుల ఆస్థానంలో ఉండేవాడు. రంగనాథుడి ప్రసిద్ధ రచన ద్విపద రామాయణం కాకతీయుల కాలం నాటిదే."**

తెలుగు, కన్నడ పక్క పక్కనే పెంపొందాయి. తొలినాటి తెలుగు శాసనాలు 6వ శతాబ్దం నాటివి లభిస్తున్నాయి. వాటిలోని భాషకు, నేటి భాషకు పోలిక చాలా తక్కువ. రాజరాజనరేంద్రుడి కాలంలో(1019–61) నన్నయ్య మహాభారతాన్ని తెలుగులో అనువాదం చేయడానికి పూనుకుని రెండున్నర అధ్యాయాలను మాత్రమే అనువదించ గలిగాడు. తిక్కన (1220–1300) నెల్లూరు రాజు మనుమసిద్ధి ఆస్థానంలో కవి. నన్నయ్య వదిలిపెట్టిన మహాభారత అనువాదాన్ని (అరణ్యపర్వం మినహా) పూర్తి చేశాడు. నన్నయ్య వాడిన భాషలో సంస్కృతం పాలు చాలా ఎక్కువగా ఉంటే తిక్కన వాడిన భాషలో తెలుగు నుడికారం బలంగా కనిపిస్తుంది. అరణ్య పర్వాన్ని ఎర్రాప్రగ్గడ (1280– 1350) పూర్తి చేశాడు. నన్నయ్య, తిక్కన, ఎర్రాప్రగ్గడ– ఈ ముగ్గురినీ కవిత్రయం అంటారు.

12వ శతాబ్దం నుంచీ తెలుగు సాహిత్యం మీద వీర శైవం ప్రభావం బలంగా కనిపిస్తుంది. నన్నెచోడుడు (కుమార సంభవం), పాల్కురికి సోమనాథుడు (పండితారాధ్య చరిత్ర) వంటి కవులు 12,13 శతాబ్దాలలో పేరు పొందినవారు. సోమనాథుడు కాకతీయుల ఆస్థానంలో ఉండేవాడు. రంగనాథుడి ప్రసిద్ధ రచన ద్విపద రామాయణం కాకతీయుల కాలం నాటిదే. దశకుమార చరిత్ర రచించిన కేతన, సుమతీశతకం రచించినట్టు చెప్పబడుతున్న బద్దెన కూడా ఈ కాలం వారే.

**మలయాళం:** స్వతంత్రంగా పెంపొందిన భాష అయినా, తమిళం, సంస్కృతం భాషల ప్రభావం ఎక్కువగా పడింది. వట్టిలెట్టు అనేది ఈ భాష ప్రాచీన లిపి. ఆ లిపిలో సంస్కృత, తమిళ పదాలను రాయడానికి సాధ్యం కాలేదని దానిని వదిలిపెట్టి తమిళానికి దగ్గరగా ఉండే కొత్త లిపిని ఉపయోగిచడం మొదలుపెట్టారు. మలయాళంలో ప్రాచీన రచనలు ఎక్కువగా జానపద రచనలు. వీటిని పలైయపట్టు అంటారు. కైటిల్యుడి అర్థశాస్త్రానికి మలయాళంలో వ్యాఖ్యానాన్ని భాస్కరకౌటిల్య అన్న పేరుతో 12–13 శతాబ్దాల కాలంలోనే రచించారు. కేరళలలో చక్కియార్‌కుట్టు అనే నృత్య నాటక కళారూపం ప్రసిద్ధం. ఆ రూపంలో ప్రదర్శించడానికి వీలుగా నాగానందం, ఆచార్య–చూడామణి వంటి రచనలు ఈ కాలంలో వచ్చాయి. అవి ప్రసిద్ధ రచనలు.

## మత వ్యవస్థ

బ్రాహ్మణ మతం ప్రధానంగా ఉన్న మతం. దానితోబాటు బౌద్ధం, జైనం కూడా ఆదరణ పొందాయి. భక్తి ఉద్యమం నుండి తలెత్తిన శైవ, వైష్ణవ సాంప్రదాయాలు దక్షిణ భారతంలో మత వాతావరణం మీద బలమైన ప్రభావాన్ని చూపాయి. భిన్న మతాల మధ్య, శైవ, వైష్ణవ సాంప్రదాయాల మధ్య తీవ్ర స్థాయిలో వాదోపవాదలు చెలరేగాయి. పరస్పరం యుద్ధాల్లో మునిగితేలిన రాజులు ఈ విభేదాలను వాడుకున్నారు. శైవం నుండి వీర శైవం వచ్చింది. బిజ్జలుడు అనే రాజు వద్ద మంత్రిగా పని చేసిన బసవన్న (12వ శతాబ్దం) బ్రాహ్మణాధిపత్యాన్ని సవాలు చేస్తూ వీర శైవాన్ని ప్రచారం చేశాడు. దానిని అనుసరించేవారినే లింగాయత్‌లు అంటారు. దీనితోబాటు తెలుగునాట ఆరాధ్యశైవం వచ్చింది. వారిని లింగధారులు అని కూడా అంటారు.

బౌద్ధం ప్రభావం బాగా తగ్గింది. దానితో పోల్చితే జైనం ఎక్కువ ప్రభావం కలిగివుండేది. వర్తక తరగతులు దీనిని ఎక్కువగా ఆదరించారు. తక్కిన భారతదేశం అంతా అంతరించిపోయినా, అజివిక మతం దక్షిణాన ఈ కాలంలో ఇంకా కొనసాగింది. విధిని ఎవరూ మార్చలేరని, ఈ ప్రపంచంలో కనిపించే మార్పులన్నీ భ్రమలేనని, వాస్తవానికి ఈ ప్రపంచం అనంతంగా మార్పు లేకుండా నిశ్చలంగా కొనసాగుతుందని అజివికులు విశ్వసిస్తారు.

ఇస్లాం మతం ఉత్తరాదిలో ప్రవేశించక మునుపే దక్షిణాదిలో అడుగుపెట్టింది. 7వ శతాబ్దంలో మలబార్ తీర ప్రాంతానికి వ్యాపార రీత్యా వచ్చిన ముస్లిం వ్యాపారులు క్రమంగా స్థానికులతో వివాహ సంబంధాలు ఏర్పరచుకున్నారు. వారి సంతానాన్నే మోప్లాలు అంటారు. చేర, హొయసల రాజులు ఇస్లాం మత వ్యాప్తి కి సహకరించారు. 3వ బల్లాలుడి సైన్యంలో 20,000 మంది ముస్లిం సైనికులు ఉండేవారు.

క్రైస్తవ మతం ఒకటవ శతాబ్దంలోనే దక్షిణాదిలో సెయింట్ థామస్ ద్వారా ప్రవేశించినట్టు చెప్తారు. 6వ శతాబ్దం నాటికే పలు చర్చిలు వచ్చాయి. సెయింట్ థామస్ మౌంట్ వద్ద ఉన్న చర్చికి హిందువులు, ముస్లింలు కూడా క్రైస్తవులతోబాటు పెద్ద సంఖ్యలో వెళ్ళేవారని మార్కోపోలో తన డైరీలో నమోదు చేశాడు(1293).

## నిర్మాణ కళ

చోళుల కాలంలో పలు దేవాలయాలు నిర్మించారు. ఆనాటి శిల్పుల నిర్మాణ కౌశలం వాటిలో కనిపిస్తుంది. తంజావూరు లోని బృహదీశ్వరాలయం అన్ని దేవాలయలలోకీ పెద్దదిగా ప్రసిద్ధి చెందింది. రాజేంద్రచోళుడి హయాంలో గంగైకొండచోళపురంలో నిర్మించిన శివాలయం, పాండ్యుల కాలంలో శ్రీరంగంలో, చిదంబరంలో నిర్మించిన ఆలయాలు ప్రసిద్ధి చెందినవి.

హొయసలుల హయాంలో హాలేబీడులో నిర్మించిన హొయసలేశ్వ రాలయం పేరు పొందింది. ప్రసిద్ధ జైన క్షేత్రం శ్రావణ బెళగొళ వద్ద నిర్మించిన గోమతేశ్వరుని ఏక శిలావిగ్రహం. ఇది 57 అడుగుల ఎత్తులో ఒకే రాతినుంచి నిర్మించారు. దానికి దగ్గర లోనే చాముండరాయ బసది అనే మరొక జైన క్షేత్రం కూడా ఉంది. కళింగ రాజులు నిర్మించిన దేవాలయాలు ప్రఖ్యాతి పొందాయి. ఒక్క భువనేశ్వర్‌లోనే 30 కి పైగా దేవాలయాలు ఉన్నాయి. లింగరాజ దేవా లయం, పూరీలోని జగన్నాథ దేవా లయం(1100), కోణార్క్‌లో నరసింహదేవుడి పాలనాకాలంలో (1238–63) నిర్మించిన సూర్యదేవాలయం చాలా ప్రసిద్ధి పొందాయి. (చూ. చిత్రం కోణార్క్ లోని సూర్య దేవాలయం) *

**అభివృద్ధి సమస్య**

# చైనా - భారత్ అభివృద్ధిలో అసమానతలు ఎందుకు?

**వి రాంభూపాల్**



రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్ర ప్రదేశ్ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు

మన స్వాతంత్ర్యానికి 80 ఏళ్ళ వయసు వచ్చింది. కోటి ఆశలతో, అసమాన త్యాగాలతో బ్రిటీష్ వారిని తరిమేసి స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నాము. మనలాగే చైనా కూడా 1949 వరకు జపాన్‌తో సహా అయిదు సామ్రాజ్యవాద దేశాల ఆధిపత్యం క్రింద నలిగిపోయింది. నల్లమందు బానిసలుగా హేళనకు గురైన చైనీయులు వీరోచిత పోరాటం చేసి స్వతంత్రులయ్యారు. సుదీర్ఘకాలం పరాయి పాలన కింద నలిగిపోయిన భారత్, చైనాలు పొరుగుదేశాలు కావడంతో, విముక్తి తర్వాత సాధించిన అభివృద్ధిని పోల్చి పరిశీలించడం సహజం. ప్రపంచ జనాభాలో ఈ రెండు దేశాల్లోనే 35 శాతం పైగా ప్రజలు ఉన్నారు. ప్రపంచ అభివృద్ధిలో ఈ దేశాల సహజ వనరులతో పాటు మానవవనరులు కీలకపాత్ర పోషిస్తాయి. సామ్రాజ్యవాద వ్యతిరేక వార సత్వాన్ని కొనసాగిస్తూ, జాతీయోద్యమ స్ఫూర్తికి అనుగుణంగా చైనా అనేక రంగాల్లో అగ్రరాజ్యం అమెరికాను సవాలు చేస్తూ వేగంగా అభివృద్ధి చెందుతోంది. చాలా కాలంగా అలీనవిదేశాంగ విధానాన్ని అనుసరిస్తూ సామ్రాజ్యవాదాన్ని ప్రశ్నిస్తూ, తృతీయ ప్రపంచ దేశాలకు మద్దతుగా నిలచిన మన దేశం క్రమంగా అమెరికా, యూరప్ సామ్రాజ్యవాద దేశాల ఒత్తిళ్లకు లొంగిపోయి దేశ ప్రజలకు నష్టమైన వాణిజ్య, వ్యవసాయ ఒప్పందాలను చేసుకునే స్థితికి చేరింది. కొద్దిమంది సంపన్నుల వద్ద సంపద భారీగా పోగవుతుంటే, కోట్లమంది పేదలు పేదరికంలోనే జీవిస్తున్నారు. ఈ భిన్నమైన స్థితికి ఈ రెండు దేశాలు చేరడానికి విద్యా, పేదరిక నిర్మూలన, పరిశోధన రంగాల్లో అనుసరించిన విధానాల్లో వుందని నేపాల్‌కు చెందిన రాజకీయ అర్థశాస్త్ర ప్రొఫెసర్ భీమ్ భుర్టెల్ లోతుగా విశ్లేషించారు. 'చైనా అభివృద్ధి వెదురు లాగా వుంటే, భారతదేశ అభివృద్ధి యూకలిప్టస్ లాగా వుంది; వెదురు పైకి ఎదిగేముందు చాలా బలమైన వేర్లను భూమిలోకి దించితే, యూక లిప్టస్ తగినంత వేర్ల బలం లేకుండానే పైకి ఎదుగుతుంది' అన్నారు.

**విద్య**

1947లో మన దేశ జనాభా 34 కోట్లు కాగా, అక్షరాస్యత 12 శాతం. 1949లో చైనా విముక్తి అయ్యేనాటికి ఆ దేశ జనాభా 54 కోట్లు. అక్షరాస్యత సుమారు 20 శాతంగా వుంది. ప్రస్తుతం మన దేశ అక్షరాస్యత 76 నుండి 77 శాతం మధ్య వుండగా, చైనా 96.8 నుండి 97.1 శాతానికి చేరింది. అక్కడి పాఠశాలలు స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తికి అనుగుణంగా రాజ్యానికి విధేయులైన క్రమశిక్షణ గల పౌరులను తయారు చేయడంపై దృష్టి పెట్టాయి. ఇక్కడ నేర్చుకున్న విద్య శ్రామిక నైపుణ్యాన్ని, సమిష్టితత్వాన్ని నేర్పుతుంది. ప్రభుత్వం ఒక పెద్ద ప్రాజెక్టును గానీ, విధానాన్ని గానీ ప్రారంభించినప్పుడల్లా అనేక మార్గాల్లో సూచనలను తీసుకుంటూ, ఐకమత్యంతో నిర్దిష్ట గడువులోపుగా సాధించేలా చేయడం ఆ దేశ అభివృద్ధిలో కీలకమైంది. సార్వత్రిక విద్యా విధానాన్ని అమలు చేయడంలో మనకంటే, చాలా దేశాల కంటే ముందుండి, అక్షరాస్యత రేటును సాధించింది.

భారతదేశం దీనికి విరుద్ధమైన మార్గాన్ని ఎంచుకుంది. కొత్తగా స్వాతంత్ర్యం పొంది, నిధుల కొరతతో ఉన్నందున, అది తన పరిమిత వనరులను సార్వత్రిక ప్రాథమిక విద్యలో కాకుండా, ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్‌సి వంటి కొన్ని అద్భుతమైన సంస్థలలో వెచ్చించిందని ప్రొఫెసర్ భీమ్ భుర్టెల్ వాదన. దేశాభివృద్ధికి అవసరమైన శాశ్వత మార్గాన్ని కనుగొనలేదనేది ఈయన వాదన. ప్రాథమిక ఉచిత విద్య, సార్వత్రిక విద్యను మన దేశం కూడా అమలు చేసినా అవి పని నైపుణ్యానికి, సమిష్టితత్వానికి దోహదపడే దీర్ఘకాల లక్ష్యంలో భాగంగా కాకుండా సంక్షేమ పథకాలుగా చూశాము.

**పేదరిక నిర్మూలన, పిల్లల పోషణ మధ్య పరస్పర సంబంధం**

విద్యను కేవలం తరగతి గది విషయంగా కాకుండా, ఆరోగ్యం, పేదరిక నిర్మూలనతో విడదీయరానిదిగా చైనా పరిగణించింది. అత్యంత దూరదృష్టితో అమలు చేసిన ఈ చర్య ఆ దేశాభివృద్ధికి బలమైన పునాదులను వేసింది. పాఠ్యప్రణాళిక ఎంత బాగున్నా, ఆకలితో ఉన్న పిల్లవాడు బీజగణితం, జ్యామితీని సరిగ్గా నేర్చుకోలేడు. కాబట్టి, తన అక్షరాస్యతా కార్యక్రమంతో పాటు, పేదరికం, పిల్లల పోషకాహార లోపానికి వ్యతిరేకంగా చైనా ప్రణాళిక బద్ధంగా కృషి చేసింది. పిల్లల శరీరానికి ఎంత ఆహారం అవసరమో, వారి మెదడుకు కూడా అంతే అవసరమైన ఆహారాన్ని అందించింది. గత 40 ఏళ్లలో దాదాపు 80 కోట్ల మందిని తీవ్ర పేదరికం నుంచి బయటకు తీసినట్లు చైనా ప్రభుత్వ నివేదలు స్పష్టం చేస్తున్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాలలో చైనా ప్రస్తుత ఆధిపత్యానికి ఇది ప్రధాన్యాత కలిగిన అంశంగా ప్రొఫెసర్ భీమ్ భుర్టెల్ అభిప్రాయపడ్డారు.

దీనికి విరుద్ధంగా, భారతదేశం సాంప్ర దాయకంగా విద్య, పోషణ, ప్రజారోగ్యాన్ని వేర్వేరు రంగాలుగా ఉంచింది. వేర్వేరు మంత్రిత్వ శాఖల పర్యవేక్షణలో ఉంచి, వీటి మధ్య సరైన సమన్వయం లేని విధానాన్ని అమలు చేసింది. పిల్లలను పాఠశాలకు ఆకర్షించి, వారు అక్కడ ఉన్నప్పుడు వారికి ఆహారం అందించడమే మధ్యాహ్న భోజన పథకం లక్ష్యంగా వుంది. ఈ పథకం పిల్లలకు సరిపడ పౌష్టికాహారాన్ని, ఆరోగ్యాన్ని అందించలేకపోయింది. పేదరికం,

**❝ మన దేశ వార్షిక విద్యా స్థితి నివేదిక ప్రకారం, ప్రాథమిక, మాధ్య మిక పాఠశాలల్లో సగానికి పైగా పిల్లలు తమ ప్రస్తుత తరగతి కంటే రెండు లేదా మూడు తరగతులు వెనకబడివున్నారు. ఇందుకు ఆకలి ముఖ్య కారణం కాదని చెప్పలేము. పిల్లల్లో పోషకాహార లోపానికి సంబంధించిన ప్రభుత్వ లెక్కలు మన విధాన వైఫల్యాన్ని స్పష్టం చేస్తున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (2019-21) ప్రకారం, ఐదేళ్లలోపు భారతీయ పిల్లలలో 35.5% మంది ఎదుగు దల లోపంతో, 32.1% మంది తక్కువ బరువుతో ఉన్నారు. ❞**

ప్రభుత్వ ఉదాసీనత రెండింటి ఫలితంగా ఏర్పడిన పోషకాహార లోపం, అనేక తరాల భారతీయ పిల్లలపై తీవ్రమైన ప్రభావాన్ని కలిగించింది. ఈ ఛాయలు తరగతి గదులలో కనిపిస్తున్నాయి.

మన దేశ వార్షిక విద్యా స్థితి నివేదిక ప్రకారం, ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో సగానికి పైగా పిల్లలు తమ ప్రస్తుత తరగతి కంటే రెండు లేదా మూడు తరగతులు వెనకబడివున్నారు. ఇందుకు ఆకలి ముఖ్య కారణం కాదని చెప్పలేము. పిల్లల్లో పోషకాహార లోపానికి సంబంధించిన ప్రభుత్వ లెక్కలు మన విధాన వైఫల్యాన్ని స్పష్టం చేస్తున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (2019-21) ప్రకారం, ఐదేళ్లలోపు భారతీయ పిల్లలలో 35.5% మంది ఎదుగుదల లోపంతో, 19.3% మంది బక్కచిక్కిపోయి, 32.1% మంది తక్కువ బరువుతో ఉన్నారు. 2025 గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ప్రకారం, 123 దేశాలలో భారతదేశం 25.8 స్కోరుతో 102వ స్థానంలో ఉంది. దాదాపు మూడింట ఒక వంతు మంది పిల్లలు ఆకలితో అలమటించే దేశం, ఆ సమస్యను నిర్మూలించిన దేశంతో పోటీపడలాంటే ఈ సమస్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి.

### చైనా పారిశ్రామిక డిమాండ్, భారత మేధో వలస

ఒక విశ్వవిద్యాలయ వ్యవస్థ దాని పట్టభద్రులకు సరైన ఉద్యోగాలు కలిపించినప్పుడే మనుగడ సాగిస్తుంది. చైనా అది జరిగేలా చూసుకుంది. 1990వ దశకంలో, అది ప్రాజెక్ట్ 211, ప్రాజెక్ట్ 985 లను ప్రారంభించి, ఎంపిక చేసిన విశ్వవిద్యాలయాలను పరిశోధనా కేంద్రాలుగా మార్చడానికి వాటిపై బిలియన్ల డాలర్లను కుమ్మరించిందని ప్రొఫెసర్ భీమ్ భుర్టెల్ ఆధారాలతో వివరించారు. చదువు పూర్తయి బయటకు వచ్చిన వారికి ఉపాధి కల్పించడానికి కర్మాగారాలు, ప్రయోగశాలలు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను నిర్మించింది. విదేశాలలో చదువుకున్న చైనీస్ విద్యార్థులు అమెరికా లేదా యూరప్‌లో స్థిరపడకుండా, స్వదేశానికి తిరిగి రావడానికి అవసరమైన ఏర్పాటు చేశారు. దీని ఫలితంగా టెన్సెంట్, అలీబాబా, హువావే, బైట్‌డాన్స్, షియోమి వంటి అనేక అంతర్జాతీయ కంపెనీలు స్వదేశీంలో పుట్టుకొచ్చాయి. ఇవి చైనాను ప్రపంచ కర్మాగారంగా, రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చాయి.

భారతదేశంలో అంతర్జాతీయ స్థాయికి పోల్చదగిన పరిశోధనా వ్యవస్థ ఏదీ నిర్మించబడలేదు. భారతదేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన సాంకేతిక కార్యక్రమాలు, భారతదేశం, చిన్న, మధ్య తరహా వ్యాపారాల కోసం కాకుండా, ప్రధానంగా పాశ్చాత్య కార్మిక మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడ్డాయి. అందువల్ల తమ అత్యుత్తమ విద్యార్థులు దేశం విడిచి వెళ్లకుండా చూసుకోగల ఉత్పాదక రంగాన్ని నిర్మించడంలో విఫలమయ్యాయి. అందువల్ల, ఐఐటీలు, ఐఐఎంల వంటి సంస్థలలో భారీ ప్రజాధనంతో శిక్షణ పొందిన భారతదేశంలోని అత్యుత్తమ మేధావులందరూ అమెరికా, ఐరోపా వంటి విదేశాలకు వెళ్లిపోయారు. గూగుల్ సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సత్య నాదెళ్ల, అడోబ్ శాంతన్ నారాయణ్ వంటి ఎందరో భారతీయ పూర్వ విద్యార్థులు ఫార్చ్యూన్ 500 కంపెనీలకు సీఈఓలుగా ఉండడం అందుకు ఉదాహరణ. దీనికి మనం గర్వపడవచ్చు కానీ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడిచినా, భారతదేశంలో ప్రధాన కార్యాలయాలు కలిగి, కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఫార్చ్యూన్ 500 కంపెనీలలో కేవలం 11 మాత్రమే ఉన్నాయి (వాటిలో సగానికి పైగా ప్రభుత్వ రంగ సంస్థలే). అదే సమయంలో చైనాలో ఇలాంటి కంపెనీలు 124 ఉన్నాయి. భారతదేశపు నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి విదేశీ బహుళజాతి సంస్థలను ధనవంతులను చేసింది కానీ భారతదేశాన్ని కాదు

మారిన పరిస్థితులకు అనుగుణంగా విధానాలను సంస్కరించుకోవడం తప్పు కాదు, అవసరం కూడా. అయితే వాటి లక్ష్యం ఏమిట నేదే చాల ముఖ్యం. దేశ ప్రజలు, దేశాభివృద్ధి లక్ష్యంగా చైనా ప్రారంభించిన సంస్కరణలు ఆ దేశాన్ని అగ్రరాజ్యంతో పోటీ పడేలా చేసాయి. కొద్దిమంది పారిశ్రామికవేత్తల, వ్యాపారుల, సంపన్నుల ఒత్తిళ్ళతో వారి ప్రయోజనాలకు పెద్ద పీటవేసి అమలు చేసిన మన సంస్కరణలు దేశాన్ని అప్పుల ఊబిలోకి దించాయి. చైనా విశ్వవిద్యాలయాలు ఇప్పుడు నేచర్ ఇండెక్స్‌లో అగ్రస్థానంలో ఉన్నాయి. అవి మరెక్కడా లేనంతగా ఎక్కువ మంది ఇంజనీర్లను తయారు చేస్తున్నాయి. ఎక్కువ పేటెంట్లను దాఖలు చేస్తున్నాయి. తయారీ రంగంలోనూ, సరఫరా గొలుసులలోనూ చైనా పరిశ్రమలు అగ్రస్థానంలో ఉన్నాయి. ఈ పురోగతులన్నీ కేవలం పారిశ్రామిక విధానం నుండి మాత్రమే కాకుండా, ప్రాథమిక పాఠశాలలు, పిల్లల పోషణ గురించి తీసుకున్న నిర్ణయాల నుండి ఉద్భవించాయి.

మరోవైపు, భారతదేశం తన సొంత విద్యార్థుల ప్రాథమిక విద్య, పోషణను నిర్లక్ష్యం చేస్తూ ప్రపంచ మార్కెట్ కోసం అద్భుతమైన మేనేజర్లు, ఇంజనీర్లు, బ్యాంకర్లను తయారు చేసింది. దీని ప్రభావం ఉత్పాదకత, పారిశ్రామిక సామర్థ్యంలో ప్రతిఫలిస్తోంది. 2020 జాతీయ విద్యా విధానం, వృత్తి శిక్షణ, పిల్లల సంరక్షణ, నైపుణ్య ఆధారిత విద్యా బోధన వంటి వాటి గురించి ప్రకటించింది. ఇటువంటి విధానాలను ప్రకటించడం సులభం, కానీ వాటి అమలుకు నిధులు సమకూర్చకుండా సాధించడం కష్టం. మన దేశంలో విద్యకు అధికభాగం రాష్ట్రప్రభుత్వాలు ఖర్చు చేయాల్సి వుంటుంది. ప్రస్తుతం అత్యధిక రాష్ట్రాలు తీవ్రమైన అప్పుల్లో వున్నాయి. మంచి పోషణ, టీకాలు, సరైన ఆరోగ్య సంరక్షణ అనేవి నాణ్యమైన పాఠ్యప్రణాళికలు, పాఠ్యపుస్తకాలతో మిళితమై ఉంటాయి. మన దేశంలోని అత్యంత విలువైన మానవవనరులు ఆరోగ్యంగా, విద్యావంతులుగా మారేంత వరకు, వృద్ధి అనేది వాస్తవం కంటే వాగ్దానంగానే మిగిలిపోతుంది.

'భారతదేశపు బలం దాని భవనాల ఎత్తులో కాదు, దాని లోతులో ఉంది. చైనా తన సహనాన్ని శక్తిగా మార్చుకోవడానికి 30 ఏళ్లు తీసుకుంది. భారతదేశం, ఇప్పటి స్థితిలో, ఇంకా లోతుగా తవ్వడానికి పోరాడు తూనే ఉంది' అని భీమ్ భుర్టెల్ అభిప్రాయపడ్డారు. *

# ఒక కొత్త, డిజిటల్ తరం ప్రజా క్షేత్రాన్ని చేజిక్కించుకుంది

ప్రబీర్ పుర్కాయస్థ



రచయిత న్యూస్ క్లిక్ వెబ్ పోర్టల్ వ్యవస్థాపకులు, సైన్సు అభివృద్ధిపై అనేక వ్యాసాలు, పుస్తకాలు రాశారు

ఈ ఏడాది మే 15న నిరుద్యోగ యువతపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ చేసిన దురదృష్టకర వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) ఒక వ్యంగ్యాత్మక స్పందనగా మొదలై ఉండవచ్చు. కానీ కొద్ది నెలల్లోనే, ఇది మనం అంతకు ముందు ఊహించని విధంగా దేశ రాజకీయ రంగాన్ని మార్చివేసింది. ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలకు మరుసటి రోజే అభిజిత్ దీప్కే "కరస్పాండెంట్లంతా (బొద్దింకలంతా) ఒక్కటైతే ఎలా ఉంటుంది?" అని ఇచ్చిన చురుకైన సమాధానానికి భారీ స్పందన వచ్చింది. ఆ తర్వాత, ఈ వ్యంగ్యాత్మక "కాక్రోచ్ జనతా పార్టీ"లో చేరాలనుకునే వారి కోసం దీప్కే ఒక ఫారాన్ని అందుబాటులోకి తెచ్చారు. దాంతో మొదటి 24 గంటల్లోనే 50,000 మంది సంతకాలు చేయగా, కొద్ది రోజుల్లోనే అది లక్షలాది మందికి చేరుకుంది!

ఢిల్లీలో నిరసనలు తెలిపేందుకు మిగిలి ఉన్న కొన్ని ప్రదేశాలలో జంతర్ మంతర్ ఒకటి. ప్రారంభంలో సిజెపి చేపట్టిన నిరాహార దీక్ష/ధర్నాలో పాల్గొనడానికి జంతర్ మంతర్‌కు వచ్చిన వారి సంఖ్య తక్కువే అయినప్పటికీ, క్రమంగా జన సమీకరణ పెరిగింది. జులై 20న సిజెపి, ఇతర విద్యార్థి సంఘాలు 'పార్లమెంట్ మార్చ్'కు పిలుపునిచ్చాయి. దీనికి పోలీసులు లాఠీఛార్జ్, బాష్పవాయువు, పెల్లెట్ తుపాకుల వాడకంతో సహా శాంతియుత నిరసనకారులపై మితిమీరిన హింసతో విరుచుకుపడ్డారు.

జంతర్ మంతర్ పరిసరాల్లో ఇంటర్నెట్‌ను నిలిపివేయడం, ఆ ప్రాంతానికి మెట్రో సేవలను పునరుద్ధరించకపోవడం ద్వారా నిరసనకారులను ఒంటరిపాటు చేయవచ్చని పోలీసులు భావించారు. కానీ మనకు తెలిసినట్లుగా, సోషల్ మీడియా పోస్టులతో ఇంటర్నెట్ నిండిపోవడంతో ఆ వ్యూహం ఘోరంగా తిరగబడింది. నేమ్‌ప్లేట్లు కూడా లేని పోలీసులు, విద్యార్థులపై-చిన్నపిల్లలైన అబ్బాయిలు, అమ్మాయిలపై-జరిపిన హింసను ఈ పోస్టులు మన ముందుకు తెచ్చాయి. పోలీసులతో పాటు సాదా దుస్తుల్లో ఉన్న పోలీసులు లేదా పోలీసులతో కలిసి పనిచేసే గూండాలు కూడా చేరారు. ఎటువంటి రెచ్చగొట్టుడు లేకుండా ఒక సీనియర్ పోలీస్ అధికారి ఒక యువతిపై దాడి చేయడం కూడా మనం చూశాం. ఈ ఉద్యమం ఇకపై జంతర్ మంతర్, దాని పరిసరాలకే పరిమితం కాకుండా, ఇంటర్నెట్ డిజిటల్ వేదికపై ప్రత్యక్షంగా (రియల్ టైమ్‌లో) సాగింది.

భారత ప్రజాస్వామ్యంలో విద్యార్థులు, యువతను అధిక బలప్రయోగంతో/హింసతో పోలీసులు చెదరగొట్టడం కొత్తేమీ కాదు. కొన్నిసార్లు అది పనిచేస్తుంది, కొన్నిసార్లు విఫలమవుతుంది. కానీ ఈసారి అది కేవలం విఫలం కావడం మాత్రమే కాదు, ఘోరంగా విఫలమైంది. ఇందుకు ప్రతిగా జంతర్ మంతర్‌కు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడమే కాకుండా, దేశంలోని వివిధ ప్రాంతాలలో నిరసనలకు దారితీసింది. ఆ వెనువెంటనే బీహార్, యుపి, ముంబై, కోల్‌కతా నుండి విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరుతూ ఇంటర్నెట్‌లో దృశ్యాలు వెల్లువెత్తాయి. ఇది కేవలం ఢిల్లీలోని కొద్దిమంది విద్యార్థుల డిమాండ్ మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా ఉన్న యువత డిమాండ్‌గా మారింది. మోడీ ప్రభుత్వం ప్రజా రంగంపై తన పట్టును పూర్తిగా కోల్పోయింది.

చాలా సందర్భాలలో వార్తాపత్రికలు, టీవీ వార్తల్లోని ప్రధాన వార్తలను ప్రభుత్వం, పెద్ద వ్యాపార సంస్థలు "నియంత్రించగలవు". స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వార్తా పత్రికలను "జ్యూట్ ప్రెస్" (జనపనార ప్రెస్) అని ఎలా పిలిచేవారో మనకు ఇంకా గుర్తుంది. ఎందుకంటే ప్రధాన వార్తా సంస్థలను బిర్లాలు, దాల్మియాలు, సాహు జైన్లు తదితరుల వంటి జనపనార పరిశ్రమల వ్యాపారవేత్తలు స్థాపించారు. ముఖ్యంగా కార్మికుల సమ్మె వార్తలను వారు సమర్థవంతంగా నియంత్రించారు. రేడియో ప్రభుత్వం ఆధీనంలో ఉండటంతో, భారతదేశంలో రేడియో ఇతర మాధ్యమాల వలే వ్యాపారీకరించబడలేదు.

60, 70ల నాటి రోజులను గుర్తుచేసుకుంటే, రేడియో సిలోన్ హిందీ సినిమా పాటలను ప్రసారం చేయడం ద్వారా భారీ ఆదరణ పొంది ప్రకటనల ద్వారా ఆదాయాన్ని రాబట్టుకుంది. ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని, 80లు, 90లలో "ఉదారీకరణ" విస్తరించడంతో టీవీ చాలా త్వరగానే వ్యాపారీకరించబడింది.

ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ ఈ కథనాన్ని నియంత్రించగలిగారు. అయితే ఈసారి ఏమి మారింది? మొదటిది, అన్ని పరీక్షలను కేంద్ర ప్రభుత్వం తన నియంత్రణలోకి తెచ్చుకోవడం, తద్వారా విద్యా వ్యవస్థ వైఫల్యానికి కారణమవ్వడంపై పెరుగుతున్న అసంతృప్తి. రెండవది, నీట్ పరీక్షా పత్రాలు మాత్రమే కాకుండా, మరెన్నో ఇతర పరీక్షా పత్రాలు లీక్ కావడం. గత 10 సంవత్సరాలలో నీట్, ఐఐటి - జేఈఈ, వివిధ రాష్ట్ర నియామక బోర్డులతో సహా దాదాపు 150

> **❝ ఈసారి నిరసనల్లో ఉన్న ప్రత్యేకత ఏంటంటే-ఈ తరం విద్యార్థులు మునుపటి తరాల వలే కాకుండా, ప్రత్యక్షంగానే కాకుండా డిజిటల్ రంగంలో కూడా ప్రజలను ఎలా సమీకరించాలో బాగా తెలుసుకున్నారు. ప్రభుత్వం యువతకు, విద్యార్థులకు నిరంతరం నీతులు చెబుతూ, తన సొంత వైఫల్యాలకు మాత్రం ఎలాంటి బాధ్యత తీసుకోకపోవడం పట్ల వారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ❞**

పత్రాలు లీక్ అయ్యాయని అంచనాలు చెబుతున్నాయి. బాధ్యతారాహిత్యం దీనిని మరింత తీవ్రం చేసింది. ఎవరిపై చర్యలు తీసుకోకపోవడమే కాకుండా, ఒక కేంద్ర మంత్రి ఏకంగా లీకేజీలు విద్యార్థులకు సిద్ధం కావడానికి మరింత సమయం ఇచ్చాయని, తద్వారా వారికి మేలు జరిగిందని వ్యాఖ్యానించారు. పోటీ పరీక్ష అంటే ఏమిటో, దానికోసం విద్యార్థులు, వారి కుటుంబాలు వెచ్చించే సమయం, డబ్బు, శ్రమ గురించి ఆమెకు ఎలాంటి అవగాహన లేదని ఆమె వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

ఈసారి నిరసనల్లో ఉన్న ప్రత్యేకత ఏంటంటే-ఈ తరం విద్యార్థులు మునుపటి తరాల వలే కాకుండా, ప్రత్యక్షంగానే కాకుండా డిజిటల్ రంగంలో కూడా ప్రజలను ఎలా సమీకరించాలో బాగా తెలుసుకున్నారు. ప్రభుత్వం యువతకు, విద్యార్థులకు నిరంతరం నీతులు చెబుతూ, తన సొంత వైఫల్యాలకు మాత్రం ఎలాంటి బాధ్యత తీసుకోకపోవడం పట్ల వారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

జెన్ జి తరం మిలియనియల్స్ తర్వాత వచ్చిన తరం. మొదటి డిజిటల్ తరం. మన తరం 'బూమర్స్' (రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత తరం) కంటే, లేదా మన తరువాతి తరం 'మిలీనియల్స్' కంటే వీరు భిన్నమైనవారు. బూమర్లు వార్తలకు పత్రికలపై ఆధారపడ్డారు. మిలీనియల్స్ టెలివిజన్‌కు మారారు: రాత్రి 9 గంటల ప్రసారంలో ప్రధాన ఛానెళ్ల ప్రసారం చేసేదే వార్తగా ఉండేది. మరుసటి రోజు ఉదయం వార్తా పత్రికలు టీవీ దారినే అనుసరించేవి. బూమర్లయిన మాకు, రోజువారీ వార్తలు ప్రముఖ పత్రికల మొదటి పేజీ హెడ్‌లైన్స్‌తో ప్రారంభమయ్యేవి. భారతదేశంలో రేడియోను ప్రధానంగా ప్రభుత్వ స్వరంగా భావించినందున, ప్రపంచంలోని ఇతర ప్రాంతాల మాదిరిగా ఇక్కడ పెద్ద పాత్ర పోషించలేదు. ఈ పరిమితి ఉన్నప్పటికీ, 60లు, 70లలో మన తల్లిదండ్రులు ప్రతి సాయంత్రం రాత్రి 9:00 గంటలకు రేడియో వార్తలను ఎంత శ్రద్ధగా వినేవారో మనకు గుర్తుంది.

ఈనాడు "ఏది వార్త" అనేదాన్ని వార్తాపత్రికలో టెలివిజనో కాదు, సోషల్ మీడియా నిర్ణయిస్తోంది. డిజిటల్ వేదికలను నియంత్రించే వారు కాకుండా, వాటిని ఉపయోగించే ప్రజల సమూహమే నిరంతరం వార్తలను నిర్ణయిస్తోంది. ప్లాట్‌ఫారమ్ నిర్ణయించినది కాదు, ఏది "వైరల్" అవుతుందో అదే వార్త అవుతుంది. ఖచ్చితంగా, ప్లాట్‌ఫారమ్‌లకు ఇంకా కొంత నియంత్రణ ఉంటుంది: ఒక వార్త వైరల్ కాకుండా కొంతవరకు తగ్గించవచ్చు లేదా పెంచవచ్చు. కానీ జెన్ జి నిరసనల సమయంలో మనం చూసినట్లుగా, ప్లాట్‌ఫారమ్‌ల ఆల్గోరిథమ్‌లు ఎలాంటి పక్షపాతం చూపించినా ప్రజల భారీ సంఖ్య దానిని అధిగమిస్తుంది. అంతిమంగా ప్లాట్‌ఫారమ్‌కు ఎంత ఎక్కువ మంది వీక్షకులు ఉంటే, ప్రకటనలు కనిపించే అవకాశం అంత ఎక్కువగా ఉంటుంది. అన్ని ఇతర మాధ్యమాల మాదిరిగానే, డిజిటల్ మీడియాకు కూడా డబ్బు ప్రధానంగా పాఠకులు లేదా చందాదారుల నుండి కాకుండా ప్రకటనదారుల నుండే వస్తుంది. అవును, ప్లాట్‌ఫారమ్‌లు ఆల్గోరిథమ్‌ను సర్దుబాటు చేయవచ్చు, కొన్ని విషయాలను ఫిల్టర్ చేయవచ్చు, కానీ ప్రత్యక్షంగా ట్వీట్ చేసే, రీల్స్ పోస్ట్ చేసే వారి సంఖ్య ఎక్కువగా ఉంటే, ప్రజలు చూసే ఫీడ్‌లను నియంత్రించడం చాలా కష్టం. ఎందుకంటే అలాంటి ఏ ఆల్గోరిథమ్‌కైనా అతిపెద్ద ప్రాధాన్యత వీక్షకుల సంఖ్యను పెంచడమే, తద్వారా వారు తమ ప్రకటనల ద్వారా వచ్చే రాబడిని పెంచుకోవచ్చు.

సిజెపి ఉద్యమం సాధించిన అతిపెద్ద విజయం, మోడీ ప్రభుత్వాన్ని తమ డిమాండ్‌ను అంగీకరించేలా ఒత్తిడి తేవడం మాత్రమేనని నేను వాదించడం లేదు. అంతకన్నా చాలా పెద్ద విజయం ఉంది-తమ తప్పులకు బాధ్యత వహించాలనే రాజకీయ సూత్రాన్ని రాజ్యం అంగీకరించేలా చేయడం. ఒక కీలకమైన అంశంలో మీ మంత్రిత్వ శాఖ విఫలమైతే, మీరు బాధ్యత వహించి రాజీనామా చేయాలి. ఒక పెద్ద రైలు ప్రమాదం జరిగినప్పుడు, రైల్వే మంత్రిగా లాల్ బహదూర్ శాస్త్రి చేసిందదే. ఎవరూ ఆయనను వ్యక్తిగతంగా బాధ్యులను చేయలేదు. కానీ మీరు ఒక నాయకుడైతే, ప్రజా నైతికతకు ఒక ప్రమాణాన్ని కూడా నిర్దేశిస్తారు. ఈ ప్రభుత్వ హయాంలో, అటువంటి అన్ని పద్ధతులు పక్కన పెట్టబడ్డాయి. వైఫల్యాలన్నింటినీ స్వతంత్ర భారతదేశానికి అత్యంత క్లిష్ట సమయం, విభజన కాలంలో నాయకత్వం వహించి, మన దేశానికి-ప్రజాస్వామ్య, లౌకిక, సమాఖ్యకు-పునాదులు వేసిన మన తొలి ప్రధాని నెహ్రూ పైనే నెట్టేస్తున్నారు.

గత కొన్ని వారాలుగా ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా వీధుల్లోకి వచ్చిన తరం, ఒక కొత్త తరాన్ని ప్రధాన రంగానికి తీసుకువచ్చింది. ప్రస్తుత వాస్తవికతను తమ సొంత అనుభవంగా అర్థం చేసుకునే ఈ తరం, అంతకంతకూ పెరుగుతున్న ప్రజలను సమీకరిస్తూ రాజ్యాన్ని ఎదుర్కొనే మొదటి పరీక్షలో నెగ్గింది. తమ వయస్సుకు మించిన పరిణతిని ప్రదర్శించింది. తీవ్రమైన రెచ్చగొట్టుడు ఉన్నప్పటికీ వారు శాంతాన్ని కోల్పోలేదు. పోలీసులు తమపైకి ఏది విసిరినా ఎదుర్కొనే ధైర్యాన్ని చూపారు. మనం రాజకీయేతర తరమని కొట్టిపారేసిన వర్గాలను కూడా వారు పెద్ద ఎత్తున ఆకర్షించారు. మనకు తెలిసిన సాంప్రదాయ రాజకీయ భాషను వారు ఉపయోగించనంత మాత్రాన వారు రాజకీయేతరులు కారు. చాలా సార్లు, అమ్మాయిలే ముందుండి పోలీస్ వాహనాలను అడ్డుకున్నారు, వారి లాఠీలను ఎదుర్కొన్నారు.

ఇక చివరిగా నేను చెప్పొచ్చేది ఏంటంటే – వాస్తవంగా ఏమి జరుగుతుందో వివరించడానికి వామపక్షాలకు ఉన్న విశ్లేషణాత్మక సామర్థ్యాలు, గతాన్ని వర్తమానంతో ఎలా అనుసంధానించాలి, మన హాస్యం-ఇవన్నీ సత్యంతో పాటు మనకున్న బలాలని ఈ పత్రిక శీర్షికలలో నేను రాశాను. ఆయా అనుభవాల ద్వారా ఇవన్నీ ఆచరణలో నిరూపితం కావాలి. జెన్‌జి కి, ఈ ఉద్యమం, వారి అనుభవం రాజకీయ శాస్త్రంపై ఎన్ని ఉపన్యాసాలు విన్నా నేర్చుకోలేనంత ఎక్కువ నేర్పింది. నా తరం తరఫున మాట్లాడితే, ఒక కొత్త తరం ఇప్పుడు బాధ్యతలను స్వీకరించిందనే తృప్తి నాకు లభించింది.

**(అనువాదం: కె. సత్యరంజన్)**

# అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంవల్ల రైతుల దివాళా

ఉత్తమం వ్యవసాయం,
మధ్యమం వాణిజ్యం,
అధమం ఉద్యోగం
అడుక్కోవడం కన్నా హీనం.

నశిన్ వర్మ



రచయిత పాత్రికేయుడు, గ్రంథ రచయిత. న్యూఢిల్లీలోని జమియా హమ్దర్ద్ యూనివర్శిటీలో బోధిస్తుంటారు. అనేక పుస్తకాలు రాశారు

ఇవి భోజ్‌పురి గ్రామాలలోని జానపద గీతాల్లో కొన్ని చరణాలు. వ్యవసాయానికి వారు అంత ఘనమైన స్థానాన్ని ఇచ్చారు. ఈ భావాలతో ప్రదర్శింపబడే జానపద కళలు పూర్వాంచల్ ప్రజలలో అత్యధిక ప్రాచుర్యం పొందాయి.

గ్రామీణ ప్రజలలో ఉన్న ఈ భావాలు పట్టణాలలో నివసిస్తున్న వారికి సరైనవని అనిపించకపోవచ్చు. కానీ వ్యవసాయంపై ఆధారపడిన అనేక తరాల ప్రజల అనుభవాలతో రూపుదిద్దుకున్న ప్రాపంచిక దృక్పథం అది. ప్రస్తుతం భారతదేశపు వ్యవసాయ మార్కెట్‌ను అమెరికా ఉత్పత్తులకు తెరవటాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలో కూడా ఇది మనకు చెబుతుంది.

సమ్మిళిత ప్రపంచం, వాణిజ్యంలో సమర్థత, మార్కెట్‌లలోకి ప్రవేశం, వినియోగదారులకు ఎంచుకొనే హక్కు తదితర మాటలతో, పై వర్గాల ప్రజల పరిభాషలో ఈ చర్చ చేస్తున్నారు. కానీ వ్యవసాయాన్ని కేవలం వృత్తిగా మాత్రమే కాకుండా జీవనమార్గంగా ఎంచుకొని, తరతరాల అనుభవంతో తమకెదురౌతున్న ఆటంకాలను అధిగమిస్తూ, తమ గౌరవాన్ని, స్వాతంత్ర్యాన్ని కాపాడుకొంటూ, బతకటం కోసం పొలాలలో పనిచేస్తున్న భారతదేశంలోని రైతుల దృక్పథం నుండి అరుదుగా మాత్రమే ఈ సమస్యను పరిశీలిస్తున్నారు.

అంతర్జాతీయ వాణిజ్య, వ్యాపారాలలో నేను అనుభవం కలిగినవాడు కాదన్నది స్పష్టమే. నా జీవితంలో గణనీయమైన కాలాన్ని వ్యవసాయరంగంలో గడిపిన వాడిగా, వ్యవసాయదారులు చెప్పే సాదక బాధకాలను శ్రద్ధగా వింటున్నవాడిగా, బీహార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రైతుల వాస్తవ జీవితాలను అధ్యయనం చేస్తూ, ప్రజల భాషలో కథలుగా చెబుతున్నవాడిగా నేను వ్యవసాయంతో అనుబంధం కలిగివున్నాను.

### ఎల్లెడలా భిన్నత్వం

భారతదేశంలో వ్యవసాయరంగాన్ని సరళీకరించటం ప్రజల జీవితాలకు సంబంధించిన అంశం. ప్రజలు ఆదాయంపై కొద్దిపాటి ఆశలు మాత్రమే పెట్టుకొని, సామాజిక సంబంధాలతో కలిసి పనిచేస్తూ, ప్రకృతితో పెనవేసుకొంటూ భావోద్వేగ పూరితమైన సంబంధాలతో కూడిన జీవితాలను గడుపుతుంటారు. కొడుకు పుడితే ఎంత అల్లారుముద్దుగా చూసుకుంటారో రైతులు తమ పొలాలను కూడా అలాగే చూసుకుంటారు. ఎడ్లు, ఆవులు, గేదెలు కేవలం బతకటానికి అవసరమైన ఆదాయాన్నిచ్చేవి మాత్రమే కాదు. కుటుంబ గౌరవం పెంచటానికి, నలుగురిలో గర్వంగా తిరగటానికి, తరతరాల సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్న చిహ్నాలుగా వాటిని చూసుకుంటారు.

పెద్దమొత్తం సబ్సిడీలు పొందుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ, భారీస్థాయిలో జరుగుతున్న అమెరికన్ తరహా కార్పొరేట్ వ్యవసాయానికి ఇది పూర్తి విరుద్ధం. చిన్న భూఖండాలలో, వాతావరణ అనిశ్చితులను ఎదుర్కొంటూ, కూలీలతో అవసరం లేకుండా కుటుంబ సభ్యుల శ్రమతో వ్యవసాయం చేసుకొంటూ, బతుకు వెళ్ళదీస్తున్న రైతుల సాంస్కృతిక వారసత్వం కొనసాగింపుగా భారతదేశ వ్యవసాయం సాగుతున్నది.

భారతదేశంలో 85 శాతం సన్న, చిన్నకారు రైతులు ఉన్నారు. వారి ఇళ్ళు, పశుసంపద, పొలాలు కుటుంబాలకు వెన్నుకాచే అక్షయ పాత్రలు. ఉద్యోగాలు కోల్పోయిన పిల్లలు, అనారోగ్యం పాలయిన వారు, పట్టణాలలో జరిగే అక్రమ వ్యాపారాలలో నష్టపోయి, తిరిగి గ్రామాలకు వచ్చిన వారికి ఇవి రక్షణ కవచాలుగా ఉన్నాయి.

ఉత్తరప్రదేశ్, బీహార్‌ల నుండి వలస వెళ్ళిన లక్షలాది మంది పేద కుటుంబాలు 2020–22 సంవత్సరాలలో కోవిడ్ మహమ్మారి విధ్వంసం సృష్టించిన సమయంలో ఢిల్లీ, పంజాబ్, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుండి వందలాది మైళ్ళ దూరం నడిచి తమ స్వంత ఇళ్ళకు చేరుకున్నారు. ఆనాడు చేసిన సుదీర్ఘ కాలినడక ప్రయాణ గుర్తులు వారి జ్ఞాపకాలలో ఇప్పటికీ తాజాగా ఉన్నాయి. తమ పిల్లలు, సామాన్లను బళ్ళలో వేసుకొని, అలసిపోయిన తమ శరీరాలను ఇళ్ళకు చేర్చారు. ఆహారం, మందులు, ఆక్సిజన్, ఇతర జాగ్రత్తలు తీసుకుంటామని నగరాలు, పట్టణాలలోని అధికారులు వాగ్దానాలు చేసినప్పటికీ, ఆ కష్టకాలంలో తమ స్వగ్రామాలలో ఉండటమే మేలని సహజంగానే వారు భావించారు.

కాబట్టి అమెరికాలో వలెనే భారతదేశంలో కూడా విస్తారమైన వ్యవసాయ భూములున్నప్పటికీ, రెండు దేశాలలోని పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయి. కోవిడ్ మహమ్మారి సమయంలో భారతదేశంలో జరిగినట్లుగా అమెరికాలో సుదూరం సామూహిక కాలినడక ప్రయాణాలు జరగలేదు. భారతదేశ రైతులు అమెరికా రైతులతో పోటీ పడలేరు. కాకపోతే భారతదేశ రైతులు ప్రకృతితో సహజీవనం చేస్తున్నట్లు, కొన్ని ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వ విధానాలతో సహజీవనం చేస్తున్నట్లు అమెరికా రైతులతో సహజీవనం చేయగలరు అంతే.

రైతులకు బలమైన రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయకుండా, అమెరికా నుండి వచ్చే వ్యవసాయోత్పత్తులకు భారతదేశ మార్కెట్‌ను తెరవటం అంటే అది పోటీ పడటం కాదు. పారిశ్రామిక పద్ధతిలో జరుగుతున్న వ్యవసాయా

> **" భారతీయ రైతు దృష్టితో చూసినపుడు, ఇప్పటికీ గ్రామీణ దారిద్ర్యం, ఆదాయ అసమానతలు, భూ కమతాలలో అసమా నతలలో మగ్గుతున్న భారతదేశం నుండి అమె రికాలోని శక్తివంతమైన కార్పొరేట్, వాణిజ్య సంస్థలు గరిష్ట లాభాలు పిండుకోవచ్చన్న ఆపేక్షే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకోవ టానికి ఉత్తే జపరిచి ఉండవచ్చు. "**

నికీ, బతకటం కోసం చేస్తున్న వ్యవసాయానికీ మధ్య అసమాన పోటి పెట్టటమే అవుతుంది. ఇటువంటి పోటీతో వ్యవసాయం చుట్టూ అల్లిన సాంస్కృతిక, నాగరిక సంబంధాలు నశించిపోవటం ప్రారంభమవుతుంది.

అమెరికాలో వ్యవసాయం ప్రభుత్వంలో పలుకుబడి కలిగిన బడా కార్పొరేషన్లు, వ్యాపార సంస్థలకు అధిక ఆదాయం, గరిష్ట లాభాలు సంపాదించటానికి సాధనంగా ఉన్నది. భారత దేశంలో వ్యవసాయం గుర్తింపు, సంస్కృతి, సామాజిక జీవనం కొనసాగటంలో భాగంగా ఉన్నది.

భారతదేశంలోని రైతుల వలె అమెరికా లోని రైతులు ఎడ్లను, ఆవులను పూజించరు. పంటలు వచ్చినపుడు నాగరికతకు గుర్తుగా ఉత్సవాలు జరుపుకోరు. వారి పశుసంపద మాంసంగా, ఉప్పుతో కలిపి ఉపయోగించుకొనే ఆహారపు ముద్దలుగా మారి, ప్రపంచ సరుకుల సరఫరా గొలుసులో భాగం అవుతుంది.

భారతీయ రైతు దృష్టితో చూసినపుడు, ఇప్పటికీ గ్రామీణ దారిద్ర్యం, ఆదాయ అసమానతలు, భూ కమతాలలో అసమాన తలలో మగ్గుతున్న భారతదేశం నుండి అమెరికాలోని శక్తివంతమైన కార్పొరేట్, వాణిజ్య సంస్థలు గరిష్ట లాభాలు పిండుకోవచ్చన్న ఆపేక్షే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకోవటానికి ఉత్తేజపరిచి ఉండవచ్చు.

అమెరికా ప్రభుత్వ సబ్సిడిలతో ఉత్పత్తి అయిన వ్యవసాయోత్పత్తులు భారతదేశ మార్కెట్లలోకి వచ్చినపుడు స్థానిక రైతులు ఉత్పత్తి చేసిన సరుకుల ధరలు పడిపోతాయి. ఒక చిన్నరైతుకు ధరలలో వచ్చే స్వల్పమైన వ్యత్యాసం కూడా తన కుమార్తెను స్కూలుకు పంపగలనా, మరొకసారి అప్పు తీసుకోవాలా లేదా అన్న అంశాలను నిర్ణయించుకోవటంలో ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తుంది. ఇటువంటి వాస్తవాలు వాణిజ్య చర్చలలో అరుదుగా మాత్రమే చోటు చేసుకుంటాయి.

**పాలిచ్చే పశువుల పెంపకాన్ని కూడా ప్రభావితం చేస్తుంది**

భారతదేశం-అమెరికా వాణిజ్య ఒప్పందం పాల ఉత్పత్తిరంగాన్ని కూడా ధ్వంసం చేస్తుంది. భారతదేశ పాల ఉత్పత్తి వికేంద్రీ కరించబడి ఉన్నది. గ్రామీణ ప్రాంతంలోని చాలా కుటుంబాలు తమ రోజువారీ జీవనం గడపటానికి పాల ఉత్పత్తిపై ఆధారపడి ఉన్నాయి. ఒకటి, రెండు గేదెలు కుటుంబానికి స్థిరమైన ఆదాయంతో పాటు వర్షాలు కురవని కాలంలో కూడా పాల ద్వారా ప్రొటీన్‌లను అందిస్తాయి. పాలు, పెరుగు అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయాన్ని మందులు కొనటానికి, పిల్లల స్కూలు ఫీజులు కట్టటానికి, నిత్యావసర సరుకులు కొనటానికి గ్రామీణ ప్రజలు వినియోగిస్తారు.

ఇందుకు భిన్నంగా అమెరికా పాల ఉత్పత్తుల రంగం భారీ సబ్సిడీలు పొందుతూ, ఎగుమతుల కోసం ఉద్దేశించిన పరిశ్రమగా ఉన్నది. అటువంటి దిగుమతులకు భారతదేశ మార్కెట్లను తెరవటం కేవలం భారతీయ మార్కెట్లను దెబ్బతీయటం మాత్రమే కాకుండా, లక్షలాది మంది గ్రామీణ పేదల జీవితాలను అతలాకుతలం చేస్తుంది. భారతదేశ రైతులు, వినియోగదారులు ఇప్పటికీ పరిరక్షించుకొంటున్న సంస్కృతి, సాంప్రదాయలు, నైతిక సూత్రాలను ఇవి బలహీనపరుస్తాయి.

అందువలన భారతదేశ చరిత్రలో పాల ఉత్పత్తిరంగం సామాజికంగా, రాజకీయంగా నిర్ణాయక అంశంగా ఉన్నది. వాణిజ్యం పేరుతో దానిని నీరుగార్చటం బాధ్యతా రాహిత్యం అవుతుంది.

ప్రజల కథనాలను ప్రపంచానికి తెలిపే వాడిగా ఈ రచయిత కేవలం ఆదాయం తగ్గిపోవటం గురించే కాకుండా, ప్రజల జీవితానుభవాలు ముందు తరాలకు చేరబోవని కూడా ఆందోళన చెందుతున్నాడు. పండించేందుకు రైతులకు భూములుండవు కాబట్టి అక్కడి గ్రామాలు కథలు చెప్పటం ఆపివేస్తాయి. ఈ నష్టాల కన్నా ఎక్కువగా భారతదేశం ప్రపంచ వాణిజ్యసంస్థ లాంటి అంతర్జాతీయ సంస్థల ద్వారానే కాకుండా, దేశీయంగా కూడా నైతికంగా, వ్యూహాత్మకంగా నష్టపోతుంది.

అభివృద్ధి చెందుతున్న దేశాలలోని వ్యవసాయరంగాన్ని వాణిజ్య దృక్పథంతో చూడరాదని అంతర్జాతీయ సంస్థలలో భారతదేశం నిరంతరం వాదిస్తున్నది. ఇపుడు అమెరికా వత్తిడితో మన స్వంత మార్కెట్‌ను బార్లా తెరవటంతో భారతదేశం చేస్తున్న వాదన బలహీనపడుతుంది. ముఖ్యంగా ఇరుగుపొరుగున ఉన్న దక్షిణాసియా దేశాలలో భారతదేశ విశ్వసనీయత, నమ్మకం క్షీణిస్తుంది.

ముఖ్యంగా దేశీయంగా తీవ్రమైన రాజకీయ వ్యతిరేకత ఎదురౌతుంది. భారత ప్రజాస్వామ్యానికి వ్యవసాయ రంగం ఎంతో ప్రాముఖ్యత గలది. ప్రజల ఆకాంక్షలు, ఆందోళనలు, సమీకరణలకు కేంద్ర స్థానంలో ఉంటుంది.

**ప్రజల గొంతు మూగబోతుంది**

గొప్ప కథా రచయిత అయిన మున్షి ప్రేమ్‌చంద్ రాసిన "జోడెద్దుల కథ" మంచి స్నేహితులైన హీరా, మోతి అనే ఎద్దుల చుట్టూ తిరుగుతుంది. పాత యజమాని తమను అమ్మివేసిన తర్వాత, కొత్త యాజమాని క్రూరత్వానికి వ్యతిరేకంగా తిరగబడి, తప్పించుకొచ్చి, గతంలో తమను అత్యంత ప్రేమాభిమానంతో చూసిన పాత యజమాని వద్దకు చేరతాయి.

బానిసత్వం, దోపిడి విధానాలు కొనసాగుతున్న కాలంలో దృఢచిత్తంతో కష్టాలను భరిస్తూ జీవనాన్ని కొనసాగించిన ఇటువంటి కథలు భారతీయ వ్యవసాయం నుండి పుట్టుకొచ్చాయి. ప్రస్తుతం చేసుకొంటున్న నూతన వాణిజ్య ఒప్పందాలతో పశువుల విలువను కేవలం డబ్బుతోనే కొలవటంతో సాంస్కృతికంగా, భావోద్వేగపరంగా వాటికి ఉన్న ప్రాధాన్యత తగ్గిపోతుంది.

మహేంద్రకపూర్ 1967లో నిర్మించిన ఉపకార్ సినిమా ఘన విజయం సాధించింది. ఆ సినిమాలోని "ఎద్దుల మెడలోని గంటలు జీవన నాదాన్ని వినిపిస్తున్నపుడు నా దేశంలోని భూమి బంగారం, వజ్రాలను పండిస్తుంది" అన్న పాట ప్రజల హృదయాలను కదిలించింది. కానీ ఇపుడు అమెరికా-భారత్ మధ్య జరుగుతున్న

**(మిగతా 34వ పేజీలో)**

# వాళ్లు విద్యను ఎందుకు ద్వేషిస్తున్నారు?

**రవిశంకర్ మిశ్రా**



ప్రాచీన కాలంలో యజ్ఞవల్క్యుని గార్గి ప్రశ్నించినప్పుడు, ఆమె ప్రశ్నలు అడగడం కొనసాగిస్తే శపిస్తానని, ఆమె శరీరం నుండి తల వేరు చేయబడుతుందని యజ్ఞవల్క్యుడు హెచ్చరించాడు. ఆ కాలంలో కూడా అధికారంలో ఉన్నవారు ప్రశ్నలంటే భయపడేవారు. బౌద్ధ సన్యాసులపై దాడులు జరిగినప్పుడు, ప్రపంచంలోని అత్యంత పురాతన విద్యా కేంద్రాలలో ఒకటైన నలంద విశ్వవిద్యాలయం ధ్వంసమైనప్పుడు కూడా అదే భయం పనిచేసింది. ఆ రోజుల్లో ఆ భయంతో ఉండిన శక్తులు నేడు మళ్లీ తలెత్తుతున్నాయి. శతాబ్దాల క్రితం చేసిన దాన్నే మళ్లీ పునరావృతం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి.

ఈ రోజు మళ్లీ, బౌద్ధ యుగం నాటి స్ఫూర్తితో ప్రశ్నలు తలెత్తుతుంటే, సమాధానాలు లేనివారు ఆ ప్రశ్నలు అడిగేవారిని అణచివేయాలని చూస్తున్నారు. ప్రశ్నలు అడిగే వారి సంఖ్య గణనీయంగా పెరగడంతో, విమర్శనాత్మక ఆలోచనకు పునాది వేసే విద్యాసంస్థలనే వారు మూతపెట్టాలనో, నాశనం చేయాలనో భావిస్తున్నారు. సాధారణ ప్రజలకు ఎలా ప్రశ్నించాలో నేర్పడానికి కొందరు మార్గదర్శకులు ప్రయత్నిస్తే, ఆ ఉపాధ్యాయులనే వారు తుడిచిపెట్టాలని చూస్తున్నారు. పాఠశాల గోడలు కూడా విద్యను నేర్పుతాయని తరచూ అంటుంటారు. బహుశా అందుకే అధికారంలో ఉన్నవారిని ఎలా సవాలు చేయాలో సాధారణ ప్రజలకు నేర్పే పాఠశాలలు, విశ్వవిద్యాలయాలను నాశనం చేయాలని వారు నిర్ణయించుకున్నారు.

ఈ లక్ష్య సాధన కోసం వారు ఏమి చేయడానికైనా సిద్ధంగా ఉన్నారు. విద్యను చాలాకాలంగా తమ శత్రువుగా భావించిన అవే శక్తులు, దేశవ్యాప్తంగా బోధనా, అభ్యాస సంస్కృతిని విచ్ఛిన్నం చేసే బాధ్యతను మళ్లీ తమ భుజస్కంధాలపై వేసుకున్నాయి.

ఇటీవలి సంవత్సరాలలో, దేశవ్యాప్తంగా దాదాపు 94,000 ప్రాథమిక విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఒక్క ఉత్తర ప్రదేశ్‌లోనే 27,000 ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడం లేదా మూసివేయడం జరిగింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో వివిధ కారణాల వల్ల దాదాపు 500 సెకండరీ పాఠశాలలను కూడా మూసివేశారు. మన అక్షరాస్యత రేటు, విద్యా రంగంలో మన స్థానం అనేక దేశాల కంటే వెనుకబడి ఉన్నామని స్పష్టం చేస్తున్నాయి. అందరికీ విద్యను అందించడానికి, మనకు మరిన్ని విద్యాసంస్థలతో పాటు మరింతమంది ఉపాధ్యాయులు అవసరం. నాణ్యమైన విద్యను అందించడానికి మన వద్ద ఇప్పటికీ సరిపోను విశ్వవిద్యాలయాలు లేవు, ఎందుకంటే 2014 తర్వాత మన వ్యవస్థ అసలు దాని మీద దృష్టి పెట్టలేదు. తద్విరుద్ధంగా, పాఠశాలల మూసివేతలు, విలీనాలు విద్య పట్ల మనకు ఏ మాత్రం ప్రాధాన్యత లేదని స్పష్టంగా తెలియజేస్తున్నది.

ఈ ఉదాసీనత “మనం విద్యను ఎందుకు అంతగా ద్వేషిస్తున్నాం?” అని పదే పదే ప్రశ్నించేలా చేస్తోంది.

విద్య పట్ల ఉన్న ఈ వ్యతిరేకతకు ఒక స్పష్టమైన ఉదాహరణ ఏమిటంటే–మనం ఇప్పుడు ఒక విశ్వవిద్యాలయాన్ని బుల్డోజ్ చేసే ప్రయత్నాల వైపు అడుగులు వేశాం. ఉత్తర ప్రదేశ్‌లోని రాంపూర్ జిల్లాలోని మహమ్మద్ అలీ జౌహర్ విశ్వవిద్యాలయాన్ని కూల్చి వేయడానికి ప్రతిపాదించిన చర్య విస్తృత విమర్శలకు గురైంది. విశ్వవిద్యాలయ భవనాలలో 95 శాతాన్ని కూల్చివేయాలని రాంపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఉత్తర్వులు జారీ చేసింది. అథారిటీ తెలిపిన వివరాల ప్రకారం, భవనాల ప్లాన్లకు అధికారికంగా ఎలాంటి ఆమోదం లభించలేదు, కాబట్టి వాటిని కూల్చివేయాలి. బీజేపీ మద్దతుదారులు కూడా ఇలాంటి వాదననే ముందుకు తెస్తున్నారు. వాళ్ళ దృష్టిలో ఈ విశ్వవిద్యాలయంలో ఒక నిర్దిష్ట వర్గానికి చెందిన విద్యార్థులు మాత్రమే విద్యను అభ్యసిస్తారు, కాబట్టి ఇది సాధారణ విద్యార్థుల ప్రయోజనాలకు ఉపయోగపడదు కాబట్టి దానిని కూల్చినా తప్పు లేదు.

ప్రతిపాదిత కూల్చివేతకు వ్యతిరేకంగా పలు నగరాల్లో నిరసనలు నిర్వహించారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు, ఉపాధ్యాయులు నిరంతరం ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. క్యాంపస్‌లో నిరవధిక ధర్నా కొనసాగుతోంది. ఈ సమయంలో పలువురు పార్లమెంట్ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థి ఉద్యమం తెచ్చిన ఒత్తిడి కారణంగా మొరాదాబాద్ డివిజన్ కమిషనర్ తదుపరి విచారణ వరకు కూల్చివేతపై తాత్కాలికంగా స్టే విధించారు. అయితే, ప్రభుత్వ ఎజెండా మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ద్వేషపూరిత

> **విద్య పట్ల ఉన్న ఈ వ్యతిరేకతకు ఒక స్పష్టమైన ఉదాహరణ ఏమిటంటే-మనం ఇప్పుడు ఒక విశ్వవిద్యాలయాన్ని బుల్డోజ్ చేసే ప్రయత్నాల వైపు అడుగులు వేశాం. ఉత్తర ప్రదేశ్‌లోని రాంపూర్ జిల్లాలోని మహమ్మద్ అలీ జౌహార్ విశ్వవిద్యాలయాన్ని కూల్చివేయడానికి ప్రతిపాదించిన చర్య విస్తృత విమర్శలకు గురైంది. విశ్వవిద్యాలయ భవనాలలో 95 శాతాన్ని కూల్చివేయాలని రాంపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఉత్తర్వులు జారీ చేసింది.**

రాజకీయంలో మునిగిపోయిన ప్రభుత్వం విశ్వవిద్యాలయాన్ని కూల్చివేసేందుకు అన్ని రకాల మార్గాలను ఉపయోగించడానికి ఆత్రుతగా ఉన్నట్లు కనిపిస్తోంది.

ఆర్ఎస్ఎస్ భావజాలంతో ప్రభావితమైన వారికి ఈ విశ్వవిద్యాలయం గురించి ఎంతవరకు తెలుసో నాకు తెలియదు. ముఖ్యమైన విషయం ఏమిటంటే, వారు తమ వాదనలకు ఆధారంగా చేసుకున్న అభిప్రాయం తమ ద్వారా వ్యాప్తి చెందిన నిరంతర మతపరమైన ప్రచార ఫలితమే. మహమ్మద్ అలీ జౌహర్ యూనివర్సిటీలో చదువుకుంటున్న విద్యార్థులలో 78 శాతం మంది హిందువులే. విశ్వవిద్యాలయ భవనాలు ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ నిర్మాణ అద్భుతాల నుండి ప్రేరణ పొంది రూపొందించబడ్డాయి. మొత్తం క్యాంపస్ దాదాపు 450 హెక్టార్లలో విస్తరించి ఉంది. దీని నిర్మాణంలో దాదాపు రూ.300 కోట్లు, సంవత్సరాల తరబడి చేసిన కృషి ఇమిడి ఉన్నది.

అభివృద్ధి సంస్థ లేదా జిల్లా పంచాయతీ నుండి బిల్డింగ్ ప్లాన్లకు అధికారిక ఆమోదం పొందకుండా ఈ అందమైన భవనాలను నిర్మించారనే ఒక్క కారణంతోనే వాటిని కూల్చివేయడం సమంజసమేనా? ఇటువంటి చర్య ఎంతమాత్రం సమంజసంగా కనిపించదు. మొదటగా, ఉత్తర ప్రదేశ్‌లోని వివిధ నగరాల్లోని దాదాపు 80 శాతం భవనాలు ఎలాంటి ఆమోదిత ప్లాన్లు లేకుండానే నిర్మించబడ్డాయి. అటువంటి సందర్భాలలో, కాంపౌండింగ్ లేదా క్రమబద్ధీకరణ రుసుమును విధించడం ద్వారా ఆ నిర్మాణాలను క్రమబద్ధీకరించడం అనేది అన్ని చోట్లా అమలులో ఉన్న పద్ధతి. భవనాలను క్రమబద్ధీకరించగలిగినప్పుడు, ప్రజా ప్రయోజనార్థం ఉన్న ఒక విశ్వవిద్యాలయాన్ని ఎందుకు క్రమబద్ధీకరించకూడదు? ఈ సంస్థ యజమాన్యం అంతిమంగా ఒక ప్రైవేట్ వ్యక్తి



IN SOLIDARITY WITH JNU STUDENTS

- Close to 200 people participated in protest at OU, condemning attack on JNU students on Sunday
- Amidst tight security, OU students stood with placards and raised slogans of 'students unity zindabad'. Many were wearing black badges
- Members of NSUI held a 'Shavyatra' of BJP. Flash protests and candle-light marches were also held at Sathupally, Ambedkar Statue at Tank Bund, People's Plaza and Darulshifa
- ABVP also held a protest and blamed left-wing student organisations for the incident
- Students of Maulana Azad National Urdu University and University of Hyderabad staged protests on their campuses



OU students held a rally from Arts College towards administrative building and EFLU students also joined the rally

"Attack on JNU students is a direct attack on many others who are raising their voices of dissent. I didn't want to sit at home comfortably and watch what was happening in the country as this affects me personally. Hence, I decided to join the protest at OU" Tarjani N | DOCTOR

"JNU students have suffered for being frontrunners in protests over CAA and NRC. The brutal attack on JNU students seemed like a warning for the students' community at large to not raise their voices of dissent" Devi | CULTURAL ACTIVIST

"We condemn the JNU incident where the vice-chancellor has jeopardized the safety of students by not providing enough security within the campus. We want Amit Shah to resign from his post as we hold him morally responsible for the attack" —Naresh D | TELANGANA STATE PRESIDENT, DALIT MINORITY STUDENTS ASSOCIATION

వద్ద ఉందనే రాష్ట్ర ప్రభుత్వం లేదా అథారిటీ నమ్మినప్పటికీ, ఇతర ప్రత్యామ్నాయ పరిష్కారాలు ఉన్నాయి. సంస్థ చట్టపరమైన హోదాను మార్చవచ్చు, లేదా దాన్ని జాతీయం చేయవచ్చు లేదా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు.

మరో ముఖ్యమైన ప్రశ్నపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని మెజారిటీ విశ్వవిద్యాలయాలు, వాటిలో చాలా వరకు భారతదేశ స్వాతంత్ర్యానికి ముందు లేదా ఆ సమయంలో నిర్మించబడ్డాయి. ప్రస్తుత నియంత్రణ వ్యవస్థ ఉనికిలోకి రాకముందే నిర్మించబడ్డాయి. అప్పట్లో ఏ అథారిటీ వారి బిల్డింగ్ ప్లాన్లను ఆమోదించింది?

వందల ఏళ్ల నాటి భవనాలు ఉన్న డజన్ల కొద్దీ విశ్వవిద్యాలయాలు నాకు వ్యక్తిగతంగా తెలుసు. వారి ప్లాన్లు ఎప్పుడూ అధికారికంగా ఆమోదించబడలేదు. అయినా అవి ఎటువంటి అడ్డంకి లేకుండా నడుస్తూనే ఉన్నాయి. వారిపై కూడా ఇటువంటి చర్యలుతీసుకోమని చెప్పడం నా ఉద్దేశం కాదు. అందుకే నేను ఉద్దేశపూర్వకంగానే వాటి పేర్లను ఇక్కడ ప్రస్తావించడం లేదు. ఇక్కడ విషయం చాలా సరళమైనది. ఆ విశ్వవిద్యాలయాలు యథావిధిగా నడుస్తున్నప్పుడు, మహమ్మద్ అలీ జౌహార్ విశ్వవిద్యాలయాన్ని కూడా కొనసాగించడానికి అనుమతిస్తే వచ్చిన పెద్ద ముప్పేమిటి?

మరో కీలకమైన అంశం కూడా తెరపైకి వచ్చింది. ఈ విశ్వవిద్యాలయాన్ని నిర్మించినప్పుడు రాంపూర్ డెవలప్‌మెంట్ అథారిటీ అసలు ఉనికిలోనే లేదు. విశ్వవిద్యాలయం కొనసాగడానికి నిజంగా అనుమతించాలని అనుకుంటే అథారిటీ, రాష్ట్ర ప్రభుత్వం రెండింటికీ పలు చట్టపరమైన, పరిపాలనాపరమైన ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయని మనం అర్థం చేసుకోవచ్చు. అయితే, విశ్వవిద్యాలయాన్ని కూల్చివేసి అక్కడ చదువుకుంటున్న వారికి విద్యా అవకాశాలను దూరం చేయడమే అసలు లక్ష్యం అయితే, ఆ విషయమే వేరు. అదే మరింత నమ్మదగిన వివరణగా కనిపిస్తుంది.

మహమ్మద్ అలీ జౌహార్ విశ్వవిద్యాలయం మెడిసిన్, ఇంజనీరింగ్‌తో పాటు 98 సబ్జెక్టులలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను అందిస్తుంది. ఇదే స్థాయి, ప్రమాణాలతో మరొక విశ్వవిద్యాలయాన్ని స్థాపించమని ప్రభుత్వాన్ని కోరితే, ఆ పని చేయడం ప్రభుత్వానికి ఏ మాత్రం సాధ్యం కాదు. అయితే, బుల్డోజ్ చేయడంలో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం నిస్సందేహంగా గణనీయమైన అనుభవాన్ని గడించింది. నివాస ప్రాంతాలు, దాల్‌మండి, శతాబ్దాల నాటి మసీదులను కూల్చివేసి అది కాశీ విశ్వనాథ్ కారిడార్ పేరిట కావచ్చు లేదా ప్రయాగ్‌రాజ్‌లోని అనేక నివాస స్థావరాలను నేలమట్టం చేసిన మహాకుంభ్ పేరిట కావచ్చు లేదా రియల్ ఎస్టేట్ డెవలపర్లకు ప్రయోజనం చేకూర్చడానికి వేలాది ఇళ్లను కూల్చివేసిన లక్నోలోని అక్బర్‌నగర్ పేరిట కావచ్చు లేదా లెక్కలేనన్ని ఇళ్లను శిథిలావస్థకు చేర్చిన రోడ్ల విస్తరణ ప్రాజెక్టుల కింద కావచ్చు-ప్రభుత్వం కూల్చివేతలో తన నైపుణ్యాన్ని పదే పదే నిరూపించుకుంది. అది కచ్చితంగా నిర్మాణాలను సులభంగా కూల్చివేయగలదు. కానీ, ఈ విశ్వవిద్యాలయాన్ని కూల్చివేసే ముందు రాంపూర్‌లో మరొక విశ్వవిద్యాలయాన్ని నిర్మించాలని, తద్వారా విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని కోరితే మాత్రం-ఉత్తర ప్రదేశ్ బీజేపీ ప్రభుత్వం సమాధానం చెప్పలేక చేతులెత్తేస్తుంది.

**(అనువాదం: కె సత్యరంజన్)**

ఈ మాసం ప్రత్యేకం

# అమెరికాలో డేటా సెంటర్లపై వెల్లువెత్తుతున్న వ్యతిరేకత

**నిక్ ఎంజెల్‌ఫ్రైడ్**



రచయిత వాతావరణ ప్రచారకుడు, ఫ్రీలాన్స్ జర్నలిస్టు

అమెరికాలో మొట్టమొదటి సారి భారీస్థాయి డేటా సెంటర్ల ఏర్పాటును నిషేధించే బిల్లును ఆమోదించటం ద్వారా న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీ చరిత్ర సృష్టించింది. సామాజికంగా, పర్యావరణపరంగా ఈ కేంద్రాలు కలిగించే ప్రభావాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్యకర్తలు ఈ పరిణామాన్ని కీలక మలుపుగా భావిస్తున్నారు. న్యూయార్క్ అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు ఆహారం, మంచినీటి పరిరక్షణ సంస్థకు చెందిన సెథ్ గ్లాడ్‌స్టోన్ మద్దతు తెలిపాడు. డేటా సెంటర్ల ఏర్పాటుపై మారటోరియం విధించాలనీ, ఈ పరిశ్రమ విస్తరణను నిరోధించాలనీ దేశంలోని 50 రాష్ట్రాలలోనూ ప్రజలు తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేస్తున్నారనీ, అత్యంత వేగంగా జరుగుతున్న డేటా సెంటర్ల నిర్మాణానికి విరామమివ్వాలని ప్రజలు కోరుతున్నారనీ ఆయన తెలిపాడు.

డేటా సెంటర్ల ఏర్పాటును నిషేధిస్తూ న్యూయార్క్ అసెంబ్లీ ఆమోదించిన బిల్లు చట్టంగా మారాలంటే గవర్నర్ కాథి హొచుల్ సంతకం చేయాలి. డేటా సెంటర్ల ఏర్పాటుతో సంభవించే పరిణామాలపట్ల జాతీయ స్థాయిలో ప్రజలనుండి వస్తున్న వ్యతిరేకతను ఈ బిల్లు వ్యక్తం చేస్తున్నది. కౌంటీలు, నగరాలు, రాష్ట్రాలలో డేటా సెంటర్లను వ్యతిరేకిస్తూ ఉద్యమాలు జరుగుతున్నాయి. రిపబ్లికన్‌లు, డెమోక్రాట్లకు ఓట్లు వేసినవారు కూడా ఈ కేంద్రాల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారు.

ఇది పాక్షికమైన సమస్య కాదనీ, డేటా సెంటర్ల ఏర్పాటుపై ప్రతివారూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారని గ్లాడ్‌స్టోన్ చెప్పారు. విద్యుత్ బిల్లుకు ఎక్కువ మొత్తం చెల్లించాలనిగానీ, నీటి కొరతతో ఇబ్బందులు పడాలనిగానీ ఏ ఒక్కరూ భావించరని ఆయన అన్నారు.

గత సంవత్సరం 15,000 కోట్ల డాలర్లతో నిర్మించబోతున్న డేటా సెంటర్ల ఏర్పాటును ప్రజలు ఐక్యంగా నిరోధించారని డేటా సెంటర్ వాచ్ సంస్థ వెల్లడించింది. పర్యావరణం, సామాజిక సమస్యలపై దశాబ్దాల నుండి పని చేస్తున్న సంస్థలను కూడా ఈ ఉద్యమం విస్తరిస్తున్న వేగం ఆశ్చర్యపరుస్తున్నది.

భారీ పరిమాణంలో ఉండే డేటా సెంటర్ల నిర్మాణానికి వేగంగా ప్రతిపాదనలు వస్తుండటంతో వీటికి వ్యతిరేకత కూడా అంతే వేగంగా పెరుగుతున్నదని దక్షిణప్రాంతంలోని అడవుల సంరక్షణ కోసం ప్రజలను సమీకరిస్తున్న డాగ్‌వుడ్ అలయన్స్ సంస్థ డైరెక్టర్ మైఖేల్ లెజెండ్రే చెప్పారు. ఈ కేంద్రాలను తప్పనిసరిగా వ్యతిరేకించాల్సిన ప్రాంతాలలోని ప్రజలు ఉద్యమానికి సన్నద్ధమవుతున్నారని కూడా ఆయన చెప్పారు.

న్యూయార్క్ అసెంబ్లీలో జరిగినట్లుగా కొంత మేరకు విజయం సాధించటం జాతీయ స్థాయిలో ప్రధాన వార్తగా మారుతున్నది. ఇతర ప్రాంతాలలో స్థానిక స్థాయిలో సాధించిన విజయాలపై ప్రచారం లేనప్పటికీ అవి కూడా ముఖ్యమైనవే. అత్యంత శక్తివంతమైన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సంస్థలకు వ్యతిరేకంగా సాధారణ ప్రజలు ఈ పోరాటం జరుపుతున్నారని, చివరకు ప్రజలే విజయం సాధిస్తారని గ్లాడ్‌స్టోన్ చెప్పారు.

**స్థానిక విజయాలు**

ఈ సమస్యపై ఇక్కడి ప్రజలు చురుకుగా ఉన్నారనీ, వారు ఏదో ఒకటి చేయాలనుకుంటున్నారనీ సీటెల్ 350 సంస్థకు చెందిన బెన్ జోన్స్ పేర్కొన్నారు. అమెరికాలో డేటా సెంటర్లపై నిషేధం విధించిన నగరాలలో సీటెల్ అతి పెద్ద నగరం. స్థానిక కార్యకర్తలు నెలల తరబడి ప్రజలను సమీకరించటానికి ప్రయత్నం చేశారు. సీటెల్ 350, సీటెల్ ట్రబుల్ మేకర్స్, సీటెల్ డెమోక్రాటిక్ సోషలిస్ట్స్ ఆఫ్ అమెరికా, లేక డిఎస్ఎ సంస్థలు డేటా సెంటర్లు, ఎఐ పరిశ్రమలను గురించి అనేక దఫాలుగా బహిరంగ చర్చలు, సమావేశాలు జరిపాయి. సీటెల్‌లో భారీ డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తామని అప్పటికి బహిరంగంగా ప్రకటించకపోయినప్పటికీ ఈ అంశాలపై ప్రజలలో ఆసక్తి పెరిగింది.

కొత్త డేటా సెంటర్ల ఏర్పాటు కోసం వచ్చిన ప్రతిపాదనలకు వ్యతిరేకంగా అప్పటికే పోరాటం చేస్తున్న సెంట్రల్ వాషింగ్టన్‌లోని ప్రజలకు మద్దతు ప్రకటించటానికి జోన్స్, ఇతరులు ఈ సభలు, సమావేశాలను ఉపయోగించుకున్నారు. నాలుగు పెద్ద టెక్ కంపెనీలు సీటెల్‌లో ఐదు భారీ డేటా సెంటర్లను ఏర్పాటు చేయటానికి అనుమతుల కోసం ప్రయత్నం చేస్తున్నాయని ఏప్రిల్‌లో వార్తలు వచ్చాయి. డిజిటల్ సంస్థలు డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయటానికి డౌన్‌టౌన్‌లో ఆరంతస్తుల భవనం సరిపోతుంది. అయితే, సీటెల్ నగరంలో ఉపయోగించే విద్యుత్‌లో మూడోవంతు ఈ డేటా సెంటర్‌లు వినియోగిస్తాయని జోన్స్ చెప్పాడు.

డేటా సెంటర్ ఏర్పాటు గురించి తెలిసిన వెంటనే తాము ప్రజలను సమీకరించటం ప్రారంభించామని, అంతర్గతంగా కృషి చేయటం ద్వారా సీటెల్‌లో డేటా సెంటర్ల ఏర్పాటును వ్యతిరేకించే ప్రజలను త్వరగా రంగంలోకి తీసుకువచ్చి, సిటీ కౌన్సిల్‌కు 96,000 ఇ-మెయిల్స్ పంపారు. కొద్ది వారాలలోనే నగర అధికారులు డేటా సెంటర్ల ఏర్పాటును నిషేధిస్తూ ఉత్తర్వులు జారి చేశారు. జూన్ 9వ తేదీన కౌన్సిల్ ఈ ఉత్తర్వులను ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఈ నిషేధాన్ని తామే జారీ చేయించామని ప్రచారం చేసుకోవటానికి నగరంలోని నాయకులు పోటీ పడ్డారు. ప్రజలలో ఉన్న తీవ్రమైన వ్యతిరేకత వలన వారు దీనిని ఆమోదించారు అని జోన్స్ చెప్పారు. సీటెల్ నగరంలో విధించిన నిషేధం ఒక సంవత్సరం పాటు అమలులో ఉంటుంది. అప్పటి లోగా నగరంలోని నాయకులు, సామాజిక గ్రూపులు కొత్త డేటా సెంటర్ల ఏర్పాటుపై శాశ్వత నిషేధం విధింపజేయటానికి కృషి చేయాలని జోన్స్ పేర్కొన్నారు.

> “ డేటా సెంటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమం కొద్దికాలంలోనే విస్తృతంగా వ్యాపించి, ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రధానాంశాలలో ఒకటిగా ముందుకొచ్చింది. రెండు పార్టీల రాజకీయ నాయకులకు ప్రజల అసంతృప్తి తాకటంతో దానిని చల్లార్చటం కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ”

ఈ పని చేయటం కోసం మేము పరిశ్రమ అభివృద్ధిని మందగింపజేశాం అని సీటెల్ డిఎస్ఎ ఆర్గనైజర్, మెషిన్ లెర్నింగ్‌లో రీసెర్చి చేస్తున్న రాజ్ మిర్‌పురి చెప్పారు. పారదర్శకత, విద్యుత్, మంచినీటి పరిరక్షణ, సమాజానికి లబ్ది చేకూర్చే ఇతర నిబంధనలు డేటా సెంటర్లకు ఉండాలని కోరుతున్నామని ఆయన చెప్పాడు.

దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న మునిసిపాలిటీలలో కూడా ఇదే విధమైన కార్యక్రమాలు జరుగుతున్నాయి. మోంటెరే పార్క్, కాలిఫోర్నియా, స్కార్‌బర్గ్, మెయినే, కాంటన్, నార్త్ కరోలినా, న్యూ ఓర్లియన్స్ లాంటి ప్రముఖ పట్టణాలు, నగరాలు కొత్త డేటా సెంటర్ల ఏర్పాటుపై నిషేధం విధించాయి.

ఈ ఉద్యమాలు కొన్ని ఎదురు దెబ్బలు కూడా తిన్నాయి. ఈ సంవత్సరం ప్రారంభంలో డేటా సెంటర్ల ఏర్పాటును నిషేధిస్తూ దేశంలోనే మొదటిగా మెయినే అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్ జెనెట్ మిల్స్ వీటో చేశాడు. అయినప్పటికీ ఇటువంటి ప్రయత్నాలు అనేక నగరాలలో జరుగుతున్నాయి. వాటిలో న్యూయార్క్ తీర్మానం ఆమోదానికి దగ్గరలో ఉంది. పెన్సిల్వేనియా, మిచిగాన్, సౌత్ కరోలినా, వెర్మౌంట్‌లలో అధికారులు డేటా సెంటర్లపై నిషేధం విధించే తీర్మానాలను పరిశీలిస్తున్నారు.

డేటా సెంటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమం కొద్దికాలంలోనే విస్తృతంగా వ్యాపించి, ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రధానాంశాలలో ఒకటిగా ముందుకొచ్చింది. రెండు పార్టీల రాజకీయ నాయకులకు ప్రజల అసంతృప్తి తాకటంతో దానిని చల్లార్చటం కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

**సాంప్రదాయేతర కూటములు**

“షార్క్ టాంక్” స్టార్ పెట్టుబడిదారు అయిన కెవిన్ ఓ లేరి ఆగ్నేయ ప్రాంతంలోని అత్యంత అరుదైన, పర్యావరణ పరంగా సున్నితమైన “ది గ్రేట్ సాల్ట్‌లేక్ బేసిన్”లో భారీ డేటా సెంటర్ ఏర్పాటు చేయటానికి ప్రయత్నం చేస్తున్నదన్న వార్త ఇటీవల బయటకొచ్చింది. బాక్స్ ఎల్డర్ కౌంటి, ఉతాహ్ కమీషనర్లు ఆ ప్రాజెక్టుకు ఓటు చేయాల్సి ఉంది. సాల్ట్‌లేక్ నగరం పునాదిగా చేసుకొని జీవ వైవిధ్యాన్ని కాపాడటం కోసం పని చేస్తున్న కార్యకర్తలు ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమించారు.

ప్రజలను సమీకరించటానికి కొద్ది సమయం మాత్రమే ఉండటంతో కార్యకర్తలు డేటా సెంటర్‌ను గురించి తమ కమ్యూనిటిలోని సభ్యులకు తెలియజేయటం సాధ్యం కాదేమోనని ఆందోళన చెందారు. అందువలన ఓటింగ్ జరిగే రోజు ఉదయం 180 మంది మాత్రమే నిరసన తెలియజేయటానికి పూనుకున్నారు. ప్రజల నుండి వస్తున్న వత్తిడితో ఓటింగ్‌ను వారం రోజుల పాటు వాయిదా వేశారు.

స్ట్రాటోస్ ప్రాజెక్టుగా పిలుస్తున్న ఈ డేటా సెంటర్‌కు వ్యతిరేకంగా సామాజిక గ్రూపులలో విస్తృతంగా ప్రచారం చేయటానికి అదనంగా లభించిన సమయాన్ని కార్యకర్తలు వినియోగించుకున్నారు. అడవి జంతువుల నివాస ప్రాంతాలతో పాటు అరుదైన చిత్తడి భూమిపై కూడా ఈ ప్రాజెక్టు తీవ్ర ప్రభావం చూపుతుంది.

డేటా సెంటర్ల ఏర్పాటు సమస్యపై ఇప్పటికే పరిస్థితి అగ్ని పర్వతంలా ఉన్నదని, స్ట్రాటో ప్రాజెక్టు దీనిని బద్దలు చేయటానికి ఉపయోగపడిందని ఉద్యమ కార్యకర్త డెడా సీడ్ చెప్పారు. అయితే న్యాయపరమైన సమస్యలు తమ చేతులను కట్టివేశాయని పేర్కొంటూ కమీషనర్లు ప్రాజెక్టుకు ఆమోదం తెలిపారు.

భాగస్వాములను శాంతింపజేయటం కోసం బాక్స్ ఎల్డర్ కౌంటి జూన్ 10వ తేదీన డేటా సెంటర్ల ఏర్పాటుపై ఆరు మాసాల పాటు నిషేధం విధించింది. ఈ నిర్ణయంతో స్ట్రాటో ప్రాజెక్టును అడ్డుకోలేక పోయినప్పటికీ, డేటా సెంటర్ల ఏర్పాటులో ముందుకు సాగకుండా ఇతర సంస్థలను నిరోధించింది. విధాన నిర్ణేతలు పరిశ్రమలకు అనుకూలంగా వ్యవహరిస్తున్న చరిత్ర ఉన్నప్పటికీ, డేటా సెంటర్ల ఏర్పాటు వలన విద్యుత్, నీటి కొరత ఎదుర్కొనున్న ప్రజల నుండి వస్తున్న వత్తిడికి ప్రభుత్వ అధికారులు లొంగక తప్పదన్న వాస్తవాన్ని ఇది వెల్లడిస్తున్నది.

అమెరికా దక్షిణ ప్రాంతంలో ఎన్నికైన అధికారులు తమ నియోజకవర్గ పరిధిలో డేటా సెంటర్లను ఏర్పాటు చేయాలని పోరాటాలు చేశారు. కానీ వారి పార్టీలలోనే ఇందుకు వ్యతిరేకత కూడా వస్తున్నదని డాగ్ ఉడ్ అలయెన్స్‌కు చెందిన లెజెండ్రే పేర్కొన్నారు.

ఉతాహ్‌లో జరిగిన విధంగానే దక్షిణ ప్రాంతంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమం – డేటా సెంటర్ల ఏర్పాటును వ్యతిరేకించేవారు పర్యావరణ పరిరక్షణ గ్రూపులు, నైతిక విలువలపై ఆధారపడిన ప్రభుత్వ ఏర్పాటు కోసం ఆందోళన చేస్తున్న మెర్మన్ ఉమెన్ లాంటి యధాతథవాద గ్రూపులతో కూడా జట్టు కట్టారు. అంటే ఈ సమస్య పరస్పరం పొసగని గ్రూపులతో పొత్తులు ఏర్పడటానికి దారితీసింది. డేటా సెంటర్ల ఏర్పాటుతో విద్యుత్‌కు డిమాండ్ పెరగటంతో సహజ వాయువును ఉత్పత్తి చేస్తున్న సంస్థలు పర్యావరణాన్ని నిరంతరం కలుషితం చేస్తుంటాయనీ, దక్షిణ ప్రాంతంలో ఏర్పాటు చేసే బయోమాస్ పరిశ్రమ జీవావరణాన్ని ధ్వంసం చేస్తుందని పర్యావరణ పరిరక్షణ గ్రూపులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

డేటా సెంటర్ల ఏర్పాటు ఫలితంగా ఏర్పడే విద్యుత్ కొరతను తీర్చటం కోసం నూతన దృక్పధంతో బయోమాస్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు వస్తున్నాయి. దీని వలన అడవులలో దొరికే బయోమాస్‌ను పారిశ్రామిక కార్యకలాపాల కోసం ఉపయోగించటం పెరుగుతుందని లెజెండ్రే చెప్పారు.

డేటా సెంటర్ల ఏర్పాటు వల్ల వనరులకు డిమాండ్ పెరగటంతో ప్రజలు ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తుంది. విద్యుత్, మంచినీటికి కొరత ఏర్పడుతుంది. వీటన్నింటి ఫలితంగా ఇతర ప్రాంతాల ప్రజలు కూడా పోరాటాలలోకి వస్తున్నారు.

వనరులను వినియోగించుకొనే విషయంలో ఆగ్నేయ ప్రాంతం ఇప్పటికే చాలా సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నది. ఇపుడు చలికాలంలో వాతావరణంలో ప్రతికూల మార్పులు లేదా తుఫాన్‌లు వస్తాయని ప్రజలకు చెబుతున్నారు. ఇపుడు విద్యుత్‌ను డేటా సెంటర్లకు అందించటమా లేక 20 వేల కుటుంబాలకు సరఫరా చేయటమా అన్న సమస్యను

ఎదుర్కొంటున్నామని లెజెండ్రే చెప్పారు. ఈ విధమైన ఆందోళనలతో తీర ప్రాంతాలలోని ప్రజలు ప్రభుత్వ బోర్డు మీటింగ్‌లు, బహిరంగ చర్చలు జరిగే సమావేశాలకు పెద్దసంఖ్యలో హాజరవుతున్నారు. డేటా సెంటర్లపై ఉన్న వ్యతిరేకత ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తుండటంతో, ఎన్నికలలో ఎవరికి ఓటు చేయాలన్న నిర్ణయాలు రాత్రికి రాత్రే మారిపోతున్నాయి.

ఉతాహ్‌లో ఈ సంవత్సరం ఎన్నికైన వారు డేటా సెంటర్ల ఏర్పాటును గురించి ప్రశ్నలను ఎదుర్కొంటారని నమ్మకంతో ఉన్నాను, దీనిపై వారేమి చేయాలనుకొంటున్నారో ప్రజలు తెలుసుకోవాలను కుంటున్నారు అని సీడ్ పేర్కొన్నారు.

“ డేటా సెంటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా దేశవ్యాపిత కూటమి ఏర్పాటు కోసం జూన్ 11వ తేదీన ఫుడ్ అండ్ వాటర్ వాచ్ సంస్థ పిలుపు ఇచ్చింది. అమెరికాలోని అన్ని ప్రాంతాల నుండి వందలాది మంది ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరయారు. ఈ ఉద్యమం అభివృద్ధి చెందుతున్న వేగం ఆశ్చర్యకరంగా ఉన్నదని ఈ సంస్థ కార్యకర్త, దీర్ఘకాలం నుండి ఉద్యమాలలో పనిచేస్తున్న ఎమిలి ఉర్త్ చెప్పారు. ”



డేటా సెంటర్లకు వ్యతిరేకంగా అమెరికా ప్రజల ర్యాలీ

## జాతీయస్థాయి ఉద్యమం

విద్యుత్ సమస్యలపై పనిచేస్తున్న కొందరు కార్యకర్తలు, గతంలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించినపుడు జరిగిన అసాధారణమైన అభివృద్ధిని ఈ సందర్భంగా గుర్తు చేసుకొంటున్నారు. 2010లో ఫ్రాకింగ్ (భూమిలోకి లోతుగా బోర్లు వేసి, ఇసుక, కెమికల్స్ కలిపిన నీటిని లోపలికి పంపి, వేల అడుగుల లోతులో ఉన్న రాతి పలకలను పగులకొట్టి ఆయిల్, గ్యాస్‌లను వెలికి తీయటం) విధానం రావటంతో అప్పటి వరకు అసాధ్యంగా ఉన్న లోతుల నుండి ఆయిల్, గ్యాస్ నిల్వలను వెలికితీసే పరిశ్రమలు వేలం వెర్రిగా విస్తరించాయి. ఇవి దీర్ఘకాలంలో తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తాయి. దీనివలన సమస్యలను ఎదుర్కొంటున్న ప్రజలు ఆందోళనలకు పూనుకోవటంతో స్థానికంగా, రాష్ట్రస్థాయిలో ఫ్రాకింగ్‌పై నిషేధం విధించారు.

అపుడు ఫ్రాకింగ్ విస్తరించిన విధంగానే ప్రస్తుతం డేటా సెంటర్లు కూడా వేగంగా ఏర్పాటవుతున్నాయని 350 సీటెల్ ఉద్యమానికి చెందిన జోన్స్ పేర్కొన్నారు. మొదట్లో ఏమీ లేవని, తర్వాత దేశవ్యాపితంగా విస్తరించాయని చెప్పారు. భారీస్థాయిలో ఆయిల్, గ్యాస్ ఉన్న ప్రాంతాలకే ఫ్రాకింగ్ పరిమితం కాగా, డేటా సెంటర్లను అన్నిచోట్లా ఏర్పాటు చేయవచ్చు. ఫ్రాకింగ్ ద్వారా అత్యవసరమైన ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తుండగా ఏఐ విస్తరణ సాధారణ ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతున్నదనేది అస్పష్టంగా ఉన్నది. దీనిని పరిగణనలోకి తీసుకున్నపుడు డేటా సెంటర్ల ఏర్పాటు కోసం తామర తంపరగా వస్తున్న ప్రతిపాదనలకు మరింత ఎక్కువ ప్రతిఘటన వచ్చే అవకాశం ఉన్నది.

డేటా సెంటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా దేశవ్యాపిత కూటమి ఏర్పాటు కోసం జూన్ 11వ తేదీన ఫుడ్ అండ్ వాటర్ వాచ్ సంస్థ పిలుపు ఇచ్చింది. అమెరికాలోని అన్ని ప్రాంతాల నుండి వందలాది మంది ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరయారు. ఈ ఉద్యమం అభివృద్ధి చెందుతున్న వేగం ఆశ్చర్యకరంగా ఉన్నదని ఈ సంస్థ కార్యకర్త, దీర్ఘకాలం నుండి ఉద్యమాలలో పనిచేస్తున్న ఎమిలి ఉర్త్ చెప్పారు.

డేటా సెంటర్ల ఏర్పాటును అడ్డుకోవటం కోసం కొత్తగా ఏర్పాటైన కూటమిలో 47 రాష్ట్రాల నుండి 500 లకు పైగా సంస్థలు భాగస్వాములయ్యాయని ఉర్త్ చెప్పారు. ఫుడ్ అండ్ వాటర్ వాచ్, అవర్ రివల్యూషన్, గ్రీన్ లాటినోస్, థర్డ్ యాక్ట్, ఫిజిషియన్స్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటి లాంటి ప్రముఖ సంస్థలు వీటిలో ఉన్నాయి.

వివిధ ప్రాంతాలలో డేటా సెంటర్ల ఏర్పాటుపై స్థానికంగా విధిస్తున్న నిషేధాలకు జాతీయస్థాయిలో ప్రచారం వస్తున్నది. అనేక మీడియా సంస్థలు చెబుతున్న దాని కన్నా కూటమిని ఏర్పాటు చేయాలన్న పిలుపుకు ఎక్కువ స్పందన వస్తున్నదని సభ్యులు చెబుతున్నారు. ఇండియానాలోని 13 కౌంటీల ప్రభుత్వాలు ఇప్పటికే డేటా సెంటర్ల ఏర్పాటును నిషేధించాయని ఇండియానాలోని సిటిజెన్స్ యాక్షన్ నెట్‌వర్క్‌కు చెందిన బెన్ ఇన్‌స్కీప్ చెప్పాడు. తమ రాష్ట్రంలోని 25 స్థానిక, గిరిజన ప్రభుత్వాలు కూడా ఇదే విధానాలను అనుసరిస్తున్నాయని నార్త్ కరోలినాలో ఎన్విరాన్‌మెంటల్ జస్టిస్ నెట్‌వర్క్‌లో పనిచేస్తున్న రనియాహ్ చెప్పాడు.

రాష్ట్రస్థాయిలో సహకారానికి తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. డేటా సెంటర్ల ఏర్పాటుపై సీటెల్ నిషేధం విధించిన రోజునే డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన బిల్లులను రానున్న అసెంబ్లీ సమావేశాలలో ప్రవేశపెట్టటం కోసం వాషింగ్టన్‌లో కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్త కూటమిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఈ మధ్యకాలంలో అమెరికా చరిత్రలో జరగని విధంగా ఏఐ పరిశ్రమతో సంభవిస్తున్న తీవ్ర పరిణామాలతో పెరుగుతున్న ప్రజల ఆగ్రహం డేటా సెంటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా సంఘటితం అవుతున్నది.

డేటా సెంటర్ల ఏర్పాటుపై పెరుగుతున్న ఆందోళనతో గతంలో ఏ సమస్యపైనా బహిరంగంగా నిర్దిష్ట వైఖరి తీసుకోనివారు కూడా ఈ సమస్యపై నిర్దిష్ట వైఖరి తీసుకోవటానికి సిద్ధమౌతున్నారు అని సీడ్ చెప్పారు.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

సైన్సు

## జీవుల సృష్టిపై శాస్త్రీయ వెలుగులు ప్రసరించిన

# డార్విన్ సిద్ధాంతం



రచయిత హైదరాబాద్ ఇసిఐఎల్‌లో రిటైర్డ్ సీనియర్ మేనేజర్

పిబి చారి

మహాశాస్త్ర వేత్త చార్లెస్ డార్విన్ 1809 ఫిబ్రవరి 12న ఇంగ్లండ్‌లోని షఉస్ బరిలో జన్మించాడు. ఆయన చిన్నప్పటినుండి చదువు మీద కంటే ప్రకృతి పరిశీలన మీదనే ఎక్కువ శ్రద్ధ చూపేవాడు. రకరకాల పురుగులను పక్షులను జంతువులను సేకరించి వాటి అలవాట్లను పరిశీలించేవాడు. డాక్టరు అవ్వమని తండ్రి పంపితే చదువు మధ్యలోనే తిరిగి వచ్చాడు. తండ్రి మందలింపుల బారీ నుండి తప్పించుకోవటానికి ఒక బైబిల్ చేతిలో పట్టుకొని 1831లో బీగల్ అనే ఒక ఓడ ఎక్కాడు డార్విన్. ఆయన పాస్టర్ అవుదామన్న ఉద్దేశంతో ఓడ ఎక్కాడు. కానీ 1836లో ఓడ దిగేటప్పటికీ ఆయన అప్పటివరకు ప్రకృతి, మానవుల పుట్టుకకు సంబంధించి క్రిస్టియన్ మతం చెబుతున్నదంతా తప్పు అని తేల్చేశాడు.

**ఈ ఐదేళ్లలో ఏమి జరిగింది?**

దక్షిణ పసిఫిక్ సముద్రంలోని ఈక్విడార్ కోస్తాకు 650 మైళ్ళ దూరంలోని గెలాపగోస్ దీవులకు ఓడ చేరుకున్నప్పుడు ఆయనకు అక్కడ ఏ ప్రాంతంలోనూ కనిపించని జీవజాతులు కనిపించాయి. ముఖ్యంగా "పించెస్" అనబడే పిచ్చుకలను పోలిన పక్షులను, వాటి ముక్కులను ఆయన పరిశీలించాడు. వాటిల్లో 14 రకాల జాతులు ఉన్నాయని గమనించాడు. అలాగే తాబేళ్ల యొక్క కవచాలను అంటే shells ను వాటికున్న రకరకాల ఆకారాల (shapes) ను గమనించాడు. ఇన్ని రకాల జీవజాతులు ఎందుకు ఉన్నాయి? ఇంత వైవిధ్యం ఎందుకు ఉన్నది? అని దీర్ఘంగా ఆలోచించి లక్షకు పైగా నమూనాలను సేకరించి వాటిని పరిశోధించి డార్విన్ ఒక ప్రతిపాదన చేశాడు. అది ఏమంటే "న్యాచురల్ సెలక్షన్"- ప్రకృతి ఎంపిక లేక ప్రకృతి వరణం ద్వారా కొత్త జీవజాతులు పుడతాయి.

డార్విన్ కన్నా కాస్త ముందు లామార్క్ అనే ఫ్రెంచి శాస్త్రజ్ఞుడు ఒక జీవజాతి నుండి మరొక జీవజాతి పరిణామం చెందింది అని దృఢంగా విశ్వసించాడు. అయితే ఈ పరిణామం ఎలా జరిగి ఉంటుంది అనే దానికి ఆయన ఇలా చెప్పాడు. లామార్క్ రోజుల్లో జిరాఫీ అనే జంతువు కొత్తగా యూరోపియన్లకు తెలియ వచ్చింది. దానికి అంత పొడుగు మెడ, పొడుగు కాళ్లు ఎలా వచ్చాయి. జిరాఫీ అనే జంతువు చెట్టు కింది కొమ్మలపై నున్న ఆకులు అయిపోగా పైకొమ్మల ఆకులను అందుకోవటానికి రోజు మెడ బాగా చాచి ఉంటుంది. తర్వాత ఇంకా పై కొమ్మల ఆకులను అందుకోవటానికి కాళ్ళను మెడను ఇంకా చాచి ఉంటుంది. కొన్ని 100 ల సంవత్సరాలలో దాని మెడ సాగి పొడవాటి మెడ అయి ఉంటుంది అని చెప్పాడు. అంటే మన శరీరంలోని ఏదైనా భాగాన్ని ఎక్కువగా వాడితే అభివృద్ధి అవుతుంది, వాడకపోతే తరిగి పోతుంది (Use and disuse of organs) అని ఆయన వివరణ సారాంశం. దీనిని పరీక్షించ టానికి "అగుస్తా వైస్ మెన్" అనే శాస్త్రవేత్త ఆడ, మగ ఎలుకలను తెచ్చి వాటి తోకలు కోసి వాటి మధ్య సంపర్కం ద్వారా వాటికి పుట్టే ఎలుకల తోకలు లేకుండా ఉన్నాయా అని పరిశీలించాడు. కానీ వాటి తోకలు మామూలుగా పొడుగ్గానే ఉన్నాయి. మళ్లీ వాటి తోకలను కోశాడు. వాటి మధ్య సంపర్కం ద్వారా తోకలు లేకుండా ఏమైనా పుట్టయా అని పరిశీలించాడు. మళ్లీ వాటికి పొడవైన తోకలే ఉన్నాయి. ఇలా దాదాపు 25 తరాల ఎలుకల తోకలను కత్తిరించి చూశాడు. ఎలాంటి మార్పు లేదు. పొడవైన తోకలతోనే పుట్టాయి. ఎన్ని తరాలు గడిచినా తోకలు లేని ఎలుకలు ఉత్పన్నం కావని అతడు చేసిన ప్రయోగం వల్ల నిర్ధారణకు వచ్చాడు. అంటే ఒక జంతువు తన జీవితకాలంలో పరిసరాల అవసరాన్ని బట్టి పొందిన మార్పులు దాని సంతానానికి సంక్రమిస్తాయి అని లామార్క్ చెప్పిన సూత్రం తప్పు అని తేలింది. మనం "జిమ్" కు వెళ్లి కండలు పెంచినంతమాత్రాన అవి మన బిడ్డలకు రావాలని లేదు కదా! అయితే మరి డార్విన్ చెప్పిన న్యాచురల్ సెలక్షన్ ఏంటి?

న్యాచురల్ సెలక్షన్ అంటే ఒక జీవి తన తల్లిదండ్రుల్లాగా కాకుండా వాటికి భిన్నంగా ఉంటూ, తన చుట్టూ ఉన్న వాతావరణ పరిస్థితుల్ని తట్టుకోగలిగితే అది బ్రతికి బట్ట కడుతుంది. వాతావరణానికి తట్టుకోలేకపోతే అది చచ్చిపోతుంది. అంటే మార్పులు రావాలి, వచ్చిన మార్పులు ఉపయోగకరమైనదిగా ఉండాలి. అలా వచ్చిన మార్పుల కారణంగానే ఈ ప్రపంచంలో ఇన్ని లక్షల జీవజాతులు, ఇంత వైవిధ్యం ఏర్పడిందని డార్విన్ ప్రతిపాదించాడు. చుట్టుపక్కల పరిసరాలతో, వాతావరణంతో సర్దుకుపోయే లక్షణం ఎక్కువగా ఉన్న ప్రాణులు జీవన సంఘర్షణలో నిలదొక్కుకుంటాయి. అలా లేనివి క్రమేపి కనుమరుగవుతాయి.

ఉదాహరణకు ఒక పచ్చిక బయలులో పురుగులు ఉన్నాయి అనుకుందాం. ఆ పురుగుల్ని పక్షులు తింటాయి. అయితే పచ్చిక రంగుతో కలిసిపోయే రంగు కలిగిన పురుగులు పక్షుల నుండి తప్పించుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పచ్చికతో కలిసి పోలేని రంగుగల పురుగులు కాలక్రమంలో క్షీణించి అంతరించిపోతాయి.

వేగంగా పరుగెత్తగల జింకలు క్రూర మృగాల నుండి ఎక్కువగా తప్పించుకో గలుగుతాయి. కనుక కొన్ని తరాల అనంతరం వేగంగా పరిగెత్తగల జింకలు మిగిలి ఉంటాయి. అలా లేనివి అంతరించిపోతాయి.

మరో ఉదాహరణ. ధ్రువ ప్రాంతంలో ఉండే ఎలుగు బంట్ల పిల్లల్లో దేనికైనా శరీరం మీద రోమ సంపద లేకపోతే అది దక్కదు. రోమ సంపద కలిగిన ఎలుగుబంట్లు చలి వాతావరణాన్ని ఎదుర్కొని నిలబడి తన

సంతానాన్ని అభివృద్ధి చేసుకోగలుగుతాయి.

అలాగే పెద్ద తోకగలిగిన మగ నెమలి పెట్ట నెమళ్లను ఆకర్షించి సంతానోత్పత్తి సాధిస్తుంది. అలాకాకుండా అందంగా పురి విప్పలేని మగ నెమలి పెట్ట నెమళ్లను ఆకర్షించ లేదు. అలా ఆకర్షించ లేకపోతే దాని సంతానాభివృద్ధి తగ్గిపోతుంది. కాలక్రమంలో ఆ జాతి అంతరించిపోతుంది.


ఏ విధమైన శరీర నిర్మాణం జీవి మనుగడకు సహాయకరంగా ఉంటుందో ఆ విధమైన శరీర నిర్మాణాన్ని ప్రకృతి ఇంకా ఇంకా ప్రోత్సహిస్తుంది. సహాయకరమైన లక్షణాలతో జన్మించిన వాటినే ప్రకృతి "సెలెక్ట్ "చేసి కొనసాగిస్తుంది. డార్విన్ చెప్పిన న్యాచురల్ సెలక్షన్ సారాంశం ఇదే.

దీని ప్రకారం జిరాఫీ పరిణామ క్రమాన్ని ఇలా చెప్పవచ్చు. చెట్ల ఆకులను తిని జీవించే జింకలను పోలిన జంతువులలో కొన్నింటికి మిగిలిన వాటికన్నా పొడుగు మెడలు, పొడుగు కాళ్లు ఉండేవి అనుకోండి. వాటికి ఎక్కువ ఆకులు అందటం వల్ల అవి ఎక్కువ కాలం జీవించే అవకాశం ఉంటుంది. వాటికి ఎక్కువ సంతానం కలిగేది. తిరిగి ఆ సంతానంలో ఎక్కువ పొడుగు మెడలు, పొడుగు కాళ్లు కలిగినవి చెట్టుపై కొమ్మల నుండి ఆకులను అందుకోగలిగి, ఎక్కువ కాలం జీవించి ఎక్కువ సంతానాన్ని కనేవి. ఇలాగా చెట్ల ఆకులను అందుకోవటంలో ఎక్కువ సమర్థత కలిగిన జంతువులు వృద్ధి కావడం వల్ల సుదీర్ఘకాలం, అసంఖ్యాక తరాలు గడిచిన తర్వాత నేటి జిరాఫీ అవతరించింది.

డార్విన్ చెప్పిన మరో అంశం ఏమంటే, చెట్లు కానివ్వండీ, జంతువులు కానివ్వండి వాటి మానాన వాటిని వదిలేస్తే అదేపనిగా సంతానాన్ని అభివృద్ధి చేస్తూ పోతాయి. ఏదో విధంగా ఎక్కువ భాగం నశించకపోతే వీటి సంఖ్య విపరీతంగా పెరిగిపోతుంది.

అయితే భూమ్మీద నివసించడానికి ఆధారం, ఆహారం పరిమితంగా ఉంటుంది. అందువల్ల ఒకే జీవజాతికి చెందిన ప్రాణులు కానీ, భిన్న జాతులకు చెందిన ప్రాణులు కానీ స్థలం కొరకు, ఆహారం కొరకు పరస్పరం సంఘర్షిస్తాయి. ఆ సంఘర్షణలో అత్యధిక భాగం నశిస్తాయి. కొన్ని వాతావరణంలో మార్పులకు తట్టుకోలేక చనిపోతాయి. కొన్ని ఇతర జంతువులకు ఆహారమైన నశిస్తాయి. మిగిలినవి తమలో తాము ఆహారం కొరకు ఘర్షణ పడి నశిస్తాయి. ఒక జాతి జంతువులు ఒకరకం ఆహారానికి అలవాటుపడి ఉంటాయి కదా. ఆ

**"జైళ్ళలో ఉన్న బాలలను రాత్రిపూట చేతులు వెనక్కు కట్టి, నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్ళి అక్కడ మంచినీళ్ళు కూడా ఇవ్వకుండా మూత్రం తాగమని ఇజ్రాయెల్ సైనికులు నిర్బంధిస్తున్నారని కమిషన్ నివేదికలో తెలిపింది. బాలలు, పెద్దలు, మహిళలు అన్న విచక్షణ చూపకుండా పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ సైనికులు లైంగిక నేరాలకు పాల్పడుతున్నారు. నిర్బంధించిన వారిని అండర్‌వేర్‌తో పాటు బట్టలన్నీ విప్పిస్తున్నారు. నగ్నంగా ఉన్న బాలల చేత నాట్యం చేయిస్తూ, వీడియోలు తీస్తున్నారు."**



చార్లెస్ డార్విన్ (ఇన్‌సెట్) ఆయన పయనించిన బీగిల్ నౌక

రకం ఆహారం అనంతంగా దొరకదు కనుక అవి తమలో తాము ఆహారానికై పోటీపడి చనిపోతాయి. అంటే తిరిగి సంతానోత్పత్తి చేయకముందే నశిస్తాయి. ఈ పోటీలో జీవన సంఘర్షణ (struggle for existence) లో మనుగడకు అర్హమైన శారీరిక లక్షణాలు కలిగినవే బ్రతుకుతాయి. సంతానోత్పత్తి చేస్తాయి. అలా చేయలేనివి అంతరించిపోతాయి.

ఉదాహరణకు స్టార్ ఫిష్ ఏడాదికి 10 లక్షలు గుడ్లు పెడుతుంది. కాడ్ చేప సాలీనా 60 లక్షలు గుడ్లు పెడుతుంది. ఒక అయిస్టర్ చేప 11 కోట్ల గుడ్లు పెడుతుంది. కుందేలు సాలీనా 70 పిల్లలను కంటుంది. ఒక రకం కప్ప ఏడాదికి 20 వేల గుడ్లు పెడుతుంది. మరో రకం కప్ప ఏడాదికి వెయ్యి గుడ్లు పెడుతుంది. ఇవన్నీ బ్రతికి బట్ట కడితే ఈ భూమండలం చాలుతుందా. ఏనుగు సగటున ఆరు పిల్లల్ని కంటుంది. ఎంత తక్కువ సంతానం కనే జంతువులను తీసుకున్న సరే అన్నీ బ్రతికి బట్ట కడితే వాటికి స్థలంగానీ, ఆహారం కానీ చాలదు.

ప్రతి ప్రాణీ.. జంతువు కానీ వృక్షం కానీ తన శరీరక లక్షణాలని తన సంతానానికి సంక్రమింప చేస్తుంది. లేకపోతే ఆ జాతి కొనసాగదు. కుక్కకు కుక్కే పుడుతుంది. కుక్కకు పుట్టే పిల్లల్లో స్వల్పమైన భేదాలు ఉంటాయి. సృష్టిలో ఏ ఒక్క ప్రాణి మరొకదాన్ని ముమ్మర్తులా పోలి ఉండదు. అలా పోలి ఉంటే ఒక జాతి నుండి మరొక జాతి ఆవిర్భవించే పరిణామమే జరగదు. ఒక తల్లికి పుట్టిన సంతానంలో స్వల్పమైన తేడాలు ఉంటాయి. ఈ తేడాలలో కొన్ని మనుగడకు సహాయకారిగా ఉంటాయి. మరికొన్ని హానికర మైనవి ఉంటాయి. హానికరమైన తేడాలు కలిగినవి నశించిపోతాయి. సహాయకరమైన తేడాలు కలిగినవి బ్రతుకుతాయి. అంతేకాక ఇవి సంతానోత్పత్తి చేసి తమ సహాయకరమైన తేడాలు తమ సంతానానికి అందిస్తాయి. ఈ సంతానం మళ్లీ సహాయకరమైన, హానికరమైన తేడాలతో జన్మిస్తాయి. అందులో మళ్లీ సహాయకరమైన తేడాలు గలవే బ్రతికి సంతానాన్ని కంటాయి. ఇలాగా తరం నుండి తరానికి ఒక జీవజాతి మార్పులు చెందుతూ కొనసాగుతూ ఉంటుంది. అనేక తరాలు గడిచేసరికి మొదటి

> **“ 2023, అక్టోబరు 7, 2025, అక్టోబరు 11 తేదీల మధ్య 564 పాఠశాల భవనాలలో 459 భవనాలను ఇజ్రాయెల్ సైనికులు పేల్చివేశారు. 2023, అక్టోబరు 7వ తేదీకి ముందు ఈ పాఠశాలలు రోజుకు రెండు, మూడు షిఫ్టులలో పనిచేస్తుండేవి. దెబ్బతిన్న 459 పాఠశాలలలో 4,87,712 మంది విద్యార్థులున్నారు. 18,740 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ”**

జంతువుకు చిట్టచివరి జంతువుకు ఎంతో తేడా కనిపిస్తుంది. కొన్ని లక్షల ఏండ్లు గడిచేసరికి ఒక కొత్త జాతి అవతరిస్తుంది.

డార్విన్ తన పరిశోధనా విషయాలన్నింటినీ ఒక నోట్స్ గా తయారు చేస్తున్నప్పుడు 1855లో ఆల్ఫ్రెడ్ రస్సెల్ వాలెస్ అనే శాస్త్రవేత్త “నూతన జాతుల ఆవిర్భావానికి ఆధార సూత్రాలు” అనే శీర్షికన ఒక వ్యాసం రాశాడు. దానిలోని భావాలు సరిగ్గా డార్విన్ సిద్ధాంతాన్ని పోలి ఉన్నాయి. డార్విన్ మిత్రులు మీకు రావలసిన ఘనత మరొకరికి పోవచ్చు వెంటనే మీ గ్రంథం ప్రచురించండి అని ఒత్తిడి చేశారు. డార్విన్‌కు ధైర్యం చాలక ఇంకా కొత్త సాక్షాలను సేకరిస్తూనే గడిపాడు. 1858 అంటే మూడేళ్ల తర్వాత ఆల్ఫ్రెడ్ రస్సెల్ వాలిస్ మరొక వ్యాసం రాసి డార్విన్‌కి పంపుతూ మీరు దక్షిణ పసిఫిక్ సముద్ర ప్రాంతంలోనూ, గెలా పగోస్ దీవులలో పరిశోధన చేశారు కదా, నేను సింగపూర్, మలేషియా ప్రాంతంలో తిరిగి పరిశీలన చేశాను నాకు ఇలా అనిపించింది. నా ఈ భావాలను పరిశీలించండి అని డార్విన్‌ను కోరాడు. ఆ వ్యాసాన్ని పరిశీలించిన డార్విన్ తాను 20 ఏళ్లు కష్టపడి రాసిన దానికి అది సంగ్రహ రూపం వలె ఉన్నట్లు అనిపించింది. వెంటనే తన గ్రంథాన్ని ప్రచురించాడు డార్విన్. ఆ గ్రంథం పేరే “జీవజాతుల పుట్టుక” (origin of species). తాను ఏ సిద్ధాంతాన్ని స్వతంత్రంగా పరిశోధించి రూపొందించాడో తనకన్నా చిన్నవాడైన ఆల్ఫ్రెడ్ రస్సెల్ వాలిస్ కూడా స్వతంత్రంగా ఆలోచించి దాన్నే రూపొందించాడు. అందుచేత ఆ ఘనత తమ ఇద్దరికీ సమానంగా చెందాలని భావించి తన గ్రంథాన్ని అలాగే వాలిస్ అభిప్రాయాలను పరిశీలించమని 1858లో లండన్ లోని లిన్నేయస్ సొసైటీకి సమర్పించాడు డార్విన్. అది డార్విన్ యొక్క గొప్ప ఉదాత్తత.

డార్విన్ పరిశోధనా ఫలితాలు మేధావులకు, ప్రజలకు అందడంతో క్రిస్టియన్ చర్చి తట్టుకోలేకపోయింది. ఎందుకు?

డార్విన్ చెప్పిన పరిణామ క్రమం అంతా బైబిల్ ప్రకారం 6500 సంవత్సరాల లోపు జరగాలి. బైబిల్ లోని “జెనిసిస్” అనే కథలో వర్ణనను బట్టి ప్రభువు ఆరు రోజులు కష్టపడి విశ్వాన్ని, భూమిని ,సూర్యుని, చంద్రుని, చెట్టు చామలను, నదులను, సరస్సులు సముద్రాలను, పశుపక్షాదులను, మనుషులను సృష్టించి ఏడవ రోజు విశ్రాంతి తీసుకున్నాడు. ఐరిష్ మత గురువు బిషప్ ఉషర్ అనే ఆయన ఇంకా కచ్చితంగా లెక్కలు గట్టి క్రీస్తుపూర్వం 4004 లో అక్టోబర్ 9 వ తారీఖున ఈ సృష్టి కార్యక్రమం ప్రారంభమైందని తేల్చాడు. కానీ ఆ కాలంలోనే ఉన్న భూగర్భ శాస్త్రవేత్తలు ‘హట్టన్’, ‘లయల్’ లాంటివాళ్ళు ఈ భూమి ఉపరితలం పొరలు పొరలుగా ఉందనీ, అన్నింటి కంటే పై పొర ఇటీవల కాలంలో ఏర్పడిందని, దాని కింది పొర అంతకుముందు ఏర్పడిందని, తిరిగి దాని కింద పొర ఇంకా పూర్వం ఏర్పడిందని, అట్టడుగున ఉన్నది అత్యంత ప్రాచీన కాలంలో ఏర్పడిందని, ప్రతి రాతి పొర 10 లక్షల సంవత్సరాల వయసును సూచిస్తుందని తేల్చారు. అందువల్ల భూమి వయస్సు కొన్ని వందలు, వేల యేండ్లు కాక, లక్షల ఏండ్లు కాక, కొన్ని కోట్ల సంవత్సరాలని వారు నిర్ధారించారు. ఈ ఇద్దరు శాస్త్రవేత్తల పరిశోధనలు వాస్తవానికి డార్విన్‌ను గొప్పగా ప్రభావితం చేసిన రచనలు. కానీ క్రిస్టియన్ చర్చికి ఆ రోజుల్లో చాలా పవర్ ఉండేది.

గెలీలియోను జైల్లో పెట్టి అప్పటికి 200 ఏండ్లు అయింది. గియార్డానో బ్రూనోను హత్య చేసి 225 ఏండ్లు అయింది. చర్చి ఆగడాలు తట్టుకోవడానికి చాలా శ్రమ పడవలసి వచ్చింది డార్విన్‌కూ, డార్విన్ అనుయాయులకూ. డార్విన్ ఎవరితో పేచి పెట్టుకోలేదు. కానీ వాస్తవాల ఆధారంగా క్రిస్టియన్ మతాన్ని మత నమ్మకాలను ఎంతో సైలెంట్‌గా ఎదిరించాడు. కేవలం బైబిల్ మాత్రవే కాదు అన్ని మతాలు, మత గ్రంథాలలోని నమ్మకాలను ఆయన పరిశోధన పటాపంచలు చేసింది. ఈ భూమ్మీద జీవులు, మనుషుల ఆవిర్భావంపై శాస్త్రీయమైన వెలుగు ప్రసరింపజేసిన డార్విన్ మానవాళి ఉన్నంత వరకు స్మరణీయుడుగానే ఉంటాడు. *

# అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో రైతుల దివాళా

**(26వ పేజీ తరువాయి)**

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో గ్రామీణ భారతం నూతన భావాలకు నిలయమౌతుంది. ఇపుడు పుట్టి పెరిగే తరాలు ఇటువంటి పాటలు వేరే గ్రహం నుండి వచ్చినట్లు భావిస్తాయి.

భౌగోళిక రాజకీయ వ్యూహాలు, అంతర్జా తీయ వాణిజ్య సంబంధాలపై నాకు తగినంత అవగాహన లేదని అంగీకరిస్తున్నాను. అయినప్ప టికీ ఒక వ్యవసాయదారునిగా, ప్రజా కళలను అధ్యయనం చేస్తున్న వానిగా భారతదేశ విధాన నిర్ణేతలకు వినయపూర్వకంగా ఒక సలహా ఇస్తున్నాను. పైకి కనిపిస్తున్నట్లుగా ఇది వాణిజ్యా నికి వ్యతిరేకంగా చేస్తున్న వాదన కాదు. వ్యవసాయ రంగంపై భారతదేశం అమెరికాతో ఒప్పందం చేసుకోవాలనుకుంటే అది పాల ఉత్పత్తులకు తప్పనిసరిగా రక్షణ కల్పించాలి. పోటీకి తట్టుకోలేని పంటలకు సుంకాల రక్షణ కల్పించటంతో పాటు, మార్కెట్లను తెరవటానికి ముందుగానే రైతులను స్థిరంగా నిలబెట్టటానికి అవసరమైన పెట్టుబడులు పెట్టాలి.

అన్నింటికన్నా ప్రధానమైనది చిన్న రైతులు ఈ దేశ పౌరులనీ, తర్వాతనే వారు ఉత్పత్తి దారులనీ, తాము ఎన్నుకున్న ప్రభుత్వం నుండి తగిన రక్షణలు పొందే హక్కు వారికి ఉన్నదనీ విధాన నిర్ణేతలు తప్పనిసరిగా గుర్తించాలి.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

# సారంపల్లి మల్లారెడ్డి

(2వ పేజీ తరువాయి)

ఆగస్టు 6న పోలీసు పటేల్ స్థానం నుంచి అయనను తొలగించింది. 74 మంది మీద కేసులు బనాయించి మల్లారెడ్డితో సహా జైల్‌కు పంపింది. ఈ పోరాటంలో 110 ఎకరాల సాగు భూమిని పేదలు సాధించుకున్నారు. ఈ నిర్భంధ కాలంలో పోరాడుతున్న పేదలకు అండగా నిల్చేందుకు పార్లమెంట్ సభ్యులుగా వున్న పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు కామ్రేడ్ ఎ.కె గోపాలన్ ఆగస్టు 18న నర్సంపేట గ్రామాలను సందర్శించారు. వరంగల్ జిల్లా ప్రజల హృదయాలలో బలమైన స్థానం సంపాదించిన నేత కామ్రేడ్ ఓంకార్ దారితప్పినప్పుడు ఉద్యమం పెద్ద కుదుపునెదుర్కొన్నది. అలాంటి క్లిష్ట సమయంలో పార్టీని నిలబెట్టేందుకు సర్వశక్తులొడ్డిన ఐదారుగురు నాయకులలో మల్లారెడ్డి ఒకరు. 16 మంది ఉన్న జిల్లా కమిటీలో 8 మంది, 15 మందితో ఉన్న నర్సంపేట తాలూకా కమిటీలో 10 మంది పార్టీని వీడివెళ్ళారు. 3250 మంది పార్టీ సభ్యులలో కేవలం 1450 మంది మాత్రమే మిగిలారు. వీరిలో మూడింట రెండు వంతులు జనగాం తాలూకాలోనే ఉన్నారు. దుందుడుకు ఎత్తుగడులతో పాటు అవినీతి, నైతిక విలువల పతనాన్ని కూడా ఓంకార్ సమర్ధించాడు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీని కాపాడుకోవడం కోసం తన సహచరులతోరపాటు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి పట్టుదలతో కృషి చేశారు. వయసు కారణంతో కమిటీల నుంచి తప్పుకున్నా ప్రజలపట్ల, ప్రజా ఉద్యమాలపట్ల తనకున్న బాధ్యతనుంచి మాత్రం తప్పుకోలేదు.

మార్పు సహజం కదా. సమాజంలో అనేక మార్పులు చూస్తున్నాం కదా. ఆ ప్రభావాలు ఉద్యమాలను కూడా వదలవు కదా. ఇదొక పరీక్షా కాలం. కాల పరీక్షకు తట్టుకొని, నిటారుగా నిలబడి ముందుకే సాగిన నేత సారంపల్లి. ప్రపంచీకరణ యుగంలో లాభం కోసం ఏ గడ్డి కరవడానికైనా సిద్ధపడే కాలమిది. పదవులు, సౌకర్యాల కోసం వెంపర్లాడే రోజులివి. ఆయన వయసుకు, ఆరోగ్య పరిస్థితులకు సహజంగానే కొన్ని సౌకర్యాలు అవసరం అయినా, ఆయన ఏనాడూ కోరుకోలేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల మారుమూల ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులే ప్రయాణ సాధనాలుగా వాడిన నాయకుడాయన. నిరాడంబరతకు నిలువుటద్దం. ఆయన మేధోసంపత్తిని గమనించిన వారికి సహజంగానే ఆయనకొక రీడింగ్ రూం, ఏసితో కూడిన బెడ్రూం, మంచి సౌకర్యాలతో కూడిన హాలు వున్న మంచి నివాసంలోనే ఆయన ఉంటారు అనుకుంటారు. ఆయన 24 సంవత్సరాలు నివసించిన అద్దె ఇల్లు చూసిన వారు నిశ్చేష్ఠులౌతారు. ఆయనకు ఎదురుగా మరొకరు కూర్చునే స్థలం కూడా లేదని చాలా మందికి తెలియదు. చివరిదశలో కార్పొరేట్ హాస్పిటల్‌కే పోదామన్న యువ కార్యకర్తను నివారించి, నిమ్స్‌లోనే చేరారాయన. కార్పొరేట్ వైద్యం కోసం ఆయన ఆరాటపడలేదు. తన అనారోగ్యం పట్ల ఆయన భయపడలేదు. ఆయన ఆరోగ్యం పట్ల ఆందోళన చెందిన యువ కార్యకర్తకు కార్పొరేట్ దోపిడీ గురించి చెప్పి ఒప్పించిన నేత ఆయన. తన ఉద్యమ సహచరులు చంద్రారెడ్డి మరణించిన సమయంలో మాత్రం కొంచెం చలించారు. మరో సహచరుడు కళ్ళేపు వెంకటయ్య కూడా అక్కడే ఉన్నారు. ఆ సమయంలో "ముగ్గురం ఒకేసారి పోతే బాగుండు" అన్న మల్లారెడ్డి గారి మాటలు కదిలించాయి.


మల్లారెడ్డి 1973 జూన్ 12 న లాంఛనంగా పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. క్రమంగా ప్రజా ఉద్యమాలతో మమేకమవుతూ రాష్ట్ర స్థాయి నాయకులుగా ఎదిగారు. నర్సంపేట పట్టణంలో పార్టీని ప్రారంభించడంలో ప్రత్యేక కృషి చేశారు. ఎమర్జెన్సీ కాలంలో నక్సలైట్ ఉద్యమం మీద వెంగళరావు ప్రభుత్వం ప్రయోగించిన నిర్బంధం, ఎన్‌కౌంటర్ల పైన 1974లో భార్గవ కమిషన్ వేశారు. ఈ కమిషన్ ముందు ప్రభుత్వ దౌర్జన్యాలను రుజువు చేసేందుకు పార్టీ ప్రధాన కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య గారికి కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి సహాయం పడ్డారు. 1978 ప్రాంతంలో నర్సంపేట, మహబూబాబ్‌బాద్, ములుగు, జనగాం, వరంగల్ ప్రాంతాలల్లో భూ పోరాటాలు జరిగాయి. 8,230 మంది పేదలు 6,100 ఎకరాలు భూమి అక్రమించుకున్న పోరాటం అది. 1983లో భూస్వాముల స్వాధీనంలో ఉన్న సీలింగ్ భూములు పేదలు అక్రమించారు. 4,500 ఎకరాల భూమి పేదల స్వాధీనంలోకి తీసుకున్న సందర్భంగా పార్టీ పైన తీవ్ర నిర్భధం సాగింది. ఆ సందర్భంగా సారంపల్లి మల్లారెడ్డి రహస్య జీవితం గడపవల్సి వచ్చింది. 1981 జూన్ 12 నుండి 1988 మార్చి 31 వరకు తిమ్మంపేట సర్పంచ్‌గా పనిచేశారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఆదర్శ ప్రాయమైన కృషి చేశారు. జిల్లాలో శ్రీరాం సాగర్ ప్రాజెక్టు రెండవ దశ నిర్మాణం కోసం, వరద కాలువ నిర్మాణం కోసం నిధులు కెటాయించాలని సాగిన ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించారు.

ఒక కమ్యూనిస్టుగా, రైతాంగ ఉద్యమ కారుడుగా ఆస్తిని త్యజించారే తప్ప, ఆశించలేదు. ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందన్నది సారంపల్లి మల్లారెడ్డి విషయంలో అక్షర సత్యం. ఆయన జీవిత భాగస్వామి భాగ్యలక్ష్మి పాత్ర అలాంటిది. తెల్లవారుజామున మల్లారెడ్డి బయలుదేరారంటే అంతకు ముందే భాగ్యలక్ష్మి ఏర్పాట్లు చేశారని మనం అర్ధం చేసుకోవాలి. నిర్మొహమాటంగా మాట్లాడటం ఆయన స్వభావం. ఉద్యమంలో అనుభవం గడించిన వారు, నిర్మాణ దక్షతగల వారు నాయకత్వం వహించాలన్నది ఆయన బలమైన అభిప్రాయం. సర్పంచ్ మొదలు పార్లమెంటు సభ్యుల వరకు గన్ మెన్లు లేకుండా బయట అడుగుపెట్టని కాలమిది. గన్ మెన్ ఉండటం ఒక హోదాగా మారిందని ఆయన భావన. నిర్బంధ కాలంలో కూడా ప్రజలే నాయకులను రక్షించుకుంటారని బలంగా నమ్మారు. తనకు కేటాయించిన గన్ మెన్ను తిప్పి పంపించారు. ప్రంచీకరణ నేపథ్యంలో సమాజం డబ్బు ప్రపంచంగా మారిందని, దాని ప్రభావం ప్రజా ఉద్యమాల మీద, పార్టీ శ్రేణుల మీద కూడా పడుతుందని వారు చెప్పేవారు. విలాసవంతమైన జీవితాలకు అలవాటు పడటం, అవినీతి, నైతిక విలువల పతనం పట్ల ఆందోళన వ్యక్తం చేసేవారు. పార్టీ శ్రేణుల మీద వీటి ప్రభావాల గురించి హెచ్చరించారు. సుదీర్ఘకాలం పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అమలులో ఉన్నందున పార్లమెంటరీ ధోరణుల గురించి కూడా తగు జాగ్రత్తలు అవసరం అనేవారు. పార్లమెంటరీ స్థానాలకు పోటీ పెట్టేవారికి కూడా తగు అర్హతలు ఉండాలని వారు భావించారు. ప్రజా సంఘాలు సభ్యత్వం చేర్పించడమే కాకుండా స్థానిక సమస్యల మీద పోరాటాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని అయన చెప్పేవారు. కమ్యూనిస్టు ఉద్యమంలో కూడా అస్తిత్వవాద ధోరణుల ప్రభావం ఆయనను కలిచివేసింది. పార్లమెంటరీ ధోరణులు, వినిమయవాదం విస్తరించిన నేటి కాలంలో విప్లవం కోసం తపించే కార్యకర్తలకు, యువతరానికి ఆదర్శం సారంపల్లి మల్లారెడ్డి జీవితం.

*

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 22, issue: 4 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# ఆందోళన లేనిదే అభివృద్ధి లేదు



-యూజిన్ డెబ్స్

ఆందోళన అనేది ఒక ప్రకృతి సూత్రం. ప్రకృతి శూన్యాన్ని అసహ్యించుకునేట్లే నిశ్శబ్దాన్ని కూడా అసహ్యించుకుంటుంది. కొందరు దీనికి అభ్యంతరం చెప్పొచ్చు. కొండలను చూపించి అవి ఎంత నిశ్చలంగా ఉన్నాయో చూడండి అని తమ సిద్ధాంతాన్ని సమర్ధించుకోవచ్చు. కానీ ఆ కొండలు కూడా ఆందోళన ఫలితమేనన్న విషయం వారు మరిచిపోతున్నారు. సముద్రం ఎన్నడూ నిశ్చలంగా ఉండదు. నిత్యం అలలు పడుతూ లేస్తూ ఉంటాయి. తుపానుకు ముందు 'ప్రశాంతత' ఉంటుంది. కానీ అది తుపానుకు సూచన మాత్రమే.

శాంతియుతంగా చక్కదిద్దుదాం అనుకునేవారూ, నిశ్శబ్ద, నిశ్చల, బద్దకపు జీవులూ, స్థబ్దతను గొప్పగా చెప్పుకునేవారూ ఎన్నటికీ విజయం సాధించలేరు. ప్రకృతి ఆందోళన కోరుతుంది. అందువల్లనే గాలివానలొస్తాయి. తుపానులొస్తాయి. మెరుపులూ, ఉరుములూ పుడతాయి. అగ్నిపర్వతాలు బద్దలవుతాయి. భూ కంపాలు సంభవిస్తాయి. వాటిని దుష్ట శక్తులన్నా ఉపయోగం ఏమీ లేదు. అవన్నీ స్దబ్దతకు వ్యతిరేకంగా సంభవించే నిరంతర నిరసనలు.

శాంతి, శాంతి అని అరవచ్చు. కాని శాంతి ఎక్కడా లేదు. పంచభూతాలమధ్య యుద్ధం కొనసాగుతుంది. శాంతి కోసం ఆరాటపడేవారంతా ఆందోళనా కారులే. నిత్యం దైవ ప్రార్ధన చేసే పూజారి ఆందోళనా కారుడే. మతనమ్మకాలూ, మూఢవిశ్వాసాలపై తిరుగుబాటు చేసే వారు బహుశా మరింత ఉధృతమైన ఆందోళన కారులు. ... ప్రపంచాన్ని పరిశోధించేవారంతా ఆందోళనాకారులే. మతంలోనూ, నైతిక విలువల్లోనూ, సైన్సులోనూ, ప్రభుత్వంలోనూ, భూగోళశాస్త్రంలోనూ ఇంకా చెప్పాలంటే మానవ కార్యకలాపాలకు సంబంధించిన అన్ని విభాగాల్లోనూ మార్గదర్శకులంతా ఆందోళనాకారులే. కృషి ప్రారంభించిన ప్రారంభంలోనే ఎవరూ, ఎన్నడూ ప్రతిష్ట సంపాదించలేదు. వాళ్లంతా సహజంగానే ప్రారంభంలో అపహాస్యానికీ, అవమానాలకూ, నిర్లక్ష్యానికీ, పేదరికానికీ గురయ్యారు. తరచూ శిక్షలు కూడా అనుభవించారు. వీటినుండి తప్పుకున్న వారు చాలా కొద్ది మందిమాత్రమే.....కానీ వారంతా చివరికి మానవజాతికి మేలు చేయడంలో విజయాలు సాధించారు.

కార్మిక ఆందోళనాకారులగురించి ఇప్పుడు కొందరు చులకనగా మాట్లాడుతున్నారు. యజమాని నిశ్చలత్వాన్ని, నిలకడను కోరుకుంటాడు. పూర్తిగా ఒంటరిగా ఉండాలనుకుంటాడు. కాని ఆందోళనాకారుడు అలా ఎన్నటికీ కోరుకోడు. కార్మిక సమస్య వెనుక లెక్కకట్టలేనంత శత్రుత్వం దాగి ఉంటుంది. కార్మిక ఆందోళనా కారులు దీన్ని వెలికి తీసి నగ్నంగా ప్రదర్శించడానికీ, ఎండగట్టడానికీ, అంతిమంగా ప్రపంచంలో అది లేకుండా చేయడానికీ ప్రయత్నిస్తారు.....

**(యూజిన్ డెబ్స్ (1855-1926) అమెరికా రైల్వే యూనియన్ నాయకుడు, సోషలిస్టు పార్టీ నాయకుడు. మొదటి ప్రపంచ యుద్ధాన్ని విమర్శించినందుకు అరెస్టయి జైల్లో ఉంటూనే అమెరికా అధ్యక్ష పదవికి పోటీచేసి 10 లక్షల ఓట్లు తెచ్చుకున్నాడు. 'ఆందోళన - ఆందోళనాకారుడు' అన్న పేరుతో ఆయన రాసిన వ్యాసంలోనిది పై వ్యాఖ్యానం. 1890 ఆగస్టులో లోకోమోటివ్ ఫైర్‌మెన్స్ మ్యాగజైన్‌లో వ్యాసం ప్రచురించబడింది.)**

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా రూ. **180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

**ఇంటి నెంబరు**.........................................................
**వీధి**.........................................................
**గ్రామం**.........................................................
**మండలం లేదా పట్టణం**.........................................
**జిల్లా**.........................................................

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.